Published by Telangana

TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

## విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "సత్యమేవ జయతే" తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్గా పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సవంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. రిపోర్టర్లుగా అపాయింట్మెంట్ అయిన తర్వాత వారికి లైన్ అకౌంట్ కూడా ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9959479375

సంపుటి : 01 సంచిక : 259 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్ మంగళవారం14-10-2025 పేజీలు : 12 వెల : 2/-

## హమాస్ బందీల విడుదల



### -ట్రంప్‌కు మోదీ కితాబు

న్యూఢిల్లీ ఇజ్రాయెల్-హమాస్ మధ్య సంధి కుదిరి, హమాస్ తమ వద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయేలీలను విడుదల చేసింది. ఈ పరిణామాన్ని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. రెండేళ్లకు పైగా హమాస్ చెరలో ఉన్న బందీల విడుదలను స్వాగతిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బందీల స్వేచ్ఛ సంబంధిత కుటుంబాల ధైర్యానికి, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్థిరమైన శాంతి ప్రయత్నాలకు, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు దృఢ సంకల్పానికి గుర్తింపుగా నిలుస్తుందని మోదీ అన్నారు. ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళిక తొలిదశలో భాగంగా ఇజ్రాయెల్, హమాస్‌లు ఇటీవల కాల్పుల విరమణకు అంగీకారం తెలిపాయి. ఈ క్రమంలో 20 మంది బందీలను హమాస్ ఇజ్రాయెల్‌కు అప్పగించింది. త్వరలో 28 మంది ఇజ్రాయెల్ పౌరుల మృతదేహాలను అప్పగించనుంది. ఈ క్రమంలో ఇజ్రాయెల్ పాలస్తీనా ఖైదీలను విడుదల చేసింది.

## సీఆర్డీఏ భవనం ప్రారంభం మన అభివృద్ధి యాత్రకు ఆరంభం



### అమరావతి రైతులను మరచిపోమన్న సీఎం చంద్రబాబు

అమరావతి 'రాజధాని అభివృద్ధి కోసం ప్రతి రోజూ వేంకటేశ్వర స్వామిని ప్రార్థిస్తాను. త్వరలో అమరావతి రైతులతో ప్రత్యేకంగా సమావేశం అవుతాను. అమరావతి రైతులను మరిచేదే లేదు ఎలాంటి అనుమానం అక్కర్లేదు. అందరం కలిసి రాజధానిని అభివృద్ధి చేసుకుందాం'అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాజధాని అమరావతిలో సీఆర్డీయే కార్యాలయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ప్రతి ఫ్లోర్‌లోకి వెళ్లి పరిశీలించారు. అనంతరం సీఆర్డీయే కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో రైతులను ఉద్దేశించి ప్రసంగించారు.'రాజధాని నిర్మాణానికి భూ సమీకరణ అనే కొత్త విధానాన్ని తెచ్చాం. సమీకరణ విధానాన్ని సక్సెస్ చేసిన చరిత్ర అమరావతి రైతులదే'అని

మిగతా 2లో


# మంత్రుల మధ్య ముదురుతోన్న వివాదాలు

## స్థానిక ఎన్నికలపై ఎఫెక్ట్ పడుతుందా.?

హైదరాబాద్ తెలంగాణలో పలువురు మంత్రుల మధ్య వివాదం కొనసాగుతోందని తెలిసిందే. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ తనను అవమానించేలా మాట్లాడారని, క్షమాపణ చెప్పాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. వివాదం పెద్దది అవకూడదని భావించి మంత్రి పొన్నం ప్రభాకర్ క్షమాపణ చెప్పడంతో అంతా సర్దుకున్నట్లే అనిపించింది. కానీ ఇదే వివాదంలో మంత్రి వివేక్ వెంకటస్వామిపై అడ్లూరి లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలపై వివాదం సద్దుమణగలేదు. కులం ఆధారంగా కొందరు తనపై కుట్రచేస్తున్నారని వివేక్ ఆవేదన వ్యక్తంచేశారు.

**అడ్లూరి లక్ష్మణ్ పై వివేక్ విమర్శలు..**

నిజామాబాద్‌లో జరిగిన మాలల ఐక్య సదస్సులో మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించే బాధ్యత నామీద ఉంది. పార్టీ గెలిస్తే కాంగ్రెస్ లో నాకు మంచి పేరు వస్తుందని కొందరు కులం కార్డుతో కుట్రలు చేస్తున్నారు. ఆ సమావేశంలో నేను ఎవరినీ ఏమీ అనలేదు. కానీ విషయంపై వివేక్ స్పందించలేదని అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. నేను మీటింగ్ లో నా ఫోన్ చూసుకుంటున్న. ఎవరినీ కించ పరచలేదు. ఆ తరువాత మరో మీటింగ్ జరిగితే అడ్లూరి లక్ష్మణ్ పక్కనే కూర్చొన్నాను. కానీ తాను మాదిగ అని అంటూ మాలలు తనను తక్కువ చేస్తున్నారనేలా మాట్లాడటం సరికాదు. అడ్లూరి లక్ష్మణ్ ను ప్రోత్సహించింది మా నాన్న వెంకటస్వామి (కాకా). నా తండ్రి వెంకటస్వామి జయంతి కార్యక్రమం కార్డులో అడ్లూరి లక్ష్మణ్ పేరు లేదని విమర్శించాడు. కానీ మంత్రి శ్రీధర్ బాబు తండ్రి జయంతి కార్యక్రమం కార్డులోనూ ఎవరి పేరు వేయలేదు. కొందరూ అడ్లూరి లక్ష్మణ్‌కు విషం ఎక్కిస్తున్నారు. దాంతో నాకు సంబంధం లేకున్నా వివాదాల్లోకి లాగే ప్రయత్నం చేస్తున్నారని' వివేక్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవిపై తనకు వ్యామోహం లేదని, దళితుల కోసం పోరాటం చేస్తున్న తనపై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.



**స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన అడ్లూరి లక్ష్మణ్..**

నిజామాబాద్‌లో మాల సోదరుల ఆత్మీయ సమ్మేళనంలో సహచర మంత్రి వివేక్ తన గురించి మాట్లాడటం బాధాకరమన్నారు మంత్రి అడ్లూరి లక్ష్మణ్. జయంతి కార్యక్రమాల్లో పేరు లేదని నేనెక్కడా మాట్లాడకపోయినా వివేక్ ఆ విషయాన్ని తనకు ఆపాదించారని ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ వివేక్ తండ్రి వెంకటస్వామి జయంతి వేడుకలు ధర్మపురిలో నిర్వహించిన తరువాతే నేను హైదరాబాద్ బయలుదేరాను. నా శాఖ కార్యక్రమానికి వచ్చి వస్తాడా రాడా వెళ్లిపొమ్మంటారా అని మాట్లాడటం సరికాదు. మంత్రి పొన్నం ప్రభాకర్ నన్ను జంతువుతో పోల్చి మాట్లాడతే కనీసం ఖండించలేదని బాధతో అడిగాను. మరుసటి రోజు వివేక్ వ్యక్తిగతంగా ఫోన్ కాల్ చేస్తాడని భావించా. కానీ అలా జరగలేదు. నేడు నిజామాబాద్‌లో వ్యక్తిగతంగా నా పేరు తీయడం, నాపై విమర్శలు చేయడాన్ని వివేక్ విజ్ఞతకే వదిలేస్తున్నా. నేను కాంగ్రెస్ నేతను. ఏమైనా సమస్య వస్తే రాష్ట్ర క్యాబినెట్ మంత్రి హోదాలో ఉన్నవారు కూర్చుని మాట్లాడుకోవాలి. ఇలా టార్గెట్ చేసి కామెంట్స్ చేయడం బాధాకరం. తోటి మంత్రి దళితుడిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించకపోగా అడిగినందుకు నన్ను తప్పు పడుతున్నారు. ఏం జరిగినా సరే.. నేను పార్టీ గీత దాటే వ్యక్తిని కాదని' అడ్లూరి స్పష్టం చేశారు.

**పీసీసీ చీఫ్ కు ఎవరి మీద ఫిర్యాదు చేయలేదు - మంత్రి సీతక్క**

సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధి విషయంలో ఇద్దరు మంత్రుల మధ్య విభేదాలు అంటూ మీడియాలో వార్తలు వచ్చాయి. మీడియాలో వచ్చిన వార్తలను పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్ళానని మంత్రి సీతక్క తెలిపారు. వీలైనంత త్వరగా వివాదానికి ఫుల్ స్టాప్ పడేలా చూడాలని పీసీసీ చీఫ్ ను కోరానన్నారు. ఆదివాసి వీర వనితలు సమ్మక్క సారలమ్మ ఆలయం అభివృద్ధి పనుల చుట్టూ ఏ చిన్న పాటి వివాదం ఉండకూడదన్న ఉద్దేశంతో స్థానిక

మిగతా 2లో



## రాహుల్ గాంధీకి సుప్రీంలో చుక్కెదురు

### -ఓట్ చోరీపై ప్రజా ప్రయోజన వ్యాజ్యం తిరస్కరణ

న్యూఢిల్లీ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గొత కొద్ది కాలంగా అధికార బీజేపీ, ఓట్ చోరీకి పాల్పడుతోందని ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఎన్నికల సంఘంతో కలిసి ఓట్లను చోరీ చేస్తున్నారని అంటున్నారు. ఈ నేపథ్యంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరిపించాలని కోరుతూ సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. అయితే ఈ పిల్‌ను సుప్రీం తోసిపుచ్చింది. ఈ మేరకు పిటిషన్‌ను పరిశీలించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చిలతో కూడిన ధర్మాసనం విచారించేందుకు నిరాకరించింది. ఈ విషయంలో ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. ఫిర్యాదు చేసినా ఎలక్షన్ కమిషన్ ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదని పిటిషనర్ సుప్రీం కోర్టు ధర్మాసనానికి తెలియజేశారు. దీనిపై స్పందించిన ధర్మాసనం రాజకీయ అంశాలకు కోర్టులను వేదిక చేయవద్దని ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలని స్పష్టం చేసింది. కాగా, ఎలక్టోరల్ రోల్స్‌లో అనేక అవకతవకలు జరిగాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. దాని వల్ల

మిగతా 2లో


## బీసీ రిజర్వేషన్లపై రేవంత్ సర్కార్ సరికొత్త వ్యూహం

### -సుప్రీంలో తేల్చుకుందామని నిర్ణయం.?

హైదరాబాద్ హైకోర్టు బ్రేక్ వేసినా, బీసీ రిజర్వేషన్ల విషయంలో వెనక్కు తగ్గేదే లేదంటోంది తెలంగాణ ప్రభుత్వం. తాజాగా సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటీషన్ దాఖలు చేసింది. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 9పై ఇటీల హైకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. పూర్తి ఆర్డర్ కాపీని పరిశీలించిన తరువాత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో

మిగతా 2లో

## ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ



### కర్నూలు సభకు రావాలని ఆహ్వానం

న్యూఢిల్లీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు న్యూఢిల్లీ లో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ప్రభుత్వాధినేతగా 25 సంవత్సరాలు పూర్తి చేసిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకే ప్రయోజనం చేకూర్చే "నెక్స్ట్ జెన్ జీఎస్టీ" సంస్కరణలను ప్రధాని మోదీ నాయకత్వంలో అమలు చేసినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. జీఎస్టీ తాజా సంస్కరణల వల్ల ఆర్థిక లాభాలు, ప్రజలకు నేరుగా సేవింగ్స్ అందుతున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు. కర్నూలులో నిర్వహించనున్న ' సూపర్ జీఎస్టీ %-% సూపర్ సేవింగ్స్

మిగతా 2లో



## నాపై ఫిర్యాదు చేయడానికి ఏమిలేదు

### -కొండా సురేఖ ఫిర్యాదుపై పొంగులేటి

## జూబ్లీహిల్స్‌లో పోరు ప్రారంభమైంది

### -నిజం, ధర్మం మన వైపు ఉందన్న కేటీఆర్



2లో

## రూ.3 లక్షలు తిరిగి ఇచ్చేలా ఆదేశించండి

### -మద్యం పాలసీపై హైకోర్టులో పిటిషన్



2లో

## గోపన్న ఆశయాలను ముందుకు తీసుకు వెళ్దాం

### -భర్తను తలుచుకుని కంటతడి పెట్టిన మాగంటి సునీత



2

# మంత్రుల మధ్య ముదురుతోన్న వివాదాలు

ఎమ్మెల్యేగా, మంత్రిగా పిసిసి చీఫ్ దృష్టికి మీడియాలో వచ్చిన వార్తలను తీసుకెళ్లాను. సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధి పనులు అత్యంత ప్రాధాన్యమైనవి. వాటి చుట్టూ ఎలాంటి అపార్థాలు లేకుండా, పనులు సజావుగా పూర్తి కావాలి. సున్నితమైన అంశం కావడంతో, వీలైనంత త్వరగా అపార్థాలు తొలగిపోయి అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా ముందుకు సాగేలా చూడమని కోరాను. అంతే తప్ప నేను ఎవరి మీద పిసిసి చీఫ్ కు ఫిర్యాదు చేయలేదు. మేడారం ఆలయం అభివృద్ధి మన అందరి బాధ్యత. పనులు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా కొనసాగిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు.

**పొంగులేటి వర్సెస్ కొండా సురేఖ..**

తన శాఖలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పెత్తనం ఏంటని మంత్రి కొండా సురేఖ అసహనం వ్యక్తం చేస్తున్నారు. మేడారం పనుల టెండర్లను తన అనుచరుడికి పొంగులేటి ఇప్పించే ప్రయత్నం చేయడం వివాదానికి కారణమైనట్లు తెలుస్తోంది. ఏడు కోట్ల విలువైన టెండర్లకు సంబంధించి తన ప్రమేయం లేకుండా పొంగులేటి నిర్ణయాలు తీసుకునే ప్రయత్నం చేయడంతో కాంగ్రెస్ అధిష్టానానికి ఫిర్యాదు చేయాలని కొండా సురేఖ సిద్ధమైనట్లు ప్రచారం జరిగింది. ఇది తనకు అప్పగించిన మేడారం ఆలయం పనులు కనుక, సమస్య నిజమైతే వారితో మాట్లాడి పరిష్కరించాలని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి సీతక్క తీసుకెళ్లారు. తమపై సీతక్క కంప్లైంట్ చేశారని సహచర మంత్రులు అనే వరకు విషయం వెళ్లింది. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే ఆ మాత్రం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో తెలంగాణ మంత్రులు ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరిస్తుండటం సీఎం రేవంత్ రెడ్డికి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు తలనొప్పిగా మారుతోంది.

# జూబ్లీహిల్స్‌లో పోరు ప్రారంభమైంది

హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో పోరు మొదలైందని, ప్రజలంతా బీఆర్ఎస్ వెంటే ఉన్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. నిజం, ధర్మం కూడా బీఆర్ఎస్ పక్షానే ఉన్నాయని ఆయన అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్‌నగర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగిస్తూ, కాంగ్రెస్ పార్టీ గురించి, రేవంత్ రెడ్డి గురించి హైదరాబాద్ నగర ప్రజలకు బాగా తెలుసని, అందుకే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా దక్కలేదని అన్నారు. అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించిందని గుర్తుచేశారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ప్రజలు సైతం ఇప్పుడు ఆగ్రహంతో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క ముస్లిం ఎమ్మెల్యే కానీ, ఒక్క ముస్లిం ఎమ్మెల్సీ కానీ లేరని ఆయన విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అజారుద్దీన్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుండి పోటీ చేశారని, ఈసారి కూడా ఆయన టిక్కెట్ ఆశిస్తారని భావించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయనను తప్పించేందుకు కేవలం కాగితంపై 'ఎమ్మెల్సీ' అని రాసి మోసం చేశారని విమర్శించారు. అజారుద్దీన్‌కు ఇచ్చే ఎమ్మెల్సీ నిలబడదని రేవంత్ రెడ్డికి తెలుసని అన్నారు. ఈ విషయం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని ఆయన తెలిపారు. షేక్‌పేటలో కబరస్థాన్‌కు ఇచ్చిన స్థలం కూడా ఆర్మీకి చెందినదని, అది కూడా కోర్టులో నిలబడదని ఆయన అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అని చెప్పారని, అది కూడా కోర్టులో నిలబడలేదని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డికి అన్నీ తెలిసినా ప్రజలను మోసం చేయడానికి ఇలాంటి పనులు చేస్తున్నారని ఆయన విమర్శించారు. బీసీలను, మైనార్టీలను ముఖ్యమంత్రి మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు గట్టిగా బుద్ధి చెబితే, ఢిల్లీలోని అధిష్ఠానం సైతం ఉలిక్కిపడుతుందని వ్యాఖ్యానించారు. ప్రజలు మోసపోయి ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం నెలకొందని అన్నారు. దుర్గాదేవిలాగా, కాళికాదేవిలాగా కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతామని ఇప్పుడు ప్రతి మహిళ అంటోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దొంగ ఓట్లు నమోదు చేయించిందని ఆయన ఆరోపించారు. ఒక ఇంట్లో అయితే ఏకంగా 43 దొంగ ఓట్లు నమోదు చేయించారని అన్నారు. కాంగ్రెస్ ఒక్కో వర్గానికి చాలా బాకీ పడిందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ బాకీ కార్డును ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. పెన్షన్ పెంపు, మహిళలకు నెలకు రూ. 2,500, నిరుద్యోగ భృతి ఇలా అన్నీ కాంగ్రెస్ బాకీలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు.

# సీఆర్డీఏ భవనం ప్రారంభం మన అభివృద్ధి యాత్రకు ఆరంభం

సీఎం చంద్రబాబు నాయుడు కొనియాడారు.

**ల్యాండ్ పూలింగ్ విధానం తీసుకొచ్చి సక్సెస్ అయ్యాం**

'ప్రపంచంలో ఎక్కడా ల్యాండ్ పూలింగ్ విధానం లేదు, మనమే ఈ విధానాన్ని తెచ్చాం, సక్సెస్ చేశాం. అమరావతి పనుల రీ-స్టార్ట్ తర్వాత మొదటిగా సీఆర్డీఏ బిల్డింగ్ ప్రారంభమైంది నాకు సంతోషంగా ఉంది'అని సీఎం చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. 'అమరావతి మహిళా రైతులు రోడ్డెక్కి పోరాడారు అనేక ఉద్యమాలు చేశారు. రైతుల ఉద్యమానికి మద్ధతుగా నేను కూడా జోలె పట్టాను ఉద్యమానికి అండగా నిలిచాను. పడిన కష్టాలు మరిచిపోవద్దు మీరు చేసిన త్యాగాల ఫలితాలను మీరే అనుభవించాలి నేను దానికి పూర్తిగా కట్టుబడి ఉన్నాను'అని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు.

**సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో అమరావతి ప్రాజెక్టు నిర్మాణం**

'ఫేజ్-1లో ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చారు, భూములిచ్చినందుకు గత పాలకులు మిమ్మల్ని నానా హింసలు పెట్టారు. రాజధాని ఎడారి అన్నారు, వేశ్యల రాజధాని అన్నారు. ఎంతో అపహాస్యం చేశారు. మీకు రెట్టింపు గౌరవం దక్కేలా రెట్టింపు ఫలాలు అనుభవించేలా మేము చేస్తాం'అని సీఎం చంద్రబాబు నాయుడు రైతులకు భరోసా కల్పించారు. 'హైటెక్ సిటీ నిర్మాణం మొదలు పెట్టే నాటికి అక్కడ ఎకరం రూ. లక్ష ఉండేది, ఇప్పుడు రూ.177 కోట్లకు చేరింది. అమరావతి ప్రాజెక్టు సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో నిర్మిస్తున్నాం, విమర్శలు చేసే వారంతా ఈ విషయాన్ని గమనించాలి. అమరావతి ఓ మునిసిపాలిటీగా మిగిలిపోకూడదంటే అందుకు తగ్గ మౌలిక సదుపాయాలు అవసరం'అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

**పరిపాలనకు కేంద్రబిందువుగా అమరావతి**

'అమరావతి పరిపాలనకు కేంద్ర బిందువుగా ఉంటుంది. రైతులు వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుంటే అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. ఇంటికో పారిశ్రామికవేత్త విధానం అమరావతి నుంచే ప్రార%శీ%భం కావాలి'అని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. 'అమరావతి అభివృద్ధికి ఆటంకాలు లేవు. అమరావతిని క్వాంటం వ్యాలీ చేస్తున్నాం, విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వస్తోంది. ఒకప్పుడు ఐటీ.. ఇప్పుడు క్వాంటం, డేటా సెంటర్, ఏఐ వంటి టెక్నో రంగాలదే హవా. అమరావతి రైతుల అభివృద్ధికి అండగా ఉంటాం, హ్యాండ్ హోల్డింగ్ ఇస్తాం. ఒకసారి జరిగిన తప్పుకు రైతులు, నేను, రాష్ట్రం ఎంత నష్టపోయిందో అందరికీ తెలుసు. మళ్లీ అలాంటి తప్పులు జరగకూడదు కూటమి ప్రభుత్వం శాశ్వతంగా ఉండాలి. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీలతో కలిసి ముందుకెళ్తున్నాం మీరంతా సహకరించాలి'అని సీఎం చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు.

**నా ఆలోచన ఎప్పుడూ ప్రజల కోసం, వారి భవిష్యత్ కోసమే**

'నా ఆలోచన ఎప్పుడూ ప్రజల కోసం, వారి భవిష్యత్ కోసమే. విశాఖలో కూడా అద్భుతంగా అభివృద్ధి జరుగుతోంది. దేశానికి వచ్చిన అతి పెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి విశాఖకు వస్తోంది'అని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. 'రాజధాని అమరావతి ఫౌండేషన్ చాలా స్ట్రాంగ్ గా ఉంది, దేశంలోని పవిత్ర దేవాలయాలు, మసీదులు, చర్చీల నుంచి మట్టి, జలాలు తెచ్చి శంకుస్థాపన చేశాం'అని సీఎం చెప్పుకొచ్చారు. 'రాజధాని అభివృద్ధి కోసం ప్రతి రోజూ వేంకటేశ్వర స్వామిని ప్రార్థిస్తాను. త్వరలో అమరావతి రైతులతో ప్రత్యేకంగా సమావేశం అవుతా అమరావతి రైతులను మరిచేదే లేదు ఎలాంటి అనుమానం అక్కర్లేదు. అందరం కలిసి రాజధానిని అభివృద్ధి చేసుకుందాం. సీఆర్డీఏ భవనం ప్రారంభం మన అభివృద్ధి యాత్రకు ఆరంభం'అని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ , మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ గారు, పొన్నూరు ఎమ్మెల్యేలు ధూలిపాళ్ల నరేంద్ర , కొలికపూడి శ్రీనివాసరావు , వివిధ కార్పొరేషన్ ఛైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై రేవంత్ సర్కార్ సరికొత్త వ్యూహం

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా స్దానిక ఎన్నికలకు వెళితే పరువుపోవడం ఖాయమనే అభిప్రాయంలో హస్తం నేతలున్నట్లు సమాచారం. అలా అని స్దానికసంస్దల ఎన్నికలను వాయిదా వేస్తే కేంద్రం నుంచి రావాల్సిన నిధులు విషయంలో నష్టపోతామనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. బీసీలకు 42శాతం రిజర్వేన్ల హామీలో భాగంగా అధికారంలోకి వచ్చిన వెంటనే కులగణన సర్వే చేపట్టారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సర్వే నివేదిక ఆధారంగా రాష్ట్రంలో బీసీలు 57.6శాతం ఉన్నట్లు లెక్కలు తేల్చారు. ఈ లెక్కల ఆధారంగానే 42శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ జీవో9 విడుదల చేశారు. ఇంతా చేసీ ఇప్పుడు హైకోర్టు తీర్పుతో ఆగిష్తోతే , చేసిందంతా వృథా అని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఎన్నికలకు వెళితే రిజర్వేషన్ల తంటా, కాదని వదిలేస్తే నిధుల కొరత. ఇవి రెండూ కాకుండా ముచ్చటా మూడో ఆప్షన్ బెస్ట్ అని భావించింది రేవంత్ సర్కార్. సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటీషన్ వేయడం ద్వారా హైకోర్టు ఇచ్చిన స్టే ఎత్తివేయడంతోపాటు 42శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించ్టేందుకు వ్యూహ్తాత్మకంగా ముందుకెళుతోంది. ఏం చేద్దాం, సుప్రీం కోర్టులో మళ్లీ ఎదురుదెబ్బ తగలకుండా ఎలా ముందుకెళదామంటూ తాజాగా జూమ్ మీటింగ్ నిర్వహించారు సీఎం, మంత్రులు, పార్టీ ముఖ్యనేతలు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయ్తాల్లో భాగంగా పీసీసీ ఛీఫ్ తోపాటు ఇద్దరు మంత్రులు ఢిల్లీ వెళ్లారు. ఇప్పటికే అడ్వకేట్ జనరల్ తోపాటు న్యాయనిపుణులతో చర్చించిన తరువాత హైకోర్టు తీర్పుపై ఆగాల్సిన అవసరం లేదని భావించినట్లు సమాచారం. రాష్ట్రంలో స్దానిక ఎన్నికల నిర్వహణలో సుప్రీం కోర్టుకు వెళ్లడం సరైన నిర్ణయమని న్యాయనిపుణులు ఇచ్చిన సలహాల ఆధారంగా స్పెషల్ లీవ్ పిటీషన్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది.

**రిజర్వేషన్లపై 16వ తేదీన మంత్రివర్గ సమావేశం**

ఎస్సీ 15, ఎస్టీ 10,బీసీలకు 25 శాతం రిజర్వేషన్లు ఇస్తూ స్దానిక సంస్దల ఎన్నికలు నిర్వహించుకోవచ్చని హైకోర్టు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అయితే ఈరోజు స్పెషల్ లీవ్ పిటీషన్ పై సుప్రీం కోర్టు ఎలా స్పందింస్తో చూసిన తరువాత , సుప్రీం తీర్పుపై ఈనెల 16వ తేదిన మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి, తదుపరి కార్యచరణపై చర్చించాలని భావిస్తోంది. అన్ని కులాలకు కలపి 50శాతంకు మంచి రిజర్వేషన్లు దాటరాదని అనేక కేసుల్లో ఇప్పటికే సుప్రీం కోర్టు తెలిపింది. అయితే బీసీలకు రిజర్వేషన్లు పెంచే క్రమంలో కమిషన్ ఏర్పాటు చేయడం, బీసీ లెక్కలు సర్వే ఆధ్ధారంగా తేల్చడం ఇక్కడి వరకూ పద్దతి ఫాలో అయిన ప్రభుత్వం , మూడో చిక్కుముడి వద్దే ప్రస్తుతం ఆగిపోంది. అదే కొత్త రిజర్వేషన్ల మొత్తం ఏకంగా 67శాతానికి చేరుతున్నాయి. 50శాతం దాటకూడదని సుప్రీం చెప్పింది. ఈ చిక్కుముడి వీడేందుకు న్యాయసలహాలను తీసుకుని , తమ వాదనలు సుప్రీం సమర్దించే లెక్కలతో ఈసారి పక్కాగా ముందుకెళుతోంది తెలంగాణ ప్రభుత్వం.ఇదిలా ఉంటే అధికార పార్టీ బీసీ నేతలల్లో మాత్రం స్దానిక ఎన్నికలకు వెళ్లామంటే అది బీసీలకు 42శాతం రిజర్వేషన్లతోనే అనే పట్టుదల కనిపిస్తోంది. లేదంటే ఇంతా చేసి ఇతర పార్టీలకు విమర్శనాస్త్రాలు మనమే ఇచ్చినట్లవుతుందని భావిస్తున్నారు.

**మేము ఏం చేయాలో చెప్పండి - ఈసీ**

రిజర్వేషన్లపై ప్రభుత్వం పాట్లు ఇలా ఉంటే, స్దానిక ఎన్నికలు ఆపాల్సిన పనిలేదని, 42శాతంలో బీసీలకు ఇప్పటికే ఉన్న 25శాతం రిజర్వేషన్లు కొనసాగిస్తూ మిగతా 17శాతం జనరల్ కేటాయించి ఎన్నికలు నిర్వహించుకోవచ్చని హైకోర్టు తీర్పులో స్పష్టం చేసిన నేపధ్యంలో ఎన్నికల కమిషన్ ముందుకెళ్లే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే స్దానిక ఎన్నికల నిర్వహణ ఆలస్యం జరుగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఇంకా మరిం సాగదీయడం సరికాదని భావించిన ఎన్నికల సంఘం హైకోర్టును సంప్రదించిన తరువాత ఎన్నికల ప్రక్రియ తిరిగి ప్రారంభించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# దీపావళికి క్రెడిట్ కార్డ్ ఆఫర్లు- ఈ ట్రాప్‌లో పడ్డారో ఇక అంతే సంగతులు- జర జాగ్రత్త!

దీపావళి సమీపించిన వేళ ఈ-కామర్స్ వేదికల్లో ఆఫర్ల వెల్లువ- క్రెడిట్ కార్డ్‌తో ఎడాపెడా కొనేస్తే అప్పుల ఊబి ఖాయం- పైగా పొంచి ఉన్న ఫేక్ ఈ-కామర్స్ వెబ్‌సైట్లు : దీపావళి పండుగ (అక్టోబరు 20న) సమీపిస్తున్న వేళ ప్రముఖ ఈ-కామర్స్ వేదికల్లో ఆఫర్ల ధమాకాలు వినిపిస్తున్నాయి. అదిరిపోయే తగ్గింపు ధరలు, భారీ రాయితీలతో సేల్స్ మొదలయ్యాయి. ఈ తరుణంలో క్రెడిట్ కార్డ్ ఉంది కదా అని ఏదిపడితే అది కొనేశారో, ఆ తర్వాత చుక్కలు కనిపించడం ఖాయం. 'నో కాస్ట్ ఈఎంఐ'పై ఇస్తున్నారు కదా అని మొత్తం క్రెడిట్ లిమిట్‌ను వాడేసి వస్తువులను కొంటే అప్పుల ఊబి తప్ప ఇంకేమీ మిగలదు. లిమిటెడ్ రేంజులో షాపింగ్ చేసినా, కొనబోయే వస్తువు ధర గురించి అన్నిచోట్లా ఆరా తీయాలి. ధరను బాగా పెంచి 'నో కాస్ట్ ఈఎంఐ'పై ఇస్తున్నారా అనే దానిపై క్లారిటీకి రావాలి. ఇంతకీ ఈ దీపావళి సీజన్‌లో క్రెడిట్ కార్డు ఆఫర్ల విషయంలో ఎలా స్పందించాలి? క్రెడిట్ కార్డును స్మార్ట్‌గా, పొదుపుగా వినియోగించడం ఎలా? సైబర్ కేటుగాళ్లు విసిరే ఫేక్ ఈ-కామర్స్ వెబ్‌సైట్లు, ఫిషింగ్ లింక్‌ల వలలో చిక్కుకోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఈ కథనంలో తెలుసుకుందాం.

క్రెడిట్ కార్డ్ ఆఫర్ ట్రాప్‌లలో పడొద్దు!

1. నో-కాస్ట్ ఈఎంఐ

నో కాస్ట్ ఈఎంఐ అనేది ఒక అపోహ మాత్రమే. ఈ ఆఫర్ చూడటానికి లాభదాయకంగా కనిపిస్తుంది. నో కాస్ట్ అంటే జీరో కాస్ట్ అని మనం భావిస్తాం. వాస్తవానికి ఇలాంటి ఆఫర్‌తో విక్రయించే వస్తువుల ధరలను అప్పటికే పెంచుతారు. ప్రాసెసింగ్ ఫీజును కూడా వస్తువు ధరలోనే కలుపుతారు. చివరకు ఇదే వస్తువును 'నో కాస్ట్ ఈఎంఐ'పై ఇస్తామని ప్రకటిస్తారు. ఈ ఆఫర్ ద్వారా మనం కొనే వస్తువుకు సంబంధించిన ఈఎంఐలను కొన్ని నెలల పాటు చెల్లించాలి. ఈ అప్పు తీరే వరకు మన నెలవారీ ఆదాయంపై గణనీయంగా భారం పెరుగుతుంది. ఒకవేళ ఏదైనా ఈఎంఐ మిస్ అయితే భారీగా వడ్డీని వడ్డిస్తారు.

2. క్రెడిట్ లిమిట్

కొందరి వద్ద ఒకే క్రెడిట్ కార్డు ఉంటుంది. పలువురి వద్ద ఒకటికి మించి క్రెడిట్ కార్డులు ఉంటాయి. ఎక్కువ కార్డులున్న వారు, ఒకే కార్డుతో మొత్తం ఆన్‌లైన్ షాపింగ్ చేయకూడదు. ఒక్కో కార్డుతో ఒక్కో షాపింగ్ ఖర్చును చెల్లించాలి. తద్వారా అన్ని కార్డులలో క్రెడిట్ లిమిట్ వినియోగ నిష్పత్తి సముచితమైన నిష్పత్తిలో ఉంటుంది. కార్డులోని క్రెడిట్ లిమిట్‌లో 40 శాతానికి మించి ఎట్టి పరిస్థితుల్లోనూ ఖర్చు చేయకండి. ఒకవేళ అంతకుమించి ఖర్చు చేస్తే క్రెడిట్ స్కోర్ డౌన్ అవుతుంది. మీ అప్పులు భారీగా పెరిగిపోయినా క్రెడిట్ స్కోర్ ప్రతికూలంగా ప్రభావితం అవుతుంది. భవిష్యత్తులో అప్పులు దొరకడం కష్టతరం అవుతుంది.

3. చక్రవడ్డీ, రీపేమెంట్‌లో జాప్యం

క్రెడిట్ కార్డు ద్వారా ఖర్చులు చేశాక, ప్రతినెలా సకాలంలో ఈఎంఐ చెల్లించాలి. లేదంటే బ్యాంకులు సగటున 30 నుంచి 45 శాతం దాకా వార్షిక వడ్డీతో పాటు లేట్ ఫీజును విధిస్తాయి. ఈ నెగెటివ్ అంశాలన్నీ మన సిబిల్ రిపోర్టులో దాదాపు ఏడేళ్ల పాటు నమోదై ఉంటాయి. అందుకే క్రెడిట్ కార్డుకు సంబంధించిన 'మినిమం అమౌంట్' కంటే 'ఫుల్ అమౌంట్'ను చెల్లించడానికే ప్రయారిటీ ఇవ్వండి. ఫలితంగా మీ క్రెడిట్ స్కోరు మెరుగుపడుతుంది. క్రెడిట్ ప్రొఫైల్ ఆరోగ్యవంతంగా కనిపిస్తుంది.

4. నగదు విత్‌డ్రాల దుర్వినియోగం

కొంతమంది క్రెడిట్ కార్డుల నుంచి నగదును విత్‌డ్రా చేస్తుంటారు. ఈ విధంగా డ్రా చేసే డబ్బులపై సత్వరం భారీ వడ్డీతో పాటు 2 నుంచి 3 శాతం లావాదేవీ ఫీజును బ్యాంకు విధిస్తుంది. అత్యవసరాల్లో మాత్రమే క్రెడిట్ కార్డు నుంచి డబ్బులు విత్‌డ్రా చేయాలి. షాపింగ్ కోసం ఈ పని చేయడం కరెక్ట్ కాదు.

## రాహుల్ గాంధీకి సుప్రీంలో చుక్కెదురు

రాజ్యాంగబద్ధమైన, స్వేచ్ఛాయుతమైన ఎన్నికలకు విఘాతం కలిగిందని పిటిషనర్ వాదించారు. బెంగళూరు సెంట్రల్ పార్లమెంటరీ సీటులోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో వేలాది నకిలీ, చెల్లని, కల్పిత ఎంట్రీలు గుర్తించబడ్డాయని ఆరోపించారు. ఇది ఒక వ్యక్తి, ఒక ఓటు అనే సూత్రాన్ని దెబ్బతీస్తుందని అన్నారు.

రాహుల్ గాంధీ ఇటీవల ఈ ఓట్ చోరీ ఆరోపణలు చేశారు. బీజేపీ, ఎలక్షన్ కమిషన్ కలిసి దేశంలో ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని ఆరోపణలు గుప్పించారు. అంతేకాకుండా ఇలా చోరీ చేసిన ఓట్లతోనే ఎన్డీఏ సర్కార్ ఏర్పడిందంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఓట్ల దొంగతనానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇక కొందరు వ్యాపారవేత్తలకు ప్రయోజనం కలిగించేందుకు ప్రజల ఓటు హక్కును చోరీ చేయాడనికి బీజేపీ ప్రయత్నిస్తోందంటూ ధ్వజమెత్తారు. త్వరలో బిహార్‌లో జరగబోయే ఎన్నికల్లోనూ ఇలాగే ఓట్లు దొంగిలించడానికి కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. ఓటు చోరీ చేయడంలో మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాలలో ఎన్డీయే కూటమి సక్సెస్ అయిందని కానీ బిహార్‌లో మాత్రం బీజేపీ, ఎన్నికల సంఘాన్ని ఒక్క ఓటు కూడా దొంగిలించబోనివ్వమి అన్నారు.

**పక్కా ఆధారాలు ఉన్నాయి..**

ఇటీవల మరోసారి ఓట్ల చోరీ అంశంపై సంచలన ఆరోపణలు చేశారు రాహుల్ గాంధీ. సెంట్రల్ సాఫ్ట్‌వేర్ సాయంతో లక్షల మంది పౌరుల పేర్లను ఓటర్ లిస్ట్ నుంచి తొలగించాలని ఆరోపించారు. ఈ ఆరోపణలన్నీ తాను పక్కా 100 శాతం ఆధారాలతో చేస్తున్నానని వెల్లడించారు. అయితే రాహుల్ గాంధీ చేస్తున్న ఓట్ చోరీ ఆరోపణలను ఎలక్షన్ కమిషన్ ఎప్పటికప్పుడూ ఖండిస్తోంది.

## ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ

' సభకు రావాలని ప్రధానిని ఆహ్వానించారు. అసలాగే నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరుగనున్న "సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్ 2025" కు కూడా ప్రధాని మోదీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆహ్వానించారు. గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ విశాఖలో ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్ కు ఢిల్లీలో అవగాహన ఒప్పందం జరుగనుంది. దాదాపు 480 ఎకరాల్లో రూ.87,520 కోట్ల పెట్టుబడి రైడెన్ డేటా సెంటర్ ఏర్పాటు కానుంది. జిల్లాలోని తర్లువాడ, అడవివరం, అచ్యుతాపురం పరిధిలో మూడు అతి పెద్ద డేటా సెంటర్లు రానున్నాయి. ఇందుకు అవసరమైన భూమిని గూగుల్ సంస్థే ఏపీఐఐసీ నుంచి కొనుగోలు చేయనుంది. ఈ డేటా సెంటర్‌కు సింగపూర్ లేదా వారికి అనువైన ఇతర ప్రాంతాల నుంచి సముద్రగర్భం ద్వారా కేబుల్ ఏర్పాటు చేయనున్నారు. ఈ కేబుల్ కారణంగా మరిన్ని డేటా సెంటర్లు విశాఖలో ఏర్పాటయ్యే అవకాశాలున్నాయి. విశాఖ ఏఐ స్మార్ట్‌సిటీగా రూపాంతరం చెందనుంది. దీని ద్వారా మొత్తం రూ.1,27,181 కోట్ల విలువైన ప్రాజెక్టులు, 78,771 మంది ఉద్యోగాల కల్పన జరుగుతుందని అంచనా.

## రూ.3 లక్షలు తిరిగి ఇచ్చేలా ఆదేశించండి

హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రంలో కొత్త మద్యం విధానం ప్రస్తుతం న్యాయ వివాదాల్లోకి చేరింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మద్యం పాలసీపై హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. ఈ వివాదం ప్రధానంగా దరఖాస్తు రుసుము గురించి ప్రస్తావించారు. అంతే కాకుండా దరఖాస్తు చేసుకున్న డబ్బులను తిరిగి చెల్లించాలని కూడా అందులో పేర్కొన్నారు. ఈ రెండు అంశాల చుట్టూ ఈ పిటిషన్ కేంద్రీకృతమై ఉంది. అనిల్ కుమార్ అనే వ్యక్తి తెలంగాణ హైకోర్టులో ఈ పిటిషన్‌ను వేశారు. ఒక్కో మద్యం దుకాణం దరఖాస్తుకు రూ. 3 లక్షల భారీ రుసుమును నిర్ణయించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. లాటరీలో ఒకవేళ షాపు దక్కకపోతే ఈ రూ. 3 లక్షలు ఎక్సైజ్ డిపార్ట్ మెంట్‌కు వెళ్లిపోతాయని, దరఖాస్తుదారులకు ఈ డబ్బును తిరిగి చెల్లించేలా అబ్కారీ శాఖను ఆదేశించాలని పిటిషనర్ కోర్టును విజ్ఞప్తి చేశారు. ఇది దరఖాస్తుదారులకు అన్యాయం చేస్తుందని ఈ విధానం సమంజసం కాదని పిటిషన్‌లో ప్రస్తావించారు. కొత్త మద్యం విధానంపై తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవోను కొట్టివేయాలని కూడా పిటిషనర్ కోరారు. ఉన్నత న్యాయస్థానం ఈ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకుని అబ్కారీ శాఖ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని నిర్ణయించింది. మద్యం పాలసీ నియమ నిబంధనలు, రుసుము విధానాలపై సమాధానం ఇవ్వాల్సిందిగా కోర్టు ఆదేశించింది. ఈ కేసు విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

ప్రతి రెండేళ్లకోసారి రాష్ట్ర ప్రభుత్వం మద్యం పాలసీని సవరిస్తుంది. ఈసారి దరఖాస్తు రుసుమును పెంచడం అనేది అనేకమందికి ఆర్థిక భారం పెంచుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా దరఖాస్తు రుసుము తిరిగి చెల్లించకపోవడం వెనుక ప్రభుత్వం యొక్క ఉద్దేశం ఏంటంటే అనవసరమైన దరఖాస్తులను తగ్గించడం, ఆర్థిక వనరులను సమకూర్చుకోవడంగా ఉంటుంది. అయితే న్యాయస్థానం ఈ రుసుము సరైనదా, న్యాయబద్ధమైందా అనే అంశాన్ని పరిశీలించనుంది. హైకోర్టు తీర్పు ఈ మద్యం విధానం అమలుపై కీలక ప్రభావం చూపే అవకాశం ఉంది.

## నాపై ఫిర్యాదు చేయడానికి ఏమిలేదు

హైదరాబాద్ మంత్రి కొండా సురేఖతో విభేదాలపై మరో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందించారు. మేడారం జాతర కాంట్రాక్టు పనులను పొంగులేటి తన సొంత కంపెనీకి ఇచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారని కొండా దంపతులు ఆరోపించారు. ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై పొంగులేటి స్పందిస్తూ వివరణ ఇచ్చారు. తన గురించి అందరికీ తెలుసని ఆయన అన్నారు. తాను రూ. 70 కోట్ల కాంట్రాక్టు కోసం ఆరాటపడే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. తనపై సహచర మంత్రులు ఫిర్యాదు చేశారంటే నమ్మశక్యంగా లేదని అన్నారు. తనపై ఫిర్యాదు చేయడానికి అసలు విషయమేముందని ప్రశ్నించారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖలు ఇద్దరూ సమ్మక్క, సారక్కల్లా పనిచేస్తున్నారని ప్రశంసించారు. మేడారం అభివృద్ధి అంశంపై మాట్లాడుతూ, మేడారం అభివృద్ధికి రూ. 212 కోట్ల నిధులతో మాస్టర్ ప్లాన్ రూపొందించామని అన్నారు. నిధులు ఎక్కువైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మేడారంలో భక్తులకు అన్ని రకాల సదుపాయాలు ఉండాలని ఆకాంక్షించారు. అభివృద్ధి పనులపై అందరి సూచనలు తీసుకుంటామని అన్నారు. ఎంత ఖర్చైనా మేడారం ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతామని ఆయన పేర్కొన్నారు.

## గోపన్న ఆశయాలను ముందుకు తీసుకు వెళ్దాం

హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత తన భర్త మాగంటి గోపీనాథ్‌ను తలుచుకుని కంటతడి పెట్టారు. రహమత్‌నగర్‌లో జరిగిన నియోజకవర్గం కార్యకర్తల సమావేశంలో వేదికపై ఆమె ప్రసంగిస్తూ ఉద్వేగానికి లోనయ్యారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ప్రజలు తమ కుటుంబాన్ని సొంత కుటుంబంగా భావిస్తున్నారని ఆమె అన్నారు. ఆమె ప్రసంగిస్తుండగా అభిమానులు 'జై గోపీనాథ్' అంటూ నినాదాలు చేశారు. "గోపన్న అంటేనే జనం, జనం అంటేనే గోపన్న. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలను గోపీనాథ్ కుటుంబ సభ్యులుగా భావించేవారు. ఈరోజు ఆయన కోసం కుటుంబం తరలి వచ్చింది. ఆయన పైనుండి చూస్తూనే ఉంటారు. మనమందరం కలిసి గోపీనాథ్ ఆశయాలను ముందుకు తీసుకువెళదాం. నన్ను మీ ఇంటి ఆడబిడ్డగా భావించండి. గోపీనాథ్ ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించేవారు" అని ఆమె పేర్కొన్నారు.

## లాటరీపై జీఎస్టీ పెంపు పెద్ద దెబ్బ- నష్టపోయినప్పటికీ టికెట్ ధరను పెంచం: కేరళ సీఎం

: లాటరీ టిక్కెట్లపై వస్తు సేవల పన్ను జీఎస్టీని ఒకేసారి 28% నుంచి 40%కి పెంచాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్య కేరళ లాటరీ రంగానికి తీవ్ర దెబ్బ తగిలిందని ముఖ్యమంత్రి పినరయి విజయన్ వ్యాఖ్యానించారు. కేంద్ర ఆర్థిక శాఖ, జీఎస్టీ కౌన్సిల్ రేటును పెంచకుండా ఉండాలని తాను, ఆర్థిక మంత్రి పదే పదే అభ్యర్థించామని, కానీ కేంద్ర ప్రభుత్వం ప్రతికూల వైఖరిని అవలంబించిందని ముఖ్యమంత్రి అన్నారు.అయితే, రాష్ట్ర ప్రభుత్వం లాటరీ వ్యాపారంపై ఆధారపడిన సాధారణ ప్రజల జీవనోపాధిని కాపాడటానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. దీనివల్ల ఆదాయ నష్టం ఉన్నప్పటికీ, ప్రభుత్వం ప్రస్తుత టికెట్ ధరను ఎటువంటి పెరుగుదల లేకుండా రూ.50 వద్ద కొనసాగించాలని నిర్ణయించిందని తెలిపారు. జీఎస్టీని 28% నుంచి 40%కి పెంచడం వల్ల ప్రభుత్వం లాటరీ టికెట్‌కు రూ.3.35 ఆదాయాన్ని కోల్పోతుంది, అంటే డ్రాకు దాదాపు రూ.3.35 కోట్లు తగ్గుతుంది.టికెట్ ధరను పెంచకుండా ఉండటానికి, ప్రభుత్వం తన కార్యాచరణ మిగులు, ఏజెంట్ డిస్కౌంట్లు, ఏజెన్సీ బహుమతులు బహుమతి నిధిలోని భాగాలను తగ్గించింది. ప్రస్తుతం మొత్తం అమ్మకాల ఆదాయంలో 60% బహుమతి డబ్బుగా పంపిణీ చేస్తున్నారు. అమ్మకాలు తగ్గినందున బహుమతి చెల్లింపు కూడా స్వల్పంగా తగ్గింది. ఏజెంట్ డిస్కౌంట్లు, ఏజెన్సీ కమీషన్ల నిర్మాణంలో మార్పులను కూడా ప్రభుత్వం సమీక్షిస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు.కేంద్రం అమలు చేసిన జీఎస్టీ సవరణ లాటరీ రంగంపై ఆధారపడిన కార్మికులు, కుటుంబాలపై ప్రతికూల ప్రభావం చూపకుండా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా కేరళ జీవన ప్రమాణాలను పెంచే లక్ష్యంతో, రాష్ట్ర ప్రభుత్వం నవ కేరళ పౌర ప్రతిస్పందన కార్యక్రమం అనే పెద్ద ఎత్తున భాగస్వామ్య అధ్యయన కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది.

## గ్రామ స్థాయి కార్యకర్తల అభిప్రాయం మేరకే పార్టీ జిల్లా అధ్యక్షుడు - ఏఐసీసీ ఇంచార్జి.సూరజ్ సింగ్ ఠాగూర్..





సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా.సోమవారం వికారాబాద్ పట్టణంలోని ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ జిల్లా స్థాయి సమావేశము సంఘటన్ సృజన్ అభియాన్ పేరిట జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే డా టి రామ్మోహన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఏఐసీసీ తరపున ఇన్చార్జిగా సూరజ్ సింగ్ ఠాగూర్,తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి, టీపీసీసీ నుండి ఎస్ టీ సెల్ నాయకులు బెల్లయ్య నాయక్ మరియు టీ పీసీసీ ఉపాధ్యక్షులు నీలిమ, మరియు వేణు గౌడ్, మరియు శత్రు గార్లు ఈ సమావేశానికి రావడం జరిగింది..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలోని ప్రతి మండలానికి రాబోయే మూడు రోజులలో తిరిగి గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అభిప్రాయాన్ని తెలుసుకొని అదేవిధంగా జిల్లా అధ్యక్ష పదవి కోసం అభ్యర్థనలు తీసుకొని అధిష్టానానికి పంపించడం జరుగుతుందని తెలిపారు..ఈనెల 16వ తేదీ లోపు మేము వికారాబాద్ జిల్లాలోని అందుబాటులో ఉంటామని డిసిసి అధ్యక్ష పదవి కోసం పోటీపడేవారు పొందుపరిచిన ఫామ్ ద్వారా అప్లికేషన్ చేసుకొవాలని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ వారికి కచ్చితంగా పార్టీలో తగిన న్యాయం చేస్తామని తెలిపారు..అందరూ కార్యకర్తల అభిప్రాయం మేరకే జిల్లా అధ్యక్షుని నియామకం ఉంటుందని ఈ సమావేశంలో ఇన్చార్యులు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు మరియు జిల్లా కార్యవర్గ సభ్యులు మరియు బ్లాక్ అధ్యక్షులు మండల అధ్యక్షులు పట్టణ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు..

## నాగలిగిద్ద జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం సిద్ధారెడ్డి ఇక్కడే బాధ్యతలు చేపట్టాలి




సత్య మేవ జయతే. నారాయణ ఖేడ్హెచ్ఎం పోస్ట్ నాగలిగిద్ద బాధ్యతలు వేరే చోట నాగలి గిద్ద మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా బాధ్యతలు చేపట్టిన సిద్ధారెడ్డిని మరో చోట నిధులు నిర్వహిస్తున్నారని సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో గారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గణపతి మాట్లాడుతూ నాగలిగిద్ద మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిద్ధారెడ్డి హెచ్ఎం గా బాధ్యతలు ఇక్కడ స్వీకరించి మరోచోట వీధులు నిర్వహించడం సరైంది కాదని దీనివల్ల వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని. తక్షణమే అధికారులు స్పందించి నాగలి గిద్ద లో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

## నాగలిగిద్ద జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం సిద్ధారెడ్డి ఇక్కడే బాధ్యతలు చేపట్టాలి



సత్య మేవ జయతే. నారాయణ ఖేడ్హెచ్ఎం పోస్ట్ నాగలిగిద్ద బాధ్యతలు వేరే చోట నాగలి గిద్ద మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా బాధ్యతలు చేపట్టిన సిద్ధారెడ్డిని మరో చోట నిధులు నిర్వహిస్తున్నారని సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో గారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గణపతి మాట్లాడుతూ నాగలిగిద్ద మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిద్ధారెడ్డి హెచ్ఎం గా బాధ్యతలు ఇక్కడ స్వీకరించి మరోచోట వీధులు నిర్వహించడం సరైంది కాదని దీనివల్ల వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని. తక్షణమే అధికారులు స్పందించి నాగలి గిద్ద లో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

## ఫారెస్ట్ అధికారులు సాగు భూముల జోలికి రాకుండా చర్యలు తీసుకోవాలి



సత్యమేవ జయతే - ఆదిలాబాద్ ఆదిలాబాద్ : సాగు చేసుకుంటున్న భూముల్లోకి ఫారెస్ట్ అధికారులు వచ్చి అటవీ భూమంటూ ఇబ్బందులు పెడుతున్నారని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, తహసీల్దార్ సునీల్ కుమార్కు ఆత్మ చైర్మన్ రైతు సత్తయ్య ఆధ్వర్యంలో వేర్వేరుగా పెద్దనపల్లి రైతులు వినతిపత్రం అందజేశారు. ఫారెస్ట్ శాఖ తమ జోలికి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. 1977లో రైతులకు లావన్ పట్టా సర్టిఫికెట్లు జారీ చేశారని, అప్పటి నుంచి ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని పేర్కొన్నారు. ఎస్టీ, ఎస్సీలకు అందించిన భూమి అటవీ శాఖదని భయభ్రాంతులకు గురి చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మేడ సమ్మయ్య, మడిపెల్లి తిరుపతి, దేవక్క, ధర్మయ్య, వెంకటస్వామి, తిరుపతి, రామకృష్ణ, నర్సయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# బోథ్ అభివృద్ధి పై బహిరంగ చర్చకు సిద్ధంయ భోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భోడ్డు గంగారెడ్డి


**స్థానిక సంస్థల ఓటమి భయంతోనే కట్టుకథలు అల్లుతున్న బోథ్ శాసనసభ్యులు**

**చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే కోటాలో ఇందిరమ్మ ఇల్లు ఎందుకు ఇవ్వలేదు..??**

**బోథ్ సుందరీకరణ-సెంట్రల్ లైటింగ్ కి అప్పటి జిల్లా ఇన్చార్జ్ మంత్రి అనుమతి**

**రెవెన్యూ డివిజన్, డిగ్రీ కళాశాల, ఫైర్ స్టేషన్, గ్రంథాలయం తెచ్చే బాధ్యత మాదే**





బోథ్ సత్యమేవ జయతే న్యూస్:- స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది బోథ్ ప్రజలను మభ్యపెట్టి, లేనిది ఉన్నట్టుగా కట్టు కథలు చెప్పి ప్రజలను మభ్యపెట్టే పనిలో బోత్ నియోజకవర్గ శాసనసభ్యులు, బీఆర్ఎస్ నేతలు ఉన్నారని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు.గత పది సంవత్సరాల కాలంలో బోథ్ అభివృద్ధిని తిరోగమనంలోకి తీసుకుపోయిన బీఆర్ఎస్ నేతలు దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా బోథ్ అభివృద్ధిపై హామీలు ఇవ్వడం హాస్యాస్పదమని ఆనాడు అధికారం చేతిలో ఉన్న రెవెన్యూ డివిజన్ ఇవ్వకుండా, డిగ్రీ కాలేజ్ ను తరలించి, గ్రంథాల ఏర్పాటును మరిచి, మండల తాసిల్దార్ కార్యాలయానికి వచ్చిన నిధులను మంజూరు కాకుండా అడ్డుకున్నది ఎవరో బిఆర్ఎస్ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు బోథ్ ఎక్స్ రోడ్ నుండి బోథ్ పట్టణమునకు వరకు రోడ్డు అభివృద్ధి, కుచులాపూర్ వెంకటేశ్వర ఆలయం నుండి బోథ్ పట్టణంలో సెంట్రల్ లైటింగ్, బోథ్ సుందరీకరణ కోసం గత జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారని, దాని ఆధారంగా ఇప్పుడు బోథ్ శాసనసభ్యులు నేనే తెచ్చాను అన్నట్టుగా ప్రచారం చేసుకుంటున్నారని, 18 కోట్ల నిధులు కాదు కానీ బోథ్ పట్టణానికి కనీసం తన కోటాలో 18 ఇండ్లు కూడా ఇవ్వలేదని ప్రజలు గమనించాలని పిలుపునిచ్చారూ బోథ్ అంబేద్కర్ సెంటర్ నుండి పోచమ్మ గల్లీ బ్రిడ్జి వరకు, న్యూ కాలని నుండి మైసమ్మ గల్లి మర్లపల్లి రోడ్ వరకు, పట్టణ ప్రధాన వీధులలో మరమ్మత్తులు, సాయి నగర్ కి ప్రత్యేక నిధులు ఇవ్వాలని జిల్లా ఇన్చార్జ్ మంత్రి గారిని కోరడం జరిగిందని, దానికి సంబంధించి ప్రతిపాదనలో జిల్లా ఇన్చార్జ్ మంత్రి గారికి అందించడం జరిగింది అని తెలిపారు.సమీప భవిష్యత్తులో బోథ్ పెండింగ్లో ఉన్న సమస్యలతో పాటు, శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు సొంత పక్కా భవనాలు నిర్మిస్తామని, రాబోవు ఐదు సంవత్సరాలలో రైతులందరికీ పోలంబాటలో భాగంగా అన్ని పానాధులను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.ఇప్పటికైనా ప్రతిపక్ష పార్టీలు ప్రజా పాలనకు మద్దతు తెలిపి బోథ్ అభివృద్ధికి కలిసి రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపిటిసి, పిఎసిఎస్ డైరెక్టర్ చట్ల ఉమేష్, షేక్ రజియా బేగం నాజర్ అహ్మద్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, మార్కెట్ డైరెక్టర్ మహమ్మద్ అబ్రర్, ఆత్మా డైరెక్టర్ రహీముద్దీన్, సీనియర్ నాయకులు మెరుగు భోజన్న, వోటర్ కార్ రాజశేఖర్, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు సుద్దుల అరుణ్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు షేక్ షాకీర్, అబ్దుల్ హసీబ్,కౌసర్, కురుమే గంగారాం, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి. ఎమ్మెల్యే బి మనోహర్ రెడ్డి



సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా...వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ గారిని నాయకులతో కలిసి, నియోజకవర్గ పరిధిలో గల పలు సమస్యలను చర్చించిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి..

ప్రస్తావించిన ముఖ్యమైన అంశాలు..ముఖ్యంగా రైతులకు ఇబ్బందులు రాకుండా సకాలంలో వడ్ల, పత్తి కొనుగోలు కేంద్రలు ఏర్పాటు చేయాలి. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా ఇసుక పర్మీషన్లు ఇవ్వాలని కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు.అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తయ్యే విధంగా చూడాలి. నియోజకవర్గనికి మంజూరైన సబ్ స్టేషన్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకొవాలని సూచించారు. వీటితో పాటు ముఖ్యమైన పలు సమస్యలను కలెక్టర్ గారితో చర్చించిన ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి తెలిపారు.

# మోమిన్‌పేట్ ఎంపీడీవో విజయలక్ష్మి బదిలీ





సత్యమేవ జయతే మోమిన్ పేట:సేవా నిబద్ధతతో ప్రజల మనసులు గెలుచుకున్న అధికారికి %-% ఘన సన్మానం చేసిన మండల సిబ్బంది.మోమిన్‌పేట్ మండల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి బదిలీ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సిబ్బంది ఘనంగా వీడ్కోలు మరియు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఆమెకు ఘన గౌరవం తెలుపుతూ పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది ప్రతినిధులు పాల్గొని విజయలక్ష్మి సేవలను కొనియాడారు. వారు మాట్లాడుతూ ౨ ఎంపీడీవో విజయలక్ష్మి తన పదవీకాలంలో మోమిన్‌పేట్ మండలాన్ని అభివృద్ధి దిశగా నడిపించారని, గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎల్లప్పుడూ ముందుండారని ప్రశంసించారు.విజయలక్ష్మి నాయకత్వంలో మండల పరిధిలో పలు పంచాయతీలు స్వచ్ఛ భారత్ అవార్డులు, హరిత హారం ప్రోత్సాహక బహుమతులు, పల్లె ప్రగతి ఉత్తమ పంచాయతీ పురస్కారాలు అందుకున్నట్లు అధికారులు గుర్తు చేశారు. మహిళా సంఘాల బలోపేతం, గ్రామ స్వచ్ఛత, తాగునీటి సమస్యల పరిష్కారం, పేద ప్రజలకు సంక్షేమ పథకాల అమలులో ఆమె చూపిన పట్టుదల ప్రజల మనసుల్లో నిలిచిపోయిందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎంపీఓ యాదగిరి మాట్లాడుతూ ౨ విజయలక్ష్మి కేవలం ఒక అధికారి మాత్రమే కాకుండా ప్రజల పట్ల మమకారం కలిగిన నిజమైన సేవాధారురాలిగా నిలిచారని తెలిపారు. ఆమె పాలనా నైపుణ్యం, సిబ్బంది పట్ల స్నేహపూర్వక వైఖరి, పనిలో క్రమశిక్షణ యువ అధికారులకు ఆదర్శంగా ఉంటాయని అన్నారు.తన స్పందనలో ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ ౨ "మోమిన్‌పేట్ మండలం నా సేవా ప్రయాణంలో ఒక ప్రత్యేక గుర్తింపుగా నిలిచిపోతుంది. ఈ ప్రాంత ప్రజల ప్రేమ, సిబ్బంది సహకారం నన్ను మరింత ప్రేరేపించాయి. అభివృద్ధి కోసం కలిసి పనిచేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు.కార్యక్రమం చివరలో సిబ్బంది తరపున విజయలక్ష్మి కి పట్టు షాల్ ఆపాదించి, స్మారక ఫలకాన్ని అందజేస్తూ ఘన సన్మానం చేశారు. ఆమె సేవలను గుర్తు చేసుకుంటూ హృదయపూర్వకంగా వీడ్కోలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు.

సత్యమేవ జయతే



## జెడ్పీ కాంప్లెక్స్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి.. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



సత్యమేవ జయతే : పెద్దపల్లి పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం నిర్మాణం చేపడుతున్న జిల్లా పరిషత్ కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సంబంధిత అధికారులతో కలిసి పెద్దపెల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్మాణం అవుతున్న జెడ్పీ కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులను ఆయన సోమవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జడ్పీ కాంప్లెక్స్ నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. నిర్దేశిత గడువు ఆరు నెలల్లోగా నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. జెడ్పీ కాంప్లెక్స్ నిర్మాణ పనులను ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నాణ్యతలో రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట జడ్పీ సీఈఓ నరేందర్, పంచాయతీరాజ్ ఈఈ గిరీష్ బాబు, పెద్దపల్లి తహసీల్దార్ దండిగ రాజయ్య యాదవ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నష్టపరిహారం చెల్లించాలని రైతుల ఆందోళన..బోనస్ పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్

### - సోయ కొనుగోలు కేంద్రలు వెంటనే ప్రారంభించాలి

### - తమ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని వినతి



సత్యమేవ జయతే – నిజామాబాద్ నిజామాబాద్ : భారీ వర్షాలవల్ల వరదలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని, ప్రభుత్వం సన్నలకు బోనస్ పై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళన చేపట్టారు. పోతంగల్ మండల కేంద్రంలో అన్నదాతలు సోమవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి బోనస్‌తో పాటు భారీ వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం వెంటనే చెల్లించాలని నినాదాలు చేశారు.

ఎమ్మార్వో వచ్చేంతవరకు కదిలేదే లేదని భీష్మించుకుకూర్చున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మండలంలోని మంజీరా పరివాహక ప్రాంతాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదల వల్ల వేల ఎకరాల పంటలు నీట మునిగి తాము నష్టపోయామని, అధికారులు వచ్చి పంటలు పరిశీలించినప్పటికీ నష్టపరిహారం అందించలేదని మండిపడ్డారు. నష్ట పోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల నష్ట పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సన్న రకం ధాన్యం పండిస్తే బోనస్ వస్తుందని, ఆశతో గత సీజన్లో ప్రైవేట్ వ్యక్తులకు అమ్మకుండా అకాల వర్షాలనుండి ధాన్యాన్ని కాపాడుకొని ఆరబెట్టి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల విక్రయించామని, ఇప్పుడు వర్షాకాలం పంట చేతికొచ్చిన ఇప్పటివరకు బోనస్ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ ఏడాది భారీ వర్షాలతో పంటలు నష్టపోయి దిగుబడి లేక తాము ఇబ్బందుల్లో ఉన్నామని, ప్రభుత్వం వెంటనే బోనస్‌పై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోయా పంట చేతికొచ్చి నెల రోజులు గడుస్తున్న ప్రభుత్వం కొనుగోలు చేసే ఉసే లేదని మండిపడ్డారు. సోయా కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ ఎమ్మార్వో అబ్దుల్ అజీజ్ సంఘటనా స్థలానికి చేరుకోవడంతో డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆయనకు అందజేశారు. తమ సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కల్లూరి హన్మండ్లు, ప్రకాష్ పటేల్, గంగాధర్ పటేల్, విజయ్ పటేల్, మక్కయ్య, పబ్బ శేఖర్, నాగనాథ్ పటేల్, ఒమన్న పటేల్, హరి నర్సింగ్, రాజు పటేల్, దిగంబర్ పటేల్, మగిరి శ్రీనివాస్, దుమలే సురేష్, మారుతీ పటేల్, సురేష్ చుట్టుపక్కల గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయిపై దాడికి పాల్పడ్డ వ్యక్తిపై కేసు నమోదు చేయాలి



సత్యమేవ జయతే – వరంగల్ వరంగల్ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడికి పాల్పడిన రాకేష్ కిషోర్ పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి వంగూరి ఆనందరావు అన్నారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్ పి ఆధ్వర్యంలో వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన దాడి అనాగరికమైందన్నారు. ఈ దాడి సమస్త భారతీయులను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. దళిత పీడిత వర్గాల ప్రజలను తీవ్ర మనోవేదనకు గురిచేసిందన్నారు. దళితుడైన బిఆర్ గవాయి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ కావడం కొన్ని ఆధిపత్య శక్తులు జీవించుకోలేక పోతున్నాయని విమర్శించారు. ఇలాంటి ఘటనలు ఉన్నత న్యాయవ్యవస్థలో పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ మాదిగ, నాయకులు కళ్లేపెల్లి ప్రణయ్ దీప్, చింతం సిద్దు, రవి, ఇనుముల పూర్ణయ్య, మల్లేష్, వశపాక కుమార్, దామెర కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ట్రస్మా కృషి





**రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివరాత్రి యాదగిరి.**

**రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్రస్థాయి అవార్డుల ప్రదానం.**

**శివరాత్రి యాదగిరి అధ్యక్షతను అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం.**

**ట్రస్మా రాష్ట్ర మీడియా సెల్ కన్వీనర్ గా బోసాని బాలరాజు నియామకం.**

కుత్బుల్లాపూర్,అక్టోబర్ 13,సత్యమేవ జయతే ప్రతినిధి :- తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ట్రస్మా కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివరాత్రి యాదగిరి తెలిపారు. ఆదివారం 12 అక్టోబర్ రోజున సెస్ పంజాగుట్టలోని బిపిఆర్ విటల్ ఆడిటోరియంలో ట్రస్మా రాష్ట్ర కార్యవర్గ సమావేశం, రాష్ట్రస్థాయి అవార్డులు ప్రధానోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఇటికాల పురుషోత్తం హాజరైయ్యారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివరాత్రి యాదగిరి అధ్యక్షత వహించి సమావేశాన్ని ఉత్సాహంగా కొనసాగించారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించిర అన్ని జిల్లాల నుండి హాజరైన జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు , కోశాధికారులు వారి జిల్లాలో గల సమస్యలను రాష్ట్ర కార్యవర్గం దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర పదాధికారులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయం మేరకు ప్రధాన కార్యదర్శి ఐవి రమణారావు సరైన సమయం కేటాయించకపోవడం కారణంగా వారు ఆ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నారని ఖమ్మం జిల్లా అధ్యక్షులు కాంతారావు ప్రకటించి సమయం ఇచ్చి సంఘాన్ని ముందుకు తీసుకుపోయే వారికి ప్రధాన కార్యదర్శిగా అవకాశం ఇవ్వాల్సిందిగా కోరారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి ఎన్ వెంకటేశ్వరరావుని ప్రధాన కార్యదర్శిగా , ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి సిరిపురం సత్యనారాయణని చీఫ్ అడ్వైజర్ గా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి వడ్నాల శ్రీనివాస్ ని ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి తుమ్మలపల్లి ప్రసాద్ ని రాష్ట్ర కోఆర్డినేటర్ గా ,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి బోసాని బాలరాజుని రాష్ట్ర మీడియా సెల్ కన్వీనర్ గా అదనపు బాధ్యతలు ఇస్తూ రాష్ట్ర కార్యవర్గంలో తీర్మానం చేసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ప్రతినెల జిల్లాల వారీగా టీచర్స్ ట్రైనింగ్ విద్యార్థులకు మోటివేషన్ క్లాసెస్, పేరెంట్స్ ట్రైనింగ్ కూడా ఇవ్వాలని తీర్మానం చేశారు. ఆ తదుపరి రాష్ట్రస్థాయి అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ముఖ్య అతిథి ఇటికాల పురుషోత్తం చేతుల మీదుగా రాష్ట్ర నలుమూలల నుండి





విచ్చేసిన 303 మందికి అవార్డులు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు డాక్టర్ యాదగిరి శేఖర్ రావు, ప్రధాన కార్యదర్శి ఎన్ వెంకటేశ్వరరావు , కోశాధికారి ఎస్ జయ సింహ గౌడ్, ఫైనాన్స్ సెక్రటరీ రాపోలు విష్ణువర్ధన్ రావు, సీనియర్ కరస్పాండెంట్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దపల్లి కిషన్ రావు అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారులు ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొని కార్యవర్గ సమావేశాన్ని అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## 'శ్రీరామ్ సాగర్ రెండో దశకు భీమిరెడ్డి నరసింహారెడ్డి



సత్యమేవ జయతే – నల్గొండ నల్గొండ : శ్రీరామ్ సాగర్ రెండవ దశకు భీమిరెడ్డి నరసింహారెడ్డి పేరు పెట్టాలని, కమ్యూనిస్టుల పోరాట ఫలితమే శ్రీరామ్ సాగర్ రెండవ దశ నిర్మాణమని సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరి రావు, మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్ అన్నారు. సోమవారం అర్వపల్లిలో వారు మాట్లాడుతూ.. ఆదివారం తుంగతుర్తిలో జరిగిన రామ్‌రెడ్డి దామోదర్ రెడ్డి సంస్మరణ సభలో శ్రీరామ్ సాగర్ రెండవ దశ నిర్మాణానికి ఆర్డీఆర్ పేరు పెడతామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంపై అభ్యంతరకరం అన్నారు.

కమ్యూనిస్టుల దశాబ్దాల పోరాటాల ఫలితంగా ముఖ్యంగా సిపిఎం పార్టీ భీమిరెడ్డి నరసింహారెడ్డి నాయకత్వంలో ఫోరాటాల ఫలితంగానే నిర్మాణం జరిగిందని, శ్రీరామ్ సాగర్ రెండో దశ నిర్మాణ పోరాటంలో ఎలాంటి సంబంధం లేని ఆర్డీఆర్ పేరు పెట్టడం దేనికి సంకేతం అని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి రెండవ దశ కాల్వకు భీమిరెడ్డి నరసింహారెడ్డి పేరు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుమార్, వెంకన్న, విజయ్ కుమార్, అబ్దుల్, నరేందర్, వీరస్వామి, వెంకటేశ్, భిక్షం, వీరస్వామి, వీరయ్య, ఆవులయ్య, లింగయ్య, పాల్గొన్నారు.

## కట్టంగూర్‌లో వర్షానికి తడిసిన ధాన్యం.. ఆందోళనలో రైతులు



సత్యమేవ జయతే – నల్గొండ

నల్గొండ : అకాల వర్షాలు అన్నదాతలను ఆగం చేస్తున్నాయి. ధాన్యం కొనుగోళ్లు పారంభంలోనే రైతుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. కట్టంగూర్ మండల వ్యాప్తంగా సోమవారం తెల్లవారుజాము నుండి ఉదయం 8 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో ఈదలూరు, నారెగూడెం, కురుమర్తి, కట్టంగూర్, అయిటిపాముల, వందనపల్లి, గార్లబాయిగూడెం, పరడ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో గల ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. వర్షం నీటిలో ధాన్యం కొట్టుకుపోయినట్లు పలువురు రైతులు అవేదన వ్యక్తం చేశారు.

ఈదులూరులో రైతులు గాజుల శ్రీను, వెంకన్న, వేణుగోపాల చారి, వీరయ్యకు చెందిన ధాన్యం రాశులు నీటిలో కొట్టుకుపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. తడిచిన ధాన్యాన్ని అరబెట్టడానికి, ధాన్యం రాశులు తిరగబోయడానికి తగిన స్థలం లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కేంద్ర నిర్వాహకులు కొనుగోళ్లను ప్రారంభించి కాంటాలను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

## రెండున్నర కోట్ల విలువైన గంజాయి పట్టివేత

**- సుజాతనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన**

**- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**






సత్యమేవ జయతే – కొత్తగూడెం కొత్తగూడెం :రెండున్నర కోట్ల విలువ చేసే 499 కేజీల గంజాయిని సోమవారం సుజాతనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు పట్టుకున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు లారీ కంటైనర్‌లో ప్రభుత్వ నిషేదిత గంజాయిని భద్రాచలం నుండి కొత్తగూడెం, ఖమ్మం మీదుగా రాజస్థాన్‌లోని జైపూర్ కి అక్రమ రవాణా చేస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు సీసీఎస్ పోలీసులు, సుజాతనగర్ ఎస్ఐ రమాదేవి తన సిబ్బందితో కలిసి సంయుక్తంగా సుజాతనగర్ మండలం, వేపలగడ్డ గ్రామంలో ఉన్న అన్నపూర్ణ బేకరీ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. %ఖూ3దీూ% 6754 అను నంబర్ గల అశోక్ లేలాండ్ లారీ కంటైనర్ కొత్తగూడెం నుండి ఖమ్మం వైపుగా వస్తుండగా, పోలీసులు ఆపి తనిఖీ చేయగా గంజాయి లభించింది. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం మధ్యాహ్నం సుజాతనగర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బి రోహిత్ రాజు కేసు విషయాలను వెల్లడించారు.కంటైనర్ ను తనిఖీ చేయగా అందులో 96 గంజాయి ప్యాకెట్లను గుర్తించడం జరిగిందన్నారు. ప్యాకెట్లలో సుమారుగా రూ.2,30,00,000/- విలువ గల 499 కేజీల గంజాయి ఉన్నట్లు చెప్పారు. గంజాయిని విక్రయించిన, కొనుగోలు చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. మహారాష్ట్రకు చెందిన జగదీశ్ దయారాం పాటిల్(37), కంటైనర్ లారీ ఓనర్ కం డ్రైవర్, కర్ణాటకకు చెందిన సంజు కుమార్ (49)లపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.గంజాయిని, నేరస్తులను పట్టుకోవడంలో చాకచక్యం ప్రదర్శించిన సీఈఎస్ సీఐ రమాకాంత్, ఎస్ఐలు ప్రవీణ్, రామారావు, వారి సిబ్బందిని, సుజాతనగర్ ఎస్ఐ రమాదేవి, వారి సిబ్బందిని, కేసు విచారణాధికారి, సీఐ ఆర్.వెంకటేశ్వర్లు, వారి సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు రూ.25 కోట్ల విలువ చేసే 5,200 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు, 59 కేసులు ఫైల్ చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేంతవరకు ఉద్యమాలు




సత్యమేవ జయతే – హైదరాబాద్ హైదరాబాద్ : రాష్ట్రంలోని బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేంతవరకు బలమైన ఉద్యమాలు చేయాలని తెలం గాణ బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకట్రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు పిలుపు నిచ్చారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. తరతరాలుగా అణిచివేత,వివక్షతకు గురౌవుతున్న బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే 42 శాతం రిజర్వేషన్లు అమలు కావాల్సిన అవసరం ఉందన్నారు.


బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కాలంటే రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్లో చేర్చాలన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ఆమోదం పొందేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. బీసీ రిజర్వేన్లపై హైకోర్టు ఇచ్చిన స్టేను ఎత్తివేయాలని కోరుతూ ఈ నెల 15న జరిగే రాస్తారోకోలు,నిరసన కార్యక్రమాల్లో బీసీలు అధిక సంఖ్యల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో సంఘం నేతలు తాటి వెంకటేశ్వరరావు,ఆర్.పాండు రంగాచారి, డి.జె.సాయిల్‌గౌడ్, నరసయ్య పాల్గొన్నారు.

## బైపాస్ రోడ్డుకు మహర్ధశ..!

**- రోడ్డు పనులకు నిధుల మంజూరు**

**- వ్యవసాయేతర భూములకు కూడా పరిహారం**

**ఫలించిన తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కృషి..**



సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా.తాండూరు, : తాండూరులో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్డుకు మళ్లీ మహర్ధశ పట్టింది. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కృషితో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం నిధుల విడుదలకు సంబంధించి జీఓ 130ను జారీ చేసింది.గత ప్రభుత్వ హాయాంలో నిర్మాణ పనులు ప్రారంభమై.. మధ్యలో కొన్ని ఆటంకాలతో పనులు ఆగిపోయిన సంగతి తెలిసిందే. ఈ రోడ్డు పనులు పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఆర్అండ్‌బీ శాఖ చీఫ్ సెక్రటరిలను కలిసి వినతిపత్రాలను అందజేశారు. తాజాగా సోమవారం ప్రభుత్వం తాండూరు బైపాస్ రోడ్డుకు సంబంధించి జీఓను జారీ చేసింది. రోడ్డు పనుల కోసం రూ.108 కోట్లు నిధులు విడుదల చేస్తున్నట్లు జీవో 130ను తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ద్వారా జారీ చేశారు.గతంలో ఉన్న రూ. 78 కోట్ల నుండి రూ.108 కోట్ల రూపాయలు పెంచినట్లు స్పష్టం చేసింది. అదేవిధంగా అసంపూర్తి పనులతో పాటు భూనిర్వసితులకు నష్టపరిహారం చెల్లించనున్నట్లు వెల్లడించింది. భూ నిర్వాసితులకు నష్టపరిహారం గతంలో రూ.17.40 కోట్లతో పాటు అధనంగా రూ.25.13 కోట్లు పెంచడం జరిగిందని పేర్కొంది. భూ నిర్వాసితులకు మొత్తం రూ. 42.53 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని తెలిపింది. వ్యవసాయేతర భూమికి గజానికి రూ.6000, వ్యవసాయ భూమికి ఎకరానికి రూ. 21 లక్షలు చెల్లించనున్నట్లు స్పష్టం చేసింది. ప్రభుత్వం జీవో జారీ చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చూపిన చొరవకు అభినందనలు తెలుపుతున్నారు.

# మొదటిసారిగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలకు ఆతిథ్యం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

సత్యమేవ జయతే – పటాన్‌చెరుపటాన్‌చెరు : రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలకు వేదికగా పటాన్‌చెరు నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానం వేదికగా ఈ నెల 16 నుండి 18 తేదీ వరకు జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్, కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీల ఏర్పాట్లను పరిశీలించారు.ఉమ్మడి మెదక్ జిల్లా టీం అండర్ 14, అండర్ 17 కబడ్డీ బాలుర బాలికల ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలకు ఆతిథ్యం అందిస్తున్నామని తెలిపారు.33 జిల్లాల నుండి 400 మంది క్రీడాకారులు, 60 మంది కోచులు, 160 మంది వ్యాయామ ఉపాధ్యాయులు ఈ క్రీడోత్సవాలలో పాల్గొనబోతున్నారని తెలిపారు. మూడు



రోజులపాటు అంగరంగ వైభవంగా వాలీబాల్ కబడ్డీ అంశాలలో ఈ పోటీలు జరగనున్నాయని తెలిపారు. 40 లక్షల రూపాయలు సొంత నిధులతో క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. క్రీడాకారులతోపాటు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై పోటీలను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి



చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయక రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, గౌసుద్దీన్, ఎల్లయ్య, ప్రమోద్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలో వేరైనా ఎజెండా ఒక్కటే బీసీ నినాదం....

**ఓట్లు మావి సీట్లు మీవా...**

**ఈ డబ్ల్యు ఎస్ కోట వల్ల బీసీలకు తీరని అన్యాయం...**

**అన్ని రంగాల్లో అన్యాయమే....**

**ఈనెల 18న తెలంగాణ బంద్...**

**ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో ముందుకు సాగుతాం...**

సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా....తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ కులాల జనాభా మొదటి స్థానంలో ఉండగా మాకు అన్ని రంగాలలో వచ్చే రిజర్వేషన్ లు చివరి స్థానంలో ఉన్నాయని బిసి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం వికారాబాద్ క్లబ్ ఫంక్షన్ హాల్ లో బీసీ కులాల ఐక్య కార్యాచరణ సంఘం సమావేశం మాజీ లైబ్రరీ చైర్మన్ గుడిసె లక్ష్మణ్ అధ్యక్షతన.. కే యాదగిరి యాదవ్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుని ఆధ్వర్యంలో నిర్వహించారు. బీసీ సంఘం జాతీయ నాయకులు ఆర్ కృష్ణయ్య పిలుపు మేరకు ఈనెల 18 న స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని, 42 శాతం రిజర్వేషన్ కు వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించిన అగ్రకులాలకు వ్యతిరేకంగా కార్యాచరణ బీసీ కులాలు చెందిన అన్ని రంగాలకు చెందినవారు చర్చించారు. ఓట్లు మావి సీట్లు మీవా అన్ని పార్టీల



అగ్రకులాల నాయకులను వారు ప్రశ్నించారు. అనాది నుండి అన్ని రంగాలలో బీసీ కులాలకు అన్యాయమే జరుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తు తరాలలో బీసీ కులాలన్నీ బానిస బతుకుల్లోకి నెట్టి వేయబడతారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పార్టీలలో ఉన్న బీసీ కులాల నాయకులు పార్టీలకు అతీతంగా వారి జెండాలను అజెండాలను పక్కనపెట్టి కేవలం బీసీల ఎదుగుదల కోసం అన్ని రంగాలలో ప్రాముఖ్యత ఉండే విధంగా మేమెంతో మాకు అంత అనే రిజర్వేషన్ అమలయ్యే తరహాలో ఎజెండాను ప్రామాణికంగా తీసుకొని బిసి కులాలకు చెందిన ప్రతిబిడ్డ ముందుకు సాగాలని వారు ఈ సమావేశంలో తీర్మానం చేశారు. ఈనెల 18న తెలంగాణ వ్యాప్తంగా బీసీ రిజర్వేషన్ 42 శాతం అమలయ్యే విధంగా నిరసన కార్యక్రమంలో భాగంగా తెలంగాణ బందును వికారాబాద్ జిల్లాలో ప్రతి బీసీ బిడ్డ బందులో పాల్గొని సంపూర్ణంగా విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. రైతులు మొదలుకొని ఉద్యోగులు విద్యార్థులు ఉద్యమకారులు మేధావులు అన్ని ప్రభుత్వ రంగాలలో పనిచేస్తున్న బీసీ కులాల బిడ్డలు ప్రతి ఒక్కరు తమ సహాయ సహకారాలు అందిస్తూ ఈ ఉద్యమంలో కలిసికట్టుగా ముందుకు సాగాలని రాజకీయ పార్టీలను రాజకీయాలను పక్కనపెట్టి భవిష్యత్ బీసీ తరాల బౌతవ్యం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఎడ్యుకేషన్ బోర్డ్ చైర్మన్ మాజీ జి నాగేందర్ గౌడ్ ఎక్స్ జెడ్ పి టి సి కుక్కింద రాములు జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పి శ్రీనివాస్, కురుమ యాదవ సంఘం అధ్యక్షులు గోపాల్ సత్యనారాయణ, గౌడ సంఘం శ్రీనివాస్ గౌడ్ పి సత్యనారాయణ గౌడ్, లక్ష్మణ్ ముదిరాజ్ సంఘం ప్రెసిడెంట్ బి.ఆర్ శేఖర్ నాయి బ్రాహ్మణ సంఘం ఎం శేఖర్ రమేష్, వడ్డెర సంఘం నుంచి వి అంజయ్య వీఆర్ అంజయ్య స్వర్ణకార సంఘం నుంచి టి సురేష్ బాబు సిహెచ్ అశోక్, వీరశైవ సంఘం నుంచి విజయ్ కుమార్ అప్ప ఉమా శేఖర్ ఆరెకటిక సంఘం నుంచి బన్సీలాల్ తమ్మలి సంఘం నుంచి చంద్రమౌళి రాజు అడ్వకేట్ రాజశేఖర్ లక్ష్మణ్ కుమ్మరి సంఘం నుంచి కే మారుతి . వర్కింగ్ ప్రెసిడెంట్ లాలయ్య వికారాబాద్ జిల్లా బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు జరగబోయే బందును దిగ్విజయం చేస్తామని అన్ని సంఘాల వారు చెప్పడం జరిగింది ఈ సందర్భంగా గుడిసె లక్ష్మణ్ మాట్లాడుతూ బీసీ బీసీలలోని అన్ని కుల సంఘాలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు..

# ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు

**3500 మంది ఎస్జీటీలకు హెచ్‌ఎంలు, ఎస్ఏలుగా ప్రమోషన్**

**అధికంగా 13 జిల్లాల్లో పోస్టులు ఖాళీ?**

**త్వరగా సర్దుబాటు చేయాలని విద్యాశాఖ ఆదేశాలు**

**గడువు ముగిసినా పూర్తి కాని ప్రక్రియ**

రాష్ట్రంలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలున్నాయి. ఇటీవల జరిగిన పదోన్నతుల ప్రక్రియ వల్ల సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీలు) ఉన్నత స్థానాలకు వెళ్లారు. దీంతో ప్రాథమిక విద్య బోధనలో అంతరాయం ఏర్ప డుతున్నది. దాదాపు 3500 మంది ఎస్జీటీలు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు (హెచ్‌ఎంలు), స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏలు) గా ప్రమోషన్ పొందారు. దీంతో ప్రాథమికస్థాయి పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడ్డాయి.

**13 ..జిల్లాలో**

రాష్ట్రంలోని 13 జిల్లాల్లో టీచర్ల కొరత ఎక్కు వగా ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు గుర్తిం చారు. ఆయా జిల్లాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు బోధించాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల ఇతర సబ్జెక్టుల టీచర్లనూ ప్రైమరీ స్కూల్కు సర్దుబాటు చేయాల్సి వస్తున్నది. ఇప్పటికీ ఆది లాబాద్, యాదాద్రి భువనగిరి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, నిర్మల్, భూపా లపల్లి, జనగామ, కరీంనగర్, సంగారెడ్డి, వనపర్తి, నారాయణ పేట జిల్లాల్లో సర్దుబాటు చేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. మిగులు టీచర్ల సర్దుబాటు బాధ్యతలను కలెక్ట ర్లకు అప్పగించారు. వారి నేతృత్వంలోనే ఈ ప్రక్రియంతా పూర్తి చేయాలి. స్కూళ్లలోని విద్యార్థుల సంఖ్య, కొత్త అడ్మిషన్లను ప్రామాణి కంగా తీసుకుని సర్దుబాటును పూర్తి చేయాల్సి ఉంటుంది. మొదటగా జూన్ 13 వరకు పూర్తి చేయాలని చెప్పగా.. ఆ తర్వాత జులై 15 వరకు గడువు తేదీని పొడిగించారు. మొత్తంగా జులై 22లోపు టీచర్ల సర్దుబాటు పూర్తి చేసి ఆ నివేదికను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్కు సమర్పించాలని ఆదేశాలు ఉన్నాయి. కానీ గడువు ముగిసినా చాలా జిల్లాల నుంచి నివేదికలు పాఠశాల విద్యా డైరె క్టరేట్కు అందలేదు. అయితే, ప్రాథమిక పాఠ శాలల్లో 10 మంది విద్యార్థులకు ఒక టీచర్,

11 నుంచి 60 మంది విద్యార్థు లకు ఇద్దరు టీచర్లు, 61 నుంచి 90లోపు విద్యార్థులు ఉంటే ముగ్గురు టీచర్లు ఉండాలి.

సర్దుబాటుపై హెచ్‌ఎంల విజ్ఞప్తి

ఈ పరిస్థితిపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగు ణంగా టీచర్లను సర్దుబాటు. చేయాలని వారు విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. తక్షణమే మిగులు ఉపా ధ్యాయులను ఖాళీ అయిన పోస్టుల్లో సర్దుబాటు చేయడంతో పాటు ఖాళీలను భర్తీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. కాగా, టీచర్ల సర్దుబాటు విషయంలో పలువురు టీచర్లు సుముఖంగా లేకపోవడం, వారు ఆయా ప్రాంతాలకే పరిమి తమై ఉండటం వలన టీచర్ల సర్దుబాటుహెచ్‌ఎంలకు సవాలుగా మారుతోంది. పదో న్నతుల అనంతరం ఖాళీ అయిన ఎస్జీటీ పోస్టులను త్వరితగతిన భర్తీ చేయకపోతే ప్రాథమిక విద్య నాణ్యతపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని విద్యావేత్తలు హెచ్చరిస్తు న్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లి దండ్రులు, పలువురు ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్..





**ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలపై ముస్లింల ఆవేదన - ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠిన చర్యలు కోరిన వికారాబాద్ ముస్లింలు**

సత్యమేవ జయతే – వికారాబాద్, అక్టోబర్ 13:వికారాబాద్ పట్టణంలో సోమవారం సాయంత్రం నుండి ముస్లిం నాయకులు, మత పెద్దలు, యువకులు పెద్ద ఎత్తున గుమికూడి పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు.

“ప్రవక్త గౌరవాన్ని అవమానించిన వారిని క్షమించం” అంటూ నినాదాలు గర్జించాయి. నిరసనలో పాల్గొన్నవారు తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్ ఇటీవల మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారిపై చేసిన అభ్యంతరకర, అవమానకర వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం సమాజంలో తీవ్ర ఆగ్రహానికి దారితీశాయి. ఆయన వ్యాఖ్యలు మతపరమైన భావోద్వేగాలను దెబ్బతీశాయని ఆవేదన వ్యక్తం చేసిన ముస్లింలు, రాజాసింగ్‌పై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

**ఫిర్యాదు సమర్పించిన ముస్లిం నాయకులు**

ఆందోళన అనంతరం ముస్లిం నాయకులు వికారాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గారికి లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు.

రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు మత సామరస్యాన్ని భంగం చేసేలా ఉన్నాయని తమ ఫిర్యాదులో పేర్కొంటూ, వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

**“గుండెలను మెలిపెట్టిన వ్యాఖ్యలు” – మైనారిటీ నాయకుడు ఆదం సబ్**

ఈ సందర్భంగా మైనారిటీ నాయకుడు మొహమ్మద్ ఆదం సబ్ మాట్లాడుతూ,“రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు మా హృదయాలను తీవ్రంగా బాధించాయి. ఇది గుండె పగిలే విషయం. మా ప్రవక్త గౌరవాన్ని కించపరచడం మేమెప్పుడూ సహించము. చట్టం ముందు ఎవరూ పెద్దవారు కాదుబీ తప్పు చేసినవారికి శిక్ష తప్పదు,” అని గట్టిగా పేర్కొన్నారు.

**“ప్రవక్త గౌరవం కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధం”**

మొహమ్మద్ ఆదం సబ్ మరింత ఘాటుగా మాట్లాడుతూ, “ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గౌరవం కాపాడటం ప్రతి ముస్లింకు ధర్మం. అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధం.ప్రవక్త గారు కేవలం ముస్లింలకే కాదు, సమస్త ప్రపంచానికి కారుణ్యస్వరూపం. ఆయనను అవమానించడం అంటే మానవత్వాన్నే అవమానించడం,” అని తెలిపారు.

అలాగే ఆయన రాజాసింగ్‌ను “అజ్ఞాని, దురదృష్టవంతుడు”గా పేర్కొంటూ,“ప్రవక్త ముహమ్మద్ గారి గొప్పతనం హిందూ ధర్మగ్రంథాల్లో కూడా ప్రస్తావించబడింది,” అని గుర్తుచేశారు.

**మత పెద్దల పిలుపు – సామరస్యాన్ని కాపాడండి**

ఆందోళనకు హాజరైన మత పెద్దలు, సమాజ ప్రతినిధులు మాట్లాడుతూ,“మతాల మధ్య ఐక్యతను కాపాడటం, పరస్పర గౌరవాన్ని నిలుపుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత,” అని పిలుపునిచ్చారు.ఇలాంటి వ్యాఖ్యలు ద్వేషాన్ని పెంచుతాయని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

**వికారాబాద్ ముస్లింల సందేశం:**

“మత సామరస్యాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే సమాజంలో శాంతి నిలుస్తుంది. ప్రభుత్వం తక్షణం స్పందించి రాజాసింగ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి.”

# రక్తం పీల్చేసే.. తలసేమియా!

**రక్తం..**

**శరీరాన్ని నడిపిస్తుంది. రక్త ప్రసరణ నిరంతర ప్రక్రియ. శరీరం చేసే పని.. ఖర్చయిన రక్తాన్ని బట్టి కొత్త రక్తం ఉత్పత్తి అవుతుంది. కానీ.. కొందరు చిన్నపిల్లల్లో రక్తం నీళ్లు తాగినట్లే ఖర్చవుతుంది. ఉత్పత్తి కూడా మందగిస్తుంది. మరి బతికేది ఎట్లా? శరీరం పనిచేసేది ఎట్లా? నిరంతరాయంగా రక్తం ఎక్కించడం ఒక్కటే మార్గం. మే 8న అంతర్జాతీయ తలసేమియా దినోత్సవం సందర్భంగా దీని గురించి తెలుసుకుందాం!అవయవాలన్నీ సక్రమంగా పని చేయాలంటే రక్తం అవసరం. మానవ జీవక్రియలన్నీ రక్త ప్రసరణ ఆధారంగానే జరుగుతాయి. ఎర్ర రక్తకణాలైనా.. తెల్ల రక్తకణాలైనా సమాన స్థాయి లో ఉంటేనే ఆరోగ్యంగా ఉంటా రు. అయితే కొందరి శరీరంలో ఎర్ర కణాలు తగ్గుతాయి. అవసరమైనంత రక్తం ఉత్పత్తి కాదు. ఇదే తలసేమియా.**

### ఏంటీ తలసేమియా?

ఎముక మూలుగలో హిమోగ్లోబిన్ ఉండే ఎర్రరక్తకణాల ఉత్పత్తి నిలిచిపోవడాన్ని తలసేమియా వ్యాధి అంటారు. మేనరికపు వివాహాలు చేసుకున్న తల్లిదండ్రుల వల్ల జన్యుపరంగా ఇది సంక్రమిస్తుంది. సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ లెక్కల ప్రకారం ప్రపంచంలో 4.5% మంది చిన్నారులు ఈ వ్యాధితో బాధపడుతున్నారు. 25% మంది పుట్టుకతోనే ఈ వ్యాధిగ్రస్తులయ్యే ప్రమాదం ఉంది. మిగతా 25% మంది సంపూర్ణ ఆరోగ్యవంతులు కావచ్చు. మరో 50% కేవలం వాహకులుగా మిగిలిపోవచ్చు. వీరికి పెద్దగా సమస్యలు ఉండవు. కానీ మరో వాహకుడి ద్వారా కలిగిన సంతానానికి మాత్రం తలసేమియా వస్తుంది.

### ఎన్ని రకాలు? తలసేమియా రెండు రకాలు.

**1.ఆల్ఫా తలసేమియా ఇది రెండు రకాలు.**

హిమోగ్లోబిన్ హెచ్: ఎముకల సంబంధిత సమస్యలు వస్తాయి. నుదురు, దవడల వద్ద ఎముకలు పరిమాణానికి మించి పెద్దగా ఉంటాయి. బుగ్గలు పెరుగుతుంటాయి. కామెర్లు సోకి, చర్మం పసుపురంగులోకి మారిపోతుంది. కళ్లల్లోని నల్ల గుడ్డు పెద్దగా కనిపిస్తుంది. హైడ్రాప్స్ ఫెటలిస్: ఇది సోకిన శిశువులు జన్మించిన కొద్దిరోజులకే మరణిస్తారు. కొంతమంది గర్భంలోనే చనిపోతుంటారు. 2.బీటా తలసేమియా: ఇది మేజర్ తలసేమియా, ఇంటర్మీడియా తలసేమియా అని రెండు రకాలు. పిల్లలకు రెండేళ్ల వయస్సు రావడానికి ముందే మేజర్ తలసేమియా లక్షణాలు బయటపడతాయి. ఈ వ్యాధివల్ల బీటా గ్లోబిన్ జన్యువులు ప్రభావితమవుతాయి. పిల్లల ప్రాణానికి ప్రమాదం కలిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇది సోకినవారికి తరచుగా రక్తాన్ని ఎక్కిస్తుండాలి. ఇంటర్మీడియా తలసేమియా తీవ్రత బీటా కంటే తక్కువగా ఉంటుంది.

### లక్షణాలు

-తలసేమియా వ్యాధి సోకిన పిల్లల్లో లక్షణాలు ముందుగా బయటపడవు. కాస్త ఆలస్యంగా బయటపడుతాయి.

-ఈ వ్యాధి చిన్నారులలో మూడు నెలల వయస్సు నుంచి 18 నెలల వయస్సు మధ్య బయటపడుతుంది.

-ముఖం పీక్కుపోయి, బాల్యంలోనే ముడతలు పడినట్టుగా ఉంటుంది.

-తరచుగా అనారోగ్యాలు వస్తుంటాయి.

-ఆకలి సరిగా ఉండదు. మందకొడిగా ఉంటారు.

-శారీరక ఎదుగుదల కనిపించదు.

-పిల్లలు పాలిపోయినట్టుగా ఉంటారు. శరీర రంగులోనూ తేడా ఉంటుంది.

-కామెర్లు సోకి చర్మం పసుపు రంగులోకి మారుతుంది.

-కొన్నిసార్లు కళ్లల్లోని తెల్లగుడ్డు పసుపు రంగులో కనిపిస్తుంది.

-బొడ్డు భాగంలో వాపు ఉంటుంది.

నిర్ధారణ ఎలా?

తలసేమియా వ్యాధిని నిర్ధారించడానికి కొన్ని ముఖ్యమైన పరీక్షలు చేయాలి. దంపతులు, గర్భిణులకు హెచ్‌బీ, ఎ2 స్థాయి రక్త పరీక్షలు చేస్తారు. గర్భిణులకు సీవీసీ శాంపిల్ పరీక్షలు చేసి శిశువుకు తలసేమియా ఉందా లేదా? అన్న విషయం నిర్ధారిస్తారు. హిమోగ్లోబిన్ ఎలక్ట్రోఫొరెసిస్ పరీక్ష ద్వారా ఈ వ్యాధి లక్షణాలను తెలుసుకోవచ్చు. ఈ పరీక్ష ద్వారా ఎర్ర రక్తకణాల్లో ఉన్న వివిధ కణజాలాలను వేరుచేస్తారు. వాటిలో విభిన్నంగా ఉన్న కణజాలాలను గుర్తిస్తారు.

### ఎలా వస్తుంది?

ఆక్సీజన్‌ను రక్తం ద్వారా శరీరంలోని అన్ని భాగాలకూ అందించే బాధ్యత హిమోగ్లోబిన్‌దే. తలసేమియా రోగుల్లో శరీరానికి అవసరమైనంతగా ఎముకల మూలుగల్లో హిమోగ్లోబిన్ ఉత్పత్తి కాదు. కొన్నిసార్లు ఉత్పత్తయినా ఎక్కువకాలం నిల్వ ఉండదు. హిమోగ్లోబిన్ నిల్వలు దారుణంగా పడిపోతాయి. అలా పడిపోయిన ప్రతిసారీ హిమోగ్లోబిన్‌ను కృత్రిమంగా రక్తం ద్వారా అందించాలి. సకాలంలో అందించకపోతే ప్రాణం పోతుంది. తల్లిదండ్రుల్లో ఉండే జన్యుపరమైన లోపాల కారణంగా ఈ వ్యాధి పిల్లలకు సంక్రమిస్తుంది. జన్యువుల్లో వ్యత్యాసాలు ఉన్నప్పుడు తలసేమియా వస్తుంది.

### జాగ్రత్తలు ఏంటి?

-ఎట్టి పరిస్థితుల్లోనూ మేనరికపు వివాహాలు, రక్త సంబంధీకులు, దగ్గరి బంధువుల మధ్య వివాహాలు చేసుకోకూడదు.

-దూరపు సంబంధాలైనా వివాహానికి ముందుగానే రక్త పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరం.

-తలసేమియా ఉన్నట్టు రక్త పరీక్షల్లో తేలితే ముందే జాగ్రత్తపడే అవకాశం ఉంటుంది.

-తలసేమియా సోకిన వారికి రక్తం ఎక్కించిన ప్రతిసారీ ల్యూకో డిప్లీషన్ ఫిల్టర్లు వాడాలి.

-క్రమం తప్పకుండా దంత, గుండె, మూత్రపిండాల, క్యాల్షియం, ఫాస్పరస్ స్థాయిలను తెలిపే పరీక్షలు చేయిస్తుండాలి.


-వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. అప్పుడే ఆ బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడు.


-తలసేమియా గల పిల్లలకు వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉంటుంది. అందువల్ల ఎలాంటి ఇన్ఫెక్షన్లు సోకకుండా చూసుకోవాలి.


-నెలకు సుమారు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు మందుల కోసం తప్పనిసరిగా ఖర్చు చేయాలి.

### చికిత్స ఏంటి?

తలసేమియా వ్యాధి లక్షణాలను బట్టి చికిత్స చేయాల్సి ఉంటుంది. శరీరంలో ఎర్ర రక్త కణాల సంఖ్యను పెంచడానికి తరచుగా రక్తాన్ని ఎక్కిస్తుండాలి. కొంతమందికి ప్రతి ఇరవైఒక్క రోజులకు ఒకసారి రక్తాన్ని ఎక్కించాలి. ఎముకల్లో ఉన్న కణాలను మార్పిడి చేసి వ్యాధిని నివారించవచ్చు. దీన్ని వైద్య పరిభాషలో బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ అంటారు. ఐతే.. తలసేమియా రోగులందరికీ ఇది చేయడం సాధ్యం కాదు. రక్తం ఎక్కించిన రోగుల్లో ఐరన్ సాధారణ స్థాయికి మించి ఉంటుంది. ఊపిరితిత్తులు, గుండెపై ప్రభావం చూపుతుంది. అలాంటి రోగులు ఐరన్ కేలేషన్ థెరపీ చేయించుకోవాలి. ఈ థెరపీని ఇంజక్షన్ రూపంలో తీసుకోవాలి. శరీరంలో అదనంగా ఉన్న ఐరన్ కణాలను ఇది బయటకు పంపుతుంది.







మార్కులు తక్కువొచ్చాయని ఒకరు, ఫెయిల్ అయ్యామని మరొకరు. మనస్థాపంతో పరీక్షా ఫలితాలను ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు విద్యార్థులు. ఇది ఎవరికి నష్టం? పిల్లలకు కావాల్సింది మేధస్సా? మార్కులా? ఒత్తిడిని జయించి ప్రాణాలు నిలుపుకోవాల్సిన బాధ్యత మాత్రం అందరిదీ. మేడ్చల్లో నవ్యశ్రీ.. మారేడ్‌పల్లిలో లాస్య.. వరంగల్‌లో భానుకిరణ్.. బోధన్‌లో వెన్నెల ఆత్మహత్య చేసుకున్నారు. వీరందరి చావులకు ఒకే కారణం కావడం బాధాకరం. పరీక్షల్లో మార్కులు తక్కువొచ్చినంత మాత్రాన.. ఫెయిల్ అయినంత మాత్రాన ప్రాణాలు తీసుకుంటే ప్రయోజనం ఏంటి? చావే పరిష్కారమా? పిల్లల చావును ప్రేరేపిస్తున్న ఒత్తిడికి కారణం పేరెంట్సా? విద్యాసంస్థలా? పిల్లలా? తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఒకవేళ పరీక్ష ఫెయిలయ్యారే అనుకోండి. ఇంకో అవకాశం లేదా? ఇక్కడితోనే అయిపోదు కదా? తమ పిల్లలకు మంచి జీవితం ఇవ్వాలని ఆశించేది తల్లిదండ్రులే. బుడిబుడి అడుగుల నుంచి కంటికి రెప్పలా చూసుకుంటూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేది తల్లిదండ్రులే. పిల్లలకు చిన్న దెబ్బ తగిలినా తమకే తగిలినట్టు విలవిల్లాడేది తల్లిదండ్రులే. మరి పిల్లలు చేస్తున్నది ఏంటి? ప్రాణానికి ప్రాణంగా ప్రేమించే కన్నవారిని శోకసంద్రంలో ముంచేసి ప్రాణాలు తీసుకుంటున్నారు. జీవితంలో సాధించాలన్న కసి ఉండాలే తప్ప.. ఓ పరీక్షలో తప్పానని, మార్కులు (90%

# ఒత్తిడిని జయించండి.. ప్రాణాలు నిలుపుకోండి!

మార్కులు దాటినా కాని) తక్కువగా వచ్చాయని ప్రాణాలు తీసుకోవడం సబబేనా? తల్లిదండ్రులు కూడా వారిపై మార్కుల ఒత్తిళ్లు తేవడం సమంజసమేనా? దీనికి ఎవరు బాధ్యులు? విద్యాసంస్థలేమో పిల్లలను నంబర్1 చేయడమే మా లక్ష్యం అంటారు. తల్లిదండ్రులు తమ పిల్లలపట్ల స్నేహభావంతో ఉండాలి. పరుష పదజాలంతో దూషించకూడదు. పిల్లల స్నేహాలు, విద్యాలయాలలో వారి ప్రవర్తన, చదువు తీరునూ పరిశీలిస్తుండాలి. చదువు తమ వంశ ప్రతిష్ఠ అంటూ గర్వాలకు పోకుండా పిల్లల పట్ల సానుకూలంగా ఉండాలి. మార్కులే ధ్యేయంగా పెంచకూడదు. 90% మార్కులు వచ్చిన వారు ఎంత ప్రతిభావంతులో 40% మార్కులు వచ్చిన వారు కూడా అంతే ప్రతిభావంతులనే చిన్న విషయాన్ని పిల్లలకు అర్థం చేయించాలి. ఒకసారి పరీక్షలో తప్పితేనే జీవితం నష్టం పోదనే భరోసా ఇవ్వాలి. మళ్లీ చదివి పాస్ కావచ్చనే ధైర్యం ఇవ్వాలి. విద్యార్థులు ప్రతి విషయానికి క్షణికావేశానికి లోనుకాకూడదు. మీ సమస్యను స్నేహితులు, తల్లిదండ్రులు, సన్నిహితంగా ఉండే ఉపాధ్యాయులతో చర్చించాలి. ఏ విషయమైనా తల్లిదండ్రులతో చర్చించాలి. విద్యార్థులకు మార్కులు కాదు.. విజ్ఞానం ముఖ్యమనే విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించాలి. తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి పెంచకూడదు. విద్యార్థుల ప్రతిభకు మా ర్కులు కొలమానం కానే కాదు. కాబట్టి ఒత్తిడిని జయించి.. ప్రాణాలు నిలుపుకోండి!



ఎండాకాలం కదా.. దాహానికి తట్టుకోలేక చల్లని పదార్థాలు తీసుకుంటాం. అందులోనూ.. శీతల పానీయాలు (కూల్‌డ్రింక్స్) మరీ ఎక్కువ. కానీ.. అది ప్రమాదం అని గ్రహించాలి. వీటిద్వారా ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి!తాగితే? : మనం తీసుకునే ఆహారం

# శీతల పానీయాలతో సంతానలేమి

ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుందనే విషయం అందరికీ తెలిసిందే కదా? అలాగే తాగేవి ఆరోగ్యంతో పాటు గర్భధారణపై తీవ్ర ప్రభావం చూపుతాయనేది గ్రహించాలి. సోడాలు, ఇతర శీతల పానీయాలు తాగితే స్త్రీ పురుషులు ఇద్దరిలోనూ సంతానోత్పత్తి సమస్యలు ఎదురవుతాయి. తెలియకముందు తాగితే ఏం చేస్తాం? కానీ.. సమస్య తీవ్రతేంటో తెలిసిన తర్వాత కూడా శీతల పానీయాలను ఆస్వాదించడం.. వాటి ద్వారా కలిగే క్షణపాటు ఆనందాన్ని అద్భుతమనుకోవడం తప్పు.

ఆస్పర్‌టేమ్ అపాయం: శీతల పానీయాల్లో తీపి కోసం ఆస్పర్‌టేమ్ అనే కృత్రిమ పదార్థాన్ని కలుపుతారు. ఇది ఎండ్రోక్రైన్ గ్రంథులపై ప్రభావం చూపుతుంది. దీనివల్ల హార్మోన్ల అసమతుల్యత ఏర్పడి స్త్రీలలో సంతానోత్పత్తి సమస్యలు కలుగుతాయి. శీతల పానీయాలు ఎక్కువగా సేవించడం వల్ల అండాశయ సమస్యలు, బహిష్టు పూర్వ సమస్యలు ఏర్పడుతాయి. ఇటీవల గర్భస్రావాలు, శిశు వైకల్య సమస్యలు ఎక్కువవుతున్నాయి.

ఏముంటాయి? : ఆస్పర్‌టేమ్‌లో ఫినైలలానిన్, ఆస్ప్రెక్టిక్ యాసిడ్ అనే రెండు అమైనో ఆమ్లాలు ఉంటాయి. వీటిని ఇతర అమైనో ఆమ్లాలలో కలిపి తీసుకుంటే ఎలాంటి హానీ ఉండదు. కానీ వేటిలో కలపకుండా తాగితేనే శరీరంలోని కణాలు చనిపోయే ప్రమాదం ఉంది. మరీ ఎక్కువగా వీటిని తాగితే మగవారిలో వీర్యం.. ఆడవారిలో అండం కణాలు 90% చనిపోయే ప్రమాదం ఉంది.

మోతాదుకు మించి తాగితే? : అతిగా శీతల పానీయాలు తాగటం వల్ల రోగ నిరోధకశక్తి క్షీణిస్తుంది. హార్మోన్ల అసమతుల్యత, అధిక బరువు సమస్యలూ ఏర్పడతాయి. గర్భస్రావం, గర్భధారణ సరిగా లేకపోవడం జరుగుతాయి. ఎక్కువగా శీతల పానీయాలు తాగే పురుషులలో నాలుగింతలు వీర్యకణాల కౌంట్, చలనం, ఏకాగ్రత తగ్గే అవకాశం ఉన్నది. సోడాలో ఎక్కువ ఆమ్లాలు ఉంటాయి. వాటివల్ల శరీరంలోని పీహెచ్ శాతం మారిపోతుంది. తద్వారా వీర్యకణాలు ఆకారం మారడం, నాణ్యత లోపించడం, లేదా చనిపోవడం జరగవచ్చు. ఇంకా బిస్ ఫినాల్- ఎ కెమికల్ వల్ల పురుషుల వీర్య ద్రవం నాణ్యత క్షీణిస్తుంది. మూడూ కలిస్తే ముప్పు: చాలావరకు శీతల పానీయాలలో కెఫెన్ కలుస్తుంది. ఫ్రక్టోస్ కూడా ఉంటుంది. వీటివల్ల అండాశయ సమస్యలు.. సంతానోత్పత్తి సమస్యలు స్త్రీలలో ఎక్కువగా కనిపిస్తాయి. కెఫెన్ వల్ల రక్త నాళాలు ముడుచుకుపోతాయి. తద్వారా గర్భసంచిలోకి రక్తప్రసరణ తగ్గిపోతుంది. రుతుక్రమం తగ్గిపోతుంది. కెఫెన్, ఆస్పర్‌టేమ్, ఫ్రక్టోస్ కలిపి సేవించడం వల్ల సెక్స్ హార్మోన్లు, వాటి గ్రాహకాలపై ప్రభావం పడుతుంది. తద్వారా వంధ్యత్వం ఏర్పడుతుంది. గర్భం దాల్చాలనుకునేవారు ఎరేటేడ్ పానీయాలు మానేయాలి. అలా చేస్తేనే సంతానోత్పత్తిపై ప్రభావం ఉండదు. కూల్‌డ్రింక్స్ తాగకుండా సంతానోత్పత్తి సామర్థ్యాన్ని పరిరక్షించుకోండి!





సత్యమేవ జయతే




# గుండె లయ తప్పితే..?

బీపీ, షుగర్ లాంటి జీవనశైలి వ్యాధులు పెరుగుతుండడంతో గుండెపోటుతో పాటుగా ఈ ఆర్టియల్ ఫైబ్రిలేషన్ సమస్య కూడా పెరుగుతున్నది.

గుండెజబ్బులు అనగానే వెంటనే గుండెపోటు గుర్తుకొస్తుంది. కానీ గుండెపోటు సమస్య మాదిరిగానే గుండెజబ్బు కూడా ఉంటుంది. హృదయ స్పందనలో తేడాల వల్ల ఆర్టియల్ ఫైబ్రిలేషన్ అనే సమస్య ఇటీవల కాలంలో ఎక్కువైందన్నారు ఎస్టర్ ప్రైమ్ ఆస్పత్రి ఇంటర్వేన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రఘు. బీపీ, షుగర్ లాంటి జీవనశైలి వ్యాధులు పెరుగుతుండడంతో గుండెపోటుతో పాటుగా ఈ ఆర్టియల్ ఫైబ్రిలేషన్ సమస్య కూడా పెరుగుతున్నది. కాబట్టి దీనిపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని డాక్టర్ రఘు సూచించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్టియల్ ఫైబ్రిలేషన్ వ్యాధికి గల కారణాలు, నివారణోపాయాలను వివరించారు.

**ఆర్టియల్ ఫైబ్రిలేషన్ అంటే?**

గుండె సాధారణంగా నిమిషానికి 72 సార్లు కొట్టుకుంటుంది. ఈ హృదయ స్పందన ఒక క్రమపద్ధతిలో ఉండాలి. రెండు హార్ట్ బీట్ల మధ్య గ్యాప్ ఎక్కువైనా, తక్కువైనా హృదయ స్పందనలో తేడా వస్తుంది. దాంతో గుండె మరింత వేగంగా కూడా కొట్టుకోవచ్చు. ఇలా హృదయ స్పందనల్లో ఏర్పడే అపసవ్యతలనే ఆర్టియల్ ఫైబ్రిలేషన్ అంటారు. దీనివల్ల శరీరంలోని అవయవాలకు రక్తం సక్రమంగా సరఫరా కాదు. దాంతో రక్తం అంతా గుండె గదుల్లోనే పేరుకుపోతుంది. ఇలా నిల్వ కాబడిన రక్తాన్ని క్రమంగా గడ్డలుగా ఏర్పరుస్తుంది. ఈ రక్తం గడ్డలు గుండెకు మాత్రమే పరిమితం కాకుండా శరీరం అంతటా ప్రయాణిస్తాయి. ఇవి మెదడుకు సులువుగా వెళ్తాయి. అలా మెదడు రక్తనాళాల్లో ఈ గడ్డలు చేరినప్పుడు మెదడుకు రక్తసరఫరాలో అంతరాయం కలిగి బ్రెయిన్ స్ట్రోక్ వస్తుంది. పక్షవాతం రావడానికి 40 నుంచి 50 శాతం ఏట్రియల్ ఫిబ్రిలేషనే కారణం.



**ఎలా కనుక్కోవడం?**

ఆర్టియల్ ఫైబ్రిలేషన్ వల్ల హృదయ స్పందనల్లో వచ్చే హెచ్చుతగ్గులు స్థిరంగా ఉండవు. ఒక్కసారిగా తేడాలు వచ్చి, మళ్లీ మామూలవ్వొచ్చు. అందువల్ల ఈ సమస్యను ఈసీజీ ద్వారా తెలుసుకోవడం కూడా కొన్నిసార్లు కష్టం అవుతుంది. వైద్య సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన తరువాత హృదయ స్పందనల రేటును రికార్డు చేయడానికి అనేక రకాల డివైస్‌లు వచ్చాయి. యాపిల్ వాచ్‌లు, ప్రత్యేకమైన సాంకేతికత ద్వారా రూపొందించిన దుస్తుల ద్వారా కూడా వీటిని రికార్డు చేయవచ్చు. ఇంప్లాంటబుల్ లూప్ రికార్డర్ ద్వారా ఒక మైక్రోచిప్‌ని చర్మంలో అమర్చి, ఆర్టియల్ ఫైబ్రిలేషన్‌ను కనుక్కోవచ్చు. అయితే బీపీ, షుగర్ లాంటి వ్యాధులున్నవాళ్లు, అప్పటికే గుండెపోటు రావడం, గుండె పంపింగ్ సామర్థ్యం తక్కువగా ఉన్నవాళ్లు, ర్యుమాటిక్ హార్ట్ డిసీజ్ ఉన్నవాళ్లు, ఒకసారి స్ట్రోక్ వచ్చిన వాళ్లు ఈ పరీక్షల ద్వారా ఆర్టియల్ ఫైబ్రిలేషన్ సమస్య ఉందో లేదో చెక్ చేయించుకోవాలి. ఈ సమస్య ఉన్నవాళ్లలో గుండెదడ, ఆయాసం ఉంటాయి. ఎప్పుడూ నీరసంగా ఉంటుంటారు. కానీ పెద్దవాళ్లయితే వయసు వల్ల వచ్చిన నీరసం అని సరిపెట్టుకుంటుంటారు. కానీ అశ్రద్ధ చేయకూడదు. షుగర్ ఉండి, ఇలాంటి లక్షణాలుంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించాలన్నారు.

**ఎందుకిలా?**

సాధారణంగా వయసు పెరిగినాకొద్దీ శరీరంలోని అవయవాల్లో తేడాలు వస్తాయి. వాటి పనితీరు మందగిస్తుంది. అలా గుండె కొట్టుకోవడంలో కూడా సమస్యలు ఉత్పన్నమవుతాయి. దీనికి తోడు ఆధునిక జీవనశైలి వల్ల ముంచుకొచ్చిన అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధులు ఉన్నవాళ్లలో కూడా ఈ ఆర్టియల్ ఫైబ్రిలేషన్ సమస్య వచ్చే అవకాశం ఎక్కువ. అంతేకాదు, ర్యుమాటిక్ హార్ట్ డిసీజ్ వల్ల కూడా గుండె కొట్టుకోవడంలో తేడాలు వస్తాయి.

**పరిష్కారం ఎలా.?**

మందుల ద్వారా గుండె గదుల్లో రక్తం గడ్డ కట్టకుండా చేయవచ్చు. నోటి ద్వారా తీసుకునే యాంటి కోయాగ్యులెంట్ మందులు 65 నుంచి 70 శాతం స్ట్రోక్ రిస్క్ రాకుండా నివారిస్తాయి. అయితే వీటి వల్ల రక్తస్రావం అయ్యేందుకు ఆస్కారం ఉంటుంది. అందువల్ల ఇప్పుడు కొత్త మందులు వచ్చాయి. నావల్ యాంటి కోయాగ్యులెంట్స్ అనే ఈ మందులు మరింత సమర్థవంతంగా పనిచేస్తాయి. రక్తస్రావం అయ్యే అవకాశం చాలా తక్కువ. ఈ సమస్య ఉన్నప్పటికీ మంచి చికిత్సలున్నాయి. కాబట్టి అవగాహన పెంచుకుని, సకాలంలో డాక్టర్‌ను సంప్రదించాలని డాక్టర్ రఘు సూచించారు.

# బరువు దించే.. బేరియాట్రిక్ కాలం మారుతున్నది...

విధానాలు, ఆహారపు అలవాట్లు మారుతున్నాయి. దాదాపు అన్ని పనులూ టెక్నాలజీ సాయంతోనే జరిగిపోతున్నాయి. దీంతో శారీరక శ్రమ తగ్గిపోయింది. ఈ ధోరణి ఊబకాయానికి దారితీస్తున్నది. బరువు పెరిగేకొద్దీ జీవితం బరువుగా మారిపోతుంది. అయినా, నిర్లక్ష్యం చేస్తే తీవ్ర అనారోగ్య సమస్యలు రావచ్చు. ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదమూ ఉంది. బేరియాట్రిక్ సర్జరీలాంటి విధానాలతో ఊబకాయ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు.



**ఎవరికి చేయవచ్చు?**

బేరియాట్రిక్ సర్జరీ.. బరువును నియంత్రించే శస్త్రచికిత్స. ఇది 'బ్యరోస్' (బరువు) అనే పదం నుంచి వచ్చింది. అయితే, ఈ సర్జరీకి కొన్ని మార్గదర్శకాలు ఉన్నాయి. 40 బీఎంఐ (బాడీ మాస్ ఇండెక్స్)కంటే ఎక్కువ బరువు ఉన్నా.. లేదా 35 బీఎంఐ కంటే ఎక్కువ ఉండి.. మధుమేహం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, ఊపిరితిత్తులపై ఒత్తిడి (అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ఆప్నియా) తదితర సమస్యలతో బాధపడుతున్నా.. బేరియాట్రిక్ సర్జరీ చేయాలని ఓ నియమం. గత ఏడాది ఈ మార్గదర్శకాలకు కొన్ని మార్పులు చేశారు. ఆ ప్రకారం.. బీఎంఐ 35 కంటే ఎక్కువగా ఉన్నా.. బీఎంఐ 30 కంటే ఎక్కువ ఉండి వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నా.. బేరియాట్రిక్ సర్జరీ చేయవచ్చు. భారతీయుల విషయానికొస్తే.. బీఎంఐ 27 కంటే ఎక్కువ ఉంటూ.. ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉన్నప్పుడు నిరభ్యంతరంగా ఈ సర్జరీకి వెళ్లవచ్చు.

**బీఎంఐ ప్రకారం..** ఒక వ్యక్తి బరువు (కిలోలలో)ను ఎత్తు (మీటర్ స్కేర్‌లలో)తో భాగిస్తే వచ్చే ఫలాన్నే సదరు వ్యక్తి బీఎంఐగా పరిగణిస్తారు. సాధారణ వ్యక్తుల బీఎంఐ 18-27 మధ్య ఉండాలి. అదే,18 కంటే తక్కువ ఉంటే పోషకాల లోపంతో బాధపడుతున్నట్టు. బీఎంఐ 27.5 కంటే ఎక్కువైతే ఊబకాయంగా పరిగణించవచ్చు.బీఎంఐ 35 కంటే ఎక్కువైతే.. మార్బిడ్ ఒబేసిటీ. ప్రాణాంతక ఊబకాయంగా భావించాలి. బీఎంఐ 50 కంటే ఎక్కువైతే.. 'సూపర్ ఒబేసిటీ'గా పరిగణిస్తారు. ఇది చాలా ప్రమాదకర స్థాయి. శరీరం రోగాల పుట్టగా మారిపోవచ్చు.

**జాగ్రత్తలు :** బీఎంఐ 25 స్థాయిలో ఉన్నప్పుడే అప్రమత్తమైతే మంచిది. ఆరోగ్యకరమైన ఆహార విధానాన్ని కొనసాగించాలి. చెడు కొవ్వులకు, ప్రాసెస్ చేసిన ఆహారానికి దూరంగా ఉండాలి.రోజూ అరగంట అయినా వ్యాయామం చేయాలి. ఒత్తిడి పెంచుకోకూడదు. మూడుపదుల తర్వాత తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి. బరువు పెరగడం వల్ల.. షుగర్ స్థాయి పెరుగుతుంది. ఊపిరితిత్తులపై ఒత్తిడి పెరుగుతుంది. ఫలితంగా శ్వాస సమస్య ఏర్పడుతుంది. సీ-పాప్ యంత్రాలు వాడాల్సిన పరిస్థితి ఉత్పన్నం అవుతుంది.

**కీళ్లనొప్పులు వస్తాయి...**

మహిళల్లో సంతానలేమి (ఇన్‌ఫెర్టిలిటీ) సమస్య వస్తుంది. ఫ్యాటీలివర్ ఏర్పడి.. సిరోసిస్‌కు దారితీసే ప్రమాదం ఉంది.

**నిర్ధారణ పద్ధతులు :** ఒక వ్యక్తి అధిక బరువు లేదా ఊబకాయంతో బాధపడుతున్న విషయాన్ని శాస్త్రీయంగా గుర్తించేందుకు రెండు పద్ధతులు ఉన్నాయి. మొదటిది.. అందరికీ తెలిసిన బీఎంఐ. రెండోది.. వెయిస్ట్ హిప్ రేషియో (నడుము/తుంటి నిష్పత్తి). ఈ నిష్పత్తి మహిళల్లో 0.8 కంటే తక్కువ ఉండాలి. పురుషుల్లో 1 కంటే తక్కువ ఉండాలి. అనంతరం రక్తపరీక్షలు, ఊపిరితిత్తులు, గుండె పరీక్షల ద్వారా ఏ అవయవంపై ఎంత ఒత్తిడి పడుతుందో తెలుసుకోవచ్చు.

**చికిత్సా విధానాలు :** అధిక బరువుకు రెండురకాల ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఒకటి సర్జికల్ పద్ధతి. దీన్నే బేరియాట్రిక్ సర్జరీ అంటారు. రెండోది.. ఎండోస్కోపిక్ పద్ధతి. బేరియాట్రిక్ పద్ధతిలో న్యూరో హార్మోనల్ సైకిల్‌ను నియంత్రించడంతో పాటు శరీరంలోని ఇన్సులిన్ రెసిస్టెన్స్‌ను తగ్గించి, ఇన్సులిన్ ఊటను బాగా పెంచుతారు. ఫలితంగా జీవక్రియ వేగవంతమై, కొవ్వు కరిగిపోతుంది. బేరియాట్రిక్ సర్జరీకి పెద్దగా సమయం పట్టదు. మొత్తం శస్త్రచికిత్స గంటన్నర నుంచి రెండు గంటల్లో పూర్తవుతుంది. రోగిని నాలుగు రోజుల్లో డిశ్చార్జ్ చేయవచ్చు. శస్త్ర చికిత్స జరిగిన 10 రోజుల తరువాత రోగులు సాధారణ జీవనాన్ని గడపవచ్చు.

**ఎండోస్కోపిక్ పద్ధతి :** ఇది కూడా సురక్షితమైన విధానమే. కాకపోతే, 27-30 బీఎంఐ ఉన్నవారికే ఎండోస్కోపీ ద్వారా చికిత్స చేస్తారు. ఇందులో మళ్లీ రెండురకాలు. ఇంట్రాగ్యాస్ట్రిక్ బెలూన్ ఈ పద్ధతిలో రోగి పొట్టలోకి స్లైన్ నింపిన సిలికాన్ బెలూన్ పంపుతారు. దాదాపు ఆరు నెలల తర్వాత.. దాన్ని ఎండోస్కోపీ పద్ధతిలో తొలగిస్తారు. రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి ఆ తర్వాత మరో బెలూన్ పంపాలా లేదా అనేది నిర్ణయిస్తారు.

**బేరియాట్రిక్ సర్జరీతో ఉపయోగాలు**

70-80 శాతం అదనపు బరువు తగ్గిపోతుంది.
80-90 శాతం టైప్-2 డయాబెటిస్ నియంత్రణలోకి వస్తుంది.
70-80శాతం అధిక రక్తపోటు అదుపులోకి వచ్చేస్తుంది.
ఊపిరితిత్తులపై ఒత్తిడి తగ్గిపోతుంది. ఇక, సీ-పాప్ అవసరం ఉండదు.
మహిళల్లో సంతానలేమి సమస్య తీరిపోతుంది.అవయవ మార్పిడి అవసరమైన రోగులకు తగిన అవయవాలు లభిస్తాయి. ఎందుకంటే, అధిక బరువు సమస్య ఉన్న వారికి.. వారి పరిమాణానికి సరిపడా అవయవాలు లభించడం కష్టం.

**ఎండోస్లీవ్ :** ఎండోస్కోపిక్ స్లీవ్ గ్యాస్ట్రోప్లాస్టీ.. పద్ధతిలో రోగి పొట్ట సైజును తగ్గిస్తారు. దీంతో, ఇట్టే పొట్ట నిండిపోతుంది. తక్కువ ఆహారం తీసుకుంటారు. ఈ రెండు పద్ధతుల్లోనూ ఇన్‌పేషెంట్‌గా ఉండాల్సిన అవసరం రాదు. దాదాపుగా అదే రోజు డిశ్చార్జ్ చేస్తారు. తొలుత కొంత అసౌకర్యంగా అనిపించినా.. వెంటనే సర్దు కుంటుంది. ఈ విధానాల్లో తీవ్ర దుష్ఫలితాలు ఉండవు. అన్నిటికీ మించి ఊబకాయం వల్ల వచ్చే ప్రాణాపాయం తప్పుతుంది.

చలికాలం వచ్చిందంటే చాలు.. పెద్దలకే కాదు.. పిల్లలకూ శ్వాస కోశ సమస్యలు ఎదురవుతుంటాయి. దగ్గు, జలుబు, జ్వరం తదితర అనారోగ్య సమస్యలు పెద్దల కన్నా పిల్లల్నే ఎక్కువగా ఇబ్బందులకు గురిచేస్తాయి. ఈ క్రమంలో పిల్లల ఆరోగ్యాన్ని కాపాడడం చాలా అవసరం. కింద సూచించిన పలు సలహాలను పాటిస్తే చలికాలంలో పిల్లల్ని ఇన్‌ఫెక్షన్లు, శ్వాసకోశ సమస్యల బారి నుంచి కాపాడవచ్చు. మరి ఆ సలహాలు, సూచనలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందామా..! చలికాలంలో పిల్లలు పొద్దున్నే నిద్ర లేవడానికి బద్ధకిస్తుంటారు. ఈ సమస్య లేకుండా చేయాలంటే.. పిల్లల్ని రాత్రిపూట త్వరగా పడుకోబెట్టాలి. అలాగే తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారాలను రాత్రి పూట ఇవ్వాలి. దీంతోపాటు పాలను కూడా తాగించాలి. దీంతో చక్కగా నిద్ర పడుతుంది. ఉదయాన్నే ఉత్సాహంగా నిద్ర లేస్తారు. చలికాలంలో రాత్రి లేదా పగలు ఎప్పుడైనా సరే పిల్లలు బయటకు వెళ్తుంటే ఉన్ని దుస్తులు వేయాలి. ఈ కాలంలో ఐస్‌క్రీములు, కూల్ డ్రింక్‌లు వంటివి కొనివ్వడం మానేయాలి. పిల్లల తలను కప్పి ఉంచేలా స్వెటర్, మంకీ క్యాప్‌లను ధరింపజేయాలి. చలికి పాదాలు పగలకుండా ఉండేందుకు సాక్సులు, షూ ధరింపజేయాలి. చేతులకు గ్లోవ్స్ వేయాలి.





# తమలపాకుతో చాలా లాభాలు

**తమలపాకు ఆరోగ్యానికి మంచిది. ఇందులో కాల్షియం, ఫోలిక్ యాసిడ్, విటమిన్ ఎ, సి పుష్కలంగా ఉంటాయి. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలోనూ సాయపడుతుంది. తమలపాకు తింటే మరెన్నో ఉపయోగాలు..**



ప్రతి రోజు 7 తమలపాకులను ఉప్పుతో కలిపి ముద్దగా నూరి వేడినీళ్లతో తీసుకుంటే బోద వ్యాధితో బాధపడుతున్న వారికి చక్కని ఫలితం కనిపిస్తుంది. తమలపాకు రసాన్ని రెండు కళ్లలోనూ చుక్కలుగా వేస్తే రేచీకటి సమస్య క్రమంగా తగ్గుతుంది. తమలపాకు రసాన్ని టీ స్పూన్ మోతాదులో తీసుకుంటే గుండె పనితీరు మెరుగుపడుతుంది. ఎక్కువగా కూర్చొని పనిచేసేవారికి సాధారణంగా ఎదురయ్యే సమస్య వెన్నునొప్పి. వేడిగా ఉండే తమలపాకు రసాన్ని కొబ్బరినూనెతో కలిపి బాగా మిక్స్ చేసి, వెన్నుకు మర్దన చేయడం వల్ల తక్షణ ఉపశమనం కలుగుతుంది. శ్వాస సంబంధిత సమస్యతో బాధపడేవారు ఆవనూనెను గోరువెచ్చగా చేయాలి. దీనిలో తమలపాకును నానబెట్టి ఈ మిశ్రమాన్ని ఛాతి మీద రాస్తే ఉపశమనం దొరుకుతుంది.రోజూ ఒక తమలపాకును తింటే మలబద్దకం సమస్య తగ్గిపోతుంది. దెబ్బలు తగిలినప్పుడు వాపు, రక్తం గడ్డ కట్టడం లాంటివి జరిగినప్పుడు తమలపాకును వేడి చేసి వాపు లేదా రక్తం గడ్డ కట్టిన ప్రాంతంలో కట్టులాగా కడితే వెంటనే ఉపశమనం కలుగుతుంది.భోజనం తర్వాత తమలపాకు తింటే నోరు శుభ్రమవుతుంది. ఇది జీర్ణక్రియకు బాగా తోడ్పడుతుంది. కానీ ఈ ఆకును అధికంగా తీసుకుంటే అనర్థాలు ఎదురవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పాన్, ఇతర ఏ రూపంలో అయినా రోజుకు ఒక ఆకును మించి తీసుకోవద్దని చెబుతున్నారు.చుండ్రు సమస్యతో బాధపడుతున్నవారు తమలపాకులను ముద్దగా చేసి తలకు పట్టించాలి. గంటసేపు ఆగి తలస్నానం చేస్తే చుండ్రు సమస్య తగ్గుతుంది. ఇలా చుండ్రు సమస్య తగ్గేవరకు వారానికి రెండుసార్లు చొప్పున చేయవచ్చు.

# అన్ని ఫ్లూ జ్వరాలకీ ఒకే వ్యాక్సిన్!



జలుబు, దగ్గులతో అతలాకుతలం చేసేది ఫ్లూ. ఇప్పటికే కొన్ని రకాల ఫ్లూ వైరస్‌లకి వ్యాక్సిన్లు ఉన్నాయి. కాని కొన్ని రకాల వైరస్‌ల వల్ల కలిగే ఫ్లూని ఏమీ చేయలేకపోతున్నాం. అయితే ఇప్పుడు అన్ని రకాల ఫ్లూ వైరస్‌లనూ నియంత్రించడానికి ఒకే వ్యాక్సిన్‌ను రూపొందించడానికి కసరత్తు జరుగుతోంది. జలుబుకు మందులు వాడితే వారంరోజుల్లో వాడకపోతే ఏడు రోజుల్లో తగ్గుతుందని ఓ మాట ఉండనే ఉంది.


అంటే జలుబును నియంత్రించే సరైన చికిత్స లేదని అర్థం. జలుబు కొన్ని వేల రకాల వైరస్‌లలో ఏదో ఒకదానివల్ల కలుగుతుంది. ఇవన్నీ ఫ్లూ వైరస్‌లే. అందుకే ఇన్ని రకాల వైరస్‌లకు వ్యాక్సిన్లు తయారుచేయడం కష్టమైంది. కాని ఇప్పుడు అన్నిటికీ కలిపి ఒకే వ్యాక్సిన్‌ను తీసుకొచ్చే పనిలో ఉన్నారు పరిశోధకులు. ఫ్లూ వైరస్‌ల ఉపరితలం మీద హీమాగ్లుటినిన్ అనే ప్రొటీన్ ఉంటుంది. హోస్ట్ కణాలపై దాడి చేయడానికి ఇదే మార్గదర్శనం చేస్తుంది.

ఈ ప్రొటీన్ వల్లనే వైరస్ మనల్ని ఇన్‌ఫెక్ట్ చేస్తుంది. ఈ హీమాగ్లుటినిన్‌లో తల (హెడ్), తోక (స్టాక్) అనే రెండు భాగాలుంటాయి. వీటిలో తల భాగం అన్ని వైరస్‌లలో ఒకేలా ఉండదు. కాని స్టాక్ మాత్రం దాదాపుగా ఒకేలా ఉంటుంది. అందువల్ల హీమాగ్లుటినిన్ స్టాక్‌ను టార్గెట్ చేస్తూ వ్యాక్సిన్‌ను తయారుచేయవచ్చని భావిస్తున్నారు సైంటిస్టులు. ఇందుకోసం కైమెరిక్ హీమాగ్లుటినిన్ అనే ప్రొటీన్ రకంపై పరిశోధనలు కొనసాగిస్తున్నారు. ఈ పరిశోధనలు విజయవంతం అయితే యూనివర్సల్ ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సిన్ రాక ఎంతో దూరంలో ఉండదంటున్నారు ప్రొఫెసర్ ఫ్లోరియన్ క్రామర్.




బంగ్లాదేశ్ నుంచి మొక్కల దిగుమతి
మూడెకరాల్లో ఏడాదికి
28 టన్నుల పైనే దిగుబడి
గంగరేగు పండును
పోలిన మధురమైన పంట సాగు
సేంద్రియ పద్ధతిలోనే సాగు..
కిలోకు రూ.30 నుంచి
రూ.100 వరకు
అమ్మకం

# 'బేర్' పంట.. సిరులు ఇంట..



'కాశ్మీర్ యాపిల్ బేర్' పండు చూడటానికి గంగరేగు పండును పోలి ఉంటుంది. కానీ అది గంగరేగు కాదు. యాపిల్‌ను పోలి ఉంటుంది. అయినా అది యాపిల్ కాదు. పై రెండింటినీ పోలినట్టుండే 'కాశ్మీర్ యాపిల్ బేర్' అది. తినగానే చాలా మధురంగా ఉంటుంది. ఈ 'బేర్' పంటను సాగు చేసే రైతులు జిల్లాకు ఒకరు లేక అసలు ఉండకపోవచ్చు. ఎందుకంటే, ఈ పంట సాగుపై రైతుల్లో అవగాహన తక్కువ. సాగు చేస్తే దిగుబడి వస్తుందో? రాదో? ఒక వేళ వచ్చినా తగిన డిమాండ్ ఉంటుందో..? లేదో? అన్న సందేహాలే అధికంగా ఉంటాయి. సంప్రదాయ సాగుకు భిన్నంగా వ్యవహరించే వాళ్లు మాత్రమే ఇలాంటి పంటలపై ఆసక్తి చూపుతూ కష్టాన్ని ఇష్టంగా చేసుకొని, నాలుగు రూపాయలు వెచ్చించి అయినా సఫలమవుతుంటారు. ఈ పండ్లకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటుంది. రేగు పండు తిన్న మరు క్షణం నుంచే నోటికి ఏదో జిగురు పదార్థం అంటుకున్న భావన చాలా సేపటి దాకా కలుగుతుంది. ఈ పండ్ల సాగును రంగారెడ్డి జిల్లా, తుక్కుగూడ (హైదరాబాద్ నగర శివారు) పరిధిలోని ఇమాంగూడ గ్రామానికి చెందిన బక్కారం బుచ్చిరెడ్డి అనే రైతు మొట్టమొదటి సారిగా సాగు చేశారు. ఇప్పటికే రెండు విడుతలుగా కాతను కోశారు.




**సంప్రదాయ పంటలకు భిన్నంగా..**

బక్కారం బుచ్చిరెడ్డి హైదరాబాద్ నగర శివారులోని (తుక్కుగూడ) ఇమాంగూడ వాసి. పదో తరగతి వరకే చదువుకున్న రైతు. బుచ్చిరెడ్డి తనకున్న భూమిలో సంప్రదాయ పంటలను కాకుండా ఆరుతడి పంటలను వేసి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని తపించేవారు. ఈ నేపథ్యంలో ఒకరోజు యూ ట్యూబ్‌లో 'కాశ్మీర్ యాపిల్ బేర్' పంట సాగు గురించి భద్రాచలవాసి రాజు సాగు చేసిన విధానాన్ని చూశారు. చూసిందే తడవుగా రాజు గురించి తెలుసుకొని, తన వ్యవ సాయ క్షేత్రానికి వెళ్లి ఆ పంట సాగు వివరాలను తెలుసుకొని బుచ్చిరెడ్డి సైతం సాగు చేసేందుకు సన్నద్ధమయ్యారు. రాజు సహాయంతో ఒక్కో మొక్కకు రూ.150 చొప్పున 1500 మొక్కలను బంగ్లాదేశ్ నుంచి తెప్పించారు. తనకు ఉన్న మూడెకరాల్లో ఒక ప్రణాళిక ప్రకారం, 'బేర్' పంటను సాగు చేయడం మొదలు పెట్టారు. ఇందుకు దాదాపు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు అయినట్టు చెబుతున్నారు.

**పకడ్బందీగా ఫెన్సింగ్**

మూడెకరాల పంట సాగుకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా, కోతులు, గబ్బిలాలు, పిట్టలు రాకుండా కట్టుదిట్టంగా జాలీతో కూడిన ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి మొక్కకూ పటిష్టమైన ఒక వెదురు బొంగు, డ్రిప్ ఇరిగేషన్ ఉండేలా ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో మూడెకరాలకు సరిపోయేలా 1350 మొక్కలను నాటారు. వీటి సాగుకు గింజలున్నప్పటికీ, గింజలతో కూడిన సేద్యం సరిగా రాదని, 'వై' ఆకృతిలో ఉన్న మొక్క అంటులనే సాగుకు వినియోగిస్తు న్నారు. సాధారణంగా గింజలతో కూడిన సాగు కూడా ఉంటు ంది. కాని, వ్యవసాయం ఆధునిక పోకడలో భాగంగా క్లోనింగ్ ద్వారానే పంటల అధిక దిగుబడి, ఉత్పత్తి తీసుకురావొచ్చని వ్యవసాయదారులు, శాస్త్రవేత్తల ప్రగాఢ విశ్వాసం.



**సేంద్రియ పద్ధతిలోనే పంట సాగు**

బుచ్చిరెడ్డి 1350 మొక్కలను మూడెకరాల్లో నాటారు. అయితే, గత ఫిబ్రవరి మాసాంతంలో పంట సాగును ఆరంభించారు. తొలుత ఎదుగుతున్న మొక్కలకు చీడ, పురుగు ఆవరించడంతో తెలిసిన మందులెల్లా వాడి డబ్బులు పోగొట్టుకున్నారు. కానీ, మొక్కను ఆవరించిన పురుగు మాత్రం పోలేదు. అయితే, ఇప్పటికే సాగు చేస్తున్న వారి సలహాలు, జిల్లా ఉద్యాన వన శాఖ అధికారుల సలహాలను తీసుకొని సేంద్రియ పద్ధతిలో పురుగు, చీడలకు చెక్ పెట్టారు. గో మూత్రం, పచ్చిమిర్చి, ఎల్లిగడ్డతో పాటు పొగాకు మిశ్రమాన్ని కలిపి, మరిగించి, ప్రతి 200 లీటర్ల నీటికి 12 లీటర్ల ఈ ద్రావణాన్ని పిచికారీ చేశారు. దీంతో మొక్కలను ఆవరించి ఉన్న పురుగు, చీడల పీడ విరగడయ్యింది. మొక్క ఎదుగుదల పదిహేను ఫీట్లను మించిపోయే అవకాశం ఉంది. అయితే, ఐదు నుంచి ఆరు ఫీట్ల వరకు రాగానే మొక్క ఎదిగే జుట్టును కత్తిరించాలని చెబుతున్నారు. అలా చేస్తేనే మొక్క మనకు అందుబాటులోకి వస్తున్నదని, పంటను కోయడానికి వీలవుతున్నదని అంటున్నారు.

**ప్రతి మొక్క నుంచి 20 కేజీలపైనే దిగుబడి**

మొక్క నాటిన నాలుగు నెలల నుంచే కాతకు వస్తుంది. అయితే, నాటిన ప్రతి మొక్క 20 కేజీల పైనే దిగుబడి ఇస్తుంది. ఇప్పటికే బుచ్చిరెడ్డి రెండు విడుతలుగా కాతను కోసినట్టు తెలిపారు. ఒక ఎకరాకు తొమ్మిది నుంచి పది టన్నుల మేర దిగుబడి వస్తుంది చెబుతున్నారు. అయితే, ఈ 'బేర్' ధర మార్కెట్‌లో రూ.32 నుంచి రూ.100 వరకు అమ్ముడవుతున్నదని చెబుతున్నారు. పంటను ప్రస్తుతం పహాడిషరీఫ్ మార్కెట్‌కు తరలిస్తున్నట్టు తెలిపారు. కాగా, మార్కెట్‌లో రూ.30 వరకు అమ్మకం జరుగుతుందని పేర్కొంటున్నారు. నిత్యం సాగు చేసే వరి, వేరు శనగ లాంటి పంటల వల్ల శ్రమ అధికం, దిగుబడి రాకపోగా, వచ్చిన దిగుబడికి ధరలు ఉండవని చెబుతున్నారు.



**మొదట ఇబ్బందులు వస్తాయి..**

ఈ పంట సాగు కోసం జిల్లా స్థాయి ఉద్యాన అధికారులు, ఇతర జిల్లాల రైతులను కూడా కలిశా. ఇందుకు పలువురి సలహాలు, సూచనలు తీసుకున్నా. భద్రాచలంలో రాజు అనే రైతు సహాయంతో ప్రస్తుతం ఈ పంటను సాగు చేయగలుగుతున్నా. ఆ మిత్రుడి ద్వారానే బంగ్లాదేశ్ నుంచి 1500 మొక్కలను తెప్పించా. 1350 మొక్కలను మూడెకరాల్లో నాటాను. మిగతా 150 మొక్కలను స్థానికంగా నా మిత్రులకు పంచాను. పంట సాగు మొదట్లో కాస్త ఇబ్బందులు ఎదురైనా.. వాటన్నింటినీ అధిగమించా. ఇప్పటికే రెండు దఫాలుగా పంటను మార్కెట్‌కు తరలించా. ఈ పంట సాగుకు రూ.5 లక్షల వరకు ఖర్చు అయ్యింది.

# మినుము పంటను ఆశించే ప్రధాన తెగుళ్లు..



మన తెలుగు రాష్ట్రాల్లో వరికోతలు అనంతరం మినుమును రబీ, వేసవి పంటలుగా పండిస్తారు. ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా 15 లక్షల టన్నుల మినుము పంట ఉత్పత్తి అవుతుంది. ఈ పంటను సాగు చేయడానికి ఖరీఫ్ సీజన్లో జూన్ 15 నుండి జులై 15 వరకు అనుకూలంగా ఉంటుంది. రబీ సీసన్లో ఐతే అక్టోబర్ నెల అనుకూలంగా ఉంటుంది. మినుము పంటను ఆశించే పలు రకాల తెగుళ్ల వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మినుము పంటల్లో పల్లాకు తెగులు,సీతాఫలం తెగులు, ఆకు ముడత తెగులు, శిలింధ్ర తెగుళ్లు, కోరినోస్పోరా ఆకు మచ్చ తెగుళ్లు అధికంగా వ్యాపిస్తున్నాయి.

**పల్లాకు తెగులు:** ఈ తెగులుకు జెమిని వైరస్ కారణం. మినుము పంటకు ఈ జెమిని వైరస్ అనేది తెల్లదోమ ద్వారా వ్యాపిస్తుంది. పంటకు ఈ తెగులు వ్యాపిస్తే మొక్కల ఆకులపైనా పసుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. తెగులు ఎక్కువగా వ్యాపిస్తే ఆకులు పూర్తిగా పసుపు రంగులోకి మారి, పైరు మొత్తం పసుపు రంగులో కనబడుతుంది. ఒకవేళ పైరును 40–50 రోజుల తర్వాత ఆశించినట్లైతే కాయాలి వంకరలు తిరిగి, గింజ యొక్క నాణ్యత తగ్గిపోతాది. మరియు మార్కెట్ లో ధర కూడా తగ్గుతుంది.

**నివారణ:** పల్లాకు తెగులును తట్టుకునే రకాలైన ఎల్.బి.జి. 752, టి.బి.జి 104, ఎల్.బి.జి. 787, పి.యు. 31 సాగు చేసుకోవాలి. పొలం చుట్టూ రక్షక పంటగా జొన్న కాని, మొక్కజొన్న కాని నాలుగు వరుసలలో విత్తుకోవాలి. ఈవిధంగా చేయడం వలన వైరస్ తెగుళ్ళను వ్యాప్తి చేసే పేనుబంక మరియు తామర పురుగులను ఒక పొలం నుండి వేరొక పొలంకి వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చు.

**విత్తన శుద్ధి:** పైరు తోలి దశలో ఆశించే పురుగులను నివారించడానికి 5గ్రా. థయోమిథాక్సమ్ 70 డబ్ల్యు.ఎస్. లేదా 5 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్. మందుతో విత్తనశుద్ధి చేసుకుని విత్తుకోవాలి. పొలంలో తెగులు మొక్కలను ఆశించే కలుపు మొక్కలను తీసివేయాలి. పొలంలో అక్కడక్కడ 20 గ్రీజు పూసిన పసుపు రంగు అట్టలను పొలంలో అమర్చుకోవాలి.

**వరి పంటను ఆశించే ప్రధాన తెగుళ్ల .. వాటి నివారణ**

**సీతాఫలం తెగులు:** దీనిని బొబ్బరాకు తెగులు అని కూడా పిలుస్తారు. ఈ తెగులు అనేది లీఫ్ క్రింకిల్ వైరస్ ద్వారా వ్యాపిస్తుంది. పేనుబంక పురుగుల వలన ఒక మొక్క నుండి మరొక మొక్కకు వ్యాప్తి చెందుతుంది. ఈ తెగులు సోకక ఆకులు అనేవి ముదురు ఆకుపచ్చ రంగులోకి మారతాయి. ఈ తెగులు సోకితే సాధారణంగా పూత పూయవు, లేదా పూసిన 15 రోజులు ఆలస్యంగా పూస్తాయి.

**నివారణ:** తెగులు సోకినా మొక్కలను పీకివేయాలి. ఈ తెగులు అనేది విధానం ద్వారా కూడా వ్యాపిస్తుంది కాబట్టి తెగులు సోకినా మొక్కల నుండి విధానాలను సేకరించకూడదు. పేనుబంక నివారణ కొరకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా అసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా థయోమిథాక్సమ్ 0.2 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**ఆకు ముడత తెగులు:** ఈ తెగులును తలమాడు తెగులు అనికూడా పిలుస్తారు. ఈ వైరస్ తెగులు తామర పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. తెగులు ఆశించిన మొక్కల ఆకుల అంచులు వెనకకు ముడుచుకొని మెలికలు తిరిగి గిడసబారి రాలిపోతాయి. ఆకుల అడుగు భాగం లోని ఈనెలు ఎర్రగా రక్త వర్ణాన్ని పోలి ఉంటాయి.

**నివారణ:** దీని నివారణకు తెగులు సోకిన మొక్కలను పీకి తగలబెట్టడం ద్వారా పైరు లోని ఇతర మొక్కలకు వ్యాపించకుండా అరికట్టవచ్చు.తెగులు వ్యాప్తికి కారకమైన తామర పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 1.5 మి.లీ లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**వరి పంటను ఆశించే ప్రధాన తెగుళ్ల .. వాటి నివారణ**

**బూడిద తెగులు :**

ఈ తెగులు ఆశించిన మొక్కల ఆకుల మీద తెల్లని మచ్చలు ఏర్పడతాయి. ఆకులమీద బూడిద లాంటి పొర ఏర్పడటం వలన కిరణజన్య సంయోగ క్రియ తగ్గి దిగుబడులు తగ్గడమే గాక గింజ నాణ్యత కూడా తగ్గుతుంది. తెగులు ఉధృతి ఎక్కువైనప్పుడు తెల్లని బూడిద లాంటి పొర కాండము, పిందెలు మరియు కాయల మీద కూడా వ్యాప్తి చెందుతుంది. రాత్రి పూట చలి గాను, పగటి పూట వేడి గాను ఉన్నటువంటి వాతావరణ పరిస్థితులు బూడిద తెగులు ఆశించడానికి మరియు ఉధృతి పెరగటానికి అనుకూలమైనవి.

**నివారణ :** తెగులు నివారణ కొరకు మైక్లోబ్యుటానిల్ 1.0 గ్రా. లేదా హెక్సాకోనజోల్ 2.0 మి.లీ లేదా ప్రోపికోనాజోల్ 1.0 మి.లీ లీటరు నీటికి కలిపి 10

# స్ట్రాబెర్రీ పంట... లక్షల్లో ఆదాయం



స్ట్రాబెర్రీ అంటే ఇష్టం ఉండనివారు ఉండరు. ఎర్రని రంగులో ఉన్నఈ పండును చూడగానే నోరూరుతుంది. ఒక్కసారి తింటే ఆ పండు మాధుర్యం మనల్ని మరిచిపోనివ్వదు.గతంలో విదేశాలకు మాత్రమే పరిమితమైన స్ట్రాబెర్రీ పంట ఇప్పుడు మన దేశంలో కూడా విస్తరణ జరుగుతుంది.

స్ట్రాబెర్రీ పంటను కోరాపుట్ జిల్లాలోని కోటియా ప్రాంతంలో అధికంగా సాగు చేస్తున్నారు. ఇక్కడ రైతులు అధికారుల సహాయంతో ఎక్కువ దిగుబడిని సాధిస్తున్నారు మరియు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఈ స్ట్రాబెర్రీల రుచి కూడా చాలా బాగుంటుంది.స్ట్రాబెర్రీ సాగు కోరాపుట్ జిల్లాలోని కోటియా ప్రాంతంలో అధికంగా ఉంది. ఈ ప్రాంతంలో పండిస్తున్న స్ట్రాబెర్రీ రుచి అద్భుతంగా ఉంది అని సీఎం నవీన్ పట్నాయక్ కొనియాడారు. సాధారణంగా కొండ ఛాయా ప్రాంతాలైన దక్షిణ, నైరుతి ఒడిశా జిల్లాలో ఈ స్ట్రాబెర్రీ పంటను పండించడానికి అనుకూలంగా ఉంటుంది. సముద్ర మట్టానికి సుమారు 3,000 అడుగుల ఎత్తులో ఉన్న కొరాపుట్, నువాపడా జిల్లాల్లో స్ట్రాబెర్రీ పండించవచ్చు. దీంతో వాణిజ్యపరంగా ఇక్కడ పంటను అభివృద్ధి చేసేందుకు అధికారులు చురుకుగా సన్నాహాలు చేస్తున్నారు.

కోరాపుట్ జిల్లాలోని వ్యవసాయ సఖ అధికారులు అక్కడి రైతులకు స్ట్రాబెర్రీ పంటను ఎలా పండించాలో శిక్షణ ఇచ్చి ప్రోత్సహించారు. మొదట ఈ స్ట్రాబెర్రీ పంటను 5 ఎకరాల్లో సాగు ప్రారంభించారు. 55,000 స్ట్రాబెర్రీ మొక్కలను పూణే నుంచి తెప్పించారు. ఇక్కడి ప్రభుత్వం ఇంచుమించుగా 45 రైతు కుటుంబాలకు స్ట్రాబెర్రీ సాగు శిక్షణా అందించారు. సాగు ఫలితాలు 50 రోజుల్లోనే కనిపించడంతో సాగుపై ఆసక్తి చూపారు. కోటియాలో స్ట్రాబెర్రీ సాగు ఊహకు అందని విధంగా ఫలితాలు ఇచ్చింది. ప్రస్తుతం 20 ఎకరాల్లో విస్తీర్ణంలో స్ట్రాబెర్రీ సాగుకు శ్రీకారం చుట్టారు.

**వరి సాగుకు ప్రత్యామ్నాయ పంటలుగా బ్రహ్మి, వస పంటలు..**

రైతు సాధికారత శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ అరబింద కుమార్ పాఢీ ఇటీవల కొటియా పర్యటన పురస్కరించుకొని స్టాబెర్రీ సాగు రైతులతో సమావేశమయ్యారు. స్ట్రాబెర్రీ సాగుకు పూర్తిస్థాయిలో సహాయం అందజేయనున్నట్లు తెలియజేశారు. సాగు విస్తరణకు అంకితభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రైతులు నారు గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. స్ట్రాబెర్రీ సాగు ఒకసారి విజయవంతమైతే ఇతర పండ్ల సాగు కంటే చాలా లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు.

ఇక్కడ స్ట్రాబెర్రీ పంట లాభసాటిగా సాగుతుంది. ఒక చిన్న స్ట్రాబెర్రీ ప్యాకెట్ అమ్మితే రూ.100 వరకు లాభం వస్తుంది

# భారత దేశానికి పాకిన విదేశీ మొక్క చెకుర్మనీస్.!

విదేశీ పంటలను కూడా భారతదేశంలో రైతులు విస్తారంగా సాగుచేస్తున్నారు. లాభాలు వచ్చే ఏపంటైనా సరే రైతులు తమకున్న కమతంలోనే సాగు చేస్తు దిగుబడులను పొందుతు మార్కెట్ లో లాభాలను చవిచూస్తున్నారు. ఇండోనేషియా, సింగపూర్ దేశాలకే పరిమితమైన చెకుర్మనీస్, ప్రస్తుతం భారత్‌లో కూడా సాగు చేస్తున్నారు.

దీన్ని శాశ్వత ఆకు కూరగా పిలుస్తారు. ఇది అన్ని రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకుని అధిక దిగుబడినిస్తుంది. దీనిలో అనేక పోషకాలు ఉండటంతో ఔషధాల తయారీతో కూడా దీనిని వాడుతున్నారు. ఈపంటను కేరళలలో పెంచుతున్నారు. దీనిని పెరటి మొక్కగా కూడా పెంచుతారు. కంటి సమస్యల నివారణకు, జ్వరం తగ్గడానికి దీనిని ఎక్కువగా వాడుతారు.

**ఒక్కో మొక్క రూ.25**

చెకుర్మనీస్ మొక్క విదేశాలలో బాగా విస్తరించింది. అంతేకాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని దేశ విదేశాలకు ఈమొక్క బాగా పాకింది. దీనిలో విటమిన్ %ఖ% ఎక్కువగా ఉంటటం వల్లన ఇది కంటి సమస్యలను నివారిస్తోంది. దీని ఆకులతో పశువుల మేతగాను, కోళ్లకు మేతగాను దీనిని వాడుతున్నారు. అంతేకాకుండా సలాడ్, సూప్ గా వాడుతున్నారు. చెకుర్మనీష్ మొక్క అన్ని రకాల నేలల్లో పెరుగుతుంది. ఇది కొంతవరకు నీడను తట్టుకోగలదు. కాండం కటింగ్ ద్వారా మరియు తాజా విత్తనాల ద్వారా కూడా వేస్తారు.



**వ్యవసాయంలో రక్షక పంటల ప్రాముఖ్యత.!**

ఈమొక్కలు వెంకటరామన్నగూడెం, హార్టీకల్చర్ రీసెర్చ్ స్టేషన్, డా. వై.యస్.ఆర్. హార్టీకల్చర్ యూనివర్సిటీలో అందుబాటులో ఉన్నాయి. ఒక్కో మొక్కను రూ. 25/-కు విక్రయిస్తున్నారు. వరుస నుండి వరస దూరం 30 సెం.మీ. మరియు మొక్క నుండి మొక్క మధ్య దూరం 10-15 సెం.మీ ఉండాలి. ఒక మొక్కకు వార్షిక దిగుబడి 3 కిలోల ఆకులు మరియు హెక్టారుకు 30 టన్నుల ఆకులను సంవత్సరంలో పండించవచ్చు.

# వానాకాలంలో పశువుల్లో తర్వగా వచ్చే వ్యాధులు.!



పశువులకు సోకే వ్యాధుల్లో గొంతు వాపు ప్రమాదకరమైనది. ఈవ్యాధిని గురక వ్యాధి అని కూడా పిలుస్తారు. వర్షాకాలంలో పశువులకు సూక్ష్మజీవుల వలన సంక్రమిస్తుంది. ఇది పశువుల్లో తొలకరి వర్షాలు పడినప్పుడు కలుషితమైన నీరు మేత ద్వారా రోగనిరోధక శక్తి తగ్గి వ్యాధులు వ్యాధి బారిన పడతాయి. వర్షాకాలంలో వ్యాధి ఎక్కువగా దున్నలు గేదెలలో వస్తోంది. నీరసంగా ఉన్న పశువులకు వ్యాధి త్వరగా సోకుతోంది. పల్లపు ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచే ప్రాంతాలలో ఈవ్యాధి ఎక్కువగా వస్తుంది. ఇది అంటువ్యాధి ఇతర పశువులకు సోకుతుంది. ఈవ్యాధి పాడిపశులకు సోకితే రైతు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ఈవ్యాధి పాశ్చరెల్లా ముల్లోసిడా అనే సూక్షజీవి వల్లన వస్తుంది. ఈ సూక్ష్మజీవి ప్రధానంగా ఉష్ణ దేశాల్లో వ్యాపించి ఉంటుంది.

**పశువు నోటి నుంచి కారే చొంగ ద్వారా వ్యాధి**

రాష్ట్రంలో ఈసూక్ష్మజీ వ్యాప్తి చెందినందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున తగు జాగ్రత్తగా వ్యవహరించాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే ప్రాంతాలలో పాడి గేదెలు ఆవులు వ్యాధి బారిపడినట్లు చెప్తున్నారు. ఎనిమిది నెలల నుంచి రెండేళ్లలోపు ఉన్న పశువులకు వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గొంతు వాపు వ్యాధి బారిన పశువులను మిగతా పశువులతో కలిపి ఉంచితే వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ఒకే పాకలో ఉంచకుండా వాటిని వేరు చేయాలి. వ్యాధి సోకిన పశువు తిన్న గడ్డిని ఆర్యోగ్యకరమైన పశువు తిన్నడం వల్లన ఈవ్యాధి సోకే ఆవకాశం ఉంటుంది. వ్యాధి సోకిన పశువు నోటి నుంచి కారే చొంగ ద్వారా కూడా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఒక ప్రాంతం నుంచి వేరొక ప్రాంతానికి పశువులను రవాణా చేసినప్పుడు వ్యాధి సోకుతుంది.

**భారత దేశానికి పాకిన విదేశీ మొక్క చెకుర్మనీస్.!**

**ప్రతి ఏటా టీకాలు వేయించాలి..**

వ్యాధికారక సూక్ష్మజీవులు పశువుల శరీరంలోనికి ప్రవేశించిన రెండు నుంచి ఐదు రోజుల్లోపు వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. జర్వం తీవ్రత 14 డిగ్రీల వరకు ఉంటుంది. చర్మం వదులుగా ఉన్న చోట ద్రవం చేరి గొంతు బాగా ఉబ్బి ఉంటుంది. చేతితో గట్టిగా ఒత్తితే గుంట మాదిరిగా ఏర్పడుతోంది. కళ్ళ నుంచి నీరు ముక్కు నుంచి ద్రవం కారుతోంది. పశువులకు శ్వాస తీసుకోవడం కష్టం అవుతుంది. ముక్కు నుంచి రసపూరితమైన ద్రవాలు కారుతూ ఉంటాయి. ఊపిరితిత్తులు శ్వాస వాహికలో పుండ్లు ఏర్పడి చీము చేరుతోంది. విపరీతంగా దగ్గు వస్తోంది. పశువు ఆయాస పడుతూ శ్వాస పిలుస్తోంది. శ్వాస మరీ కష్టమై నాలుక బయటకు తీస్తోంది. ఒక్కోసారి వ్యాధి సోకిన పశువు లక్షణాలు 24 గంటల్లోపు మృత్యువాత పడే అవకాశం ఉంటుంది. ప్రయోగశాలలో రక్త పరీక్ష చేయించి బైపోలర్ గ్రామ్ నెగిటివ్ బ్యాక్టీరియాని గుర్తించడం వలన వ్యాధిని నిర్ధారిస్తారు. పశువు చనిపోయిన తర్వాత శవపరీక్ష చేసి కూడా వ్యాధిని నిర్ధారించవచ్చు. వర్షాకాలం ముందు జూన్, జూలైలో పశుసంవర్ధక శాఖ ప్రభుత్వం వారు ఉచితంగా అందించే వ్యాధినిరోధక టీకాలు వేయించాలి. ఆతర్వాత ప్రతి ఏటా వ్యాధి నివారణ కోసం టీకాలు వేస్తూ ఉండాలి.

## వేరుశనగ కాయలను నిల్వఉంచేటప్పుడు

# రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు.!



భారతదేశంలో పండించే ముఖ్యమైన నూనగింజల్లో వేరుశనగ ప్రధానమైనది. ప్రస్తుతం అనేక ప్రాంతాలలో వేరుశనగ కోతలు ప్రారంభమైనాయి. కొన్నిచోట్ల వేరుశనగ కోతలు పూర్తయ్యాయి. కోతలు పూర్తయిన తర్వాత సరైన జాగ్రత్తలు పాటిస్తేనే ఈవిత్తనాన్ని రాబోయే ఖరీఫ్ లో విత్తనం కోసం వాడుకోవచ్చు. లేదంటే విత్తనం పుచ్చు పట్టి పనికి రాకుండా పోతుంది.

ఈబాధల నుండి విముక్తి పొందాలంటే రైతులు వేరుశనగ కోతలు మొదలుకొని నిల్వ చేసేంతవరకు తగు జాగ్రత్తలు పాటించాలి. వేరుశెనగను 70- 80% మొక్కల ఆకులు, కొమ్మలు, పసుపు వర్ణంగా మారి, కాయ డొల్ల లోపలి భాగం నిలువుగా మారినప్పుడు కోయాలి. కోత సమయంలో నేలలో తగినంత తేమ ఉండాలి.

**కోత తర్వాత జాగ్రత్తలు**

కోసిన పంటను తగిన తేమ వచ్చేవరకు మొక్కనుండి కాయలు వేరు చేయుటకు ముందు ఎండబెట్టాలి. ఇది రెండు విధాలుగా చేయవచ్చు, కాయలు పైభాగానికి వచ్చినట్లు వేరుశనగ మొక్కలను చిన్న చిన్న కుప్పలుగా వేయాలి.

లేదా మొక్కలను కర్రలకు కట్టి కాయలు పక్కకు వచ్చేటట్లు చేసి ఎండబెట్టవచ్చు. కాయలలో ఎక్కువ తేమశాతం ఉండే ఎండలో ఆరబెట్టకుండా తేమని 7-8 శాతానికి తీసుకురావాలి. ఇందుకుగాను వేడి గాలిని వదిలి పరికరాన్ని ఉపయోగించడం వలన కాయలను ఎక్కువ ఎండలో ఎండబెట్టుకోకుండానే తేమను తగు శాతానికి తీసుకురావచ్చును. కాయలను కదిలిస్తే ఘళ్ళుమని శబ్దం వచ్చినప్పుడు కాయలు బాగా ఎండినట్లు అర్థం.

**వేరుశనగలో రసం పీల్చు పురుగుల సమగ్ర యాజమాన్యం.!**

కాయలు పూర్తిగా ఎండక ముందే వర్షం వస్తే, వర్షం ఆగిన తర్వాత కాయలు మరల ఎండబెట్టాలి. లేదంటే శిలింద్రం త్వరగా ఆశిస్తోంది. రబీ కాలంలో పీకేటప్పుడు వాతావరణ ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే ఎక్కువగా ఉంటుంది.

అలాంటప్పుడు కాయలను నేరుగా ఎండలో ఆరబెట్టకూడదు. నీడలో అరబెట్టాలి. ఎండబెట్టేటప్పుడు వేరే రకాల కాయలు కలవకుండా చూసుకోవాలి. విత్తనం కోసం ముదిరిన కాయలను నిల్వ చేసుకోవాలి.

**గాలి వెలుతురు బాగా ఉండాలి.**

కాయలను నిల్వ చేయడానికి శుభ్రమైన లోపల పాలిథీన్ లైనింగ్ ఉన్న గోనెసంచులను వాడాలి. కాయలను నింపిన సంచులను గాలి వెలుతురు బాగా ఉన్న గదిలో ఉంచాలి. బస్తాలను నేరుగా నేలపై పెట్టుకుండా ఒక అడుగు ఎత్తు చెక్క బల్లను పరిచి వాటి మీద మూటలను ఒకదానిపై ఒకటి పది బస్తాలు చొప్పున ఒక వరుసలో ఉంచాలి. కాయలు ఎక్కువ కాలం మొలకెత్తే శక్తిని కోల్పోకుండా ఉండాలంటే నిల్వ చేసే ఉష్ణోగ్రత తక్కువ ఉండాలి కాయలను నెలకొకసారి పరిశీలించి పురుగు ఉధృతిని బట్టి క్రిమిసంహారక మందులను కొట్టాలి.

# ఇంటి పంట లోగిళ్లకి అందమే కాదు ఆరోగ్యం కూడా.!

ఏ పంట వేసిన కేవలం జీవనోపాధి కోసం మాత్రమే, ఏ ఆహారం తీసుకున్నా ఆరోగ్యం కోసం మాత్రమే. ఆరోగ్యమే ఆనందం. ఆరోగ్యమే మహాభాగ్యం. ఆరోగ్యానికి పునాది మాత్రం రసాయన రహిత సేంద్రియ పంటలే. హరిత విప్లవం నుంచి నేటి వరకు ప్రపంచాన్ని పట్టి పీడించే రసాయన పద్ధతులపై క్రమంగా విముఖత పెరుగుతుంది. ప్రపంచమంతా నేడు సేంద్రియ జపం చేస్తోంది. సకల అనర్థాలకు మూలమైన రసాయన ఎరువులు, పురుగుమందులకు దూరంగా ఉంటూ ప్రకృతి పర్యావరణ విధానాలకు ఆదరణ చూపుతున్నారు. రసాయనక సాగులో ఉన్న లోపాలను గుర్తించి ప్రకృతి బాట పట్టిన రైతులు ఎందరెందరో. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఆరోగ్య సంక్షోభం, అనార్యోగం. కాలుష్యం అనేది నాణ్యమైన ఆహార ఉత్పత్తుల కొరత వంటి అంశాలు ఎంతో మందిని ప్రకృతి వ్యవసాయం వైపు నడిపిస్తున్నాయి.

**ఆరోగ్యమే మహాభాగ్యం**

జనాభా వేగంగా పెరుగుతుంది. జనాభా ఆహార అవసరాలు తీర్చేందుకు పెద్ద ఎత్తున ఆహార పంటల సాగు చేస్తున్నారు. అయినా ఒక్కసారి వరదలు, కరువు, చీడపీడల వల్ల పంట నష్టం తప్పడం లేదు. ఇలాంటి సమయంలో కూరగాయలు, ధాన్యం ధరలు పెరిగిపోయి జనం గగ్గోలు పెడుతున్నారు. అనారోగ్యాలకి కారణమయ్యే మందుల పంటలు వద్దనుకునే వారికి పరిష్కారం మిద్దె తోట. ఇది ఇంటి పంట లోగిళ్లకి అందమే కాదు ఆరోగ్యానికి వరం కూడా. ఒకప్పుడు చిరు దివ్వెగా మొదలైన మిద్దెతోట నేడు కాంతి పుంజమై ప్రకాశిస్తోంది. నగరవాసులు అంతా ఒకర్ని చూసి మరొకరు స్ఫూర్తి పొంది మిద్దె తోటలను విస్తరింప చేస్తున్నారు.తోట పని మాకు చేత కాదు, మావల్ల కాదన్న వారు కూడా మేము సైతం అంటూ ముందుకు వస్తున్నారు. నేడు ప్రతి నగరంలో డాబా సేద్య దారుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. సొంతింటి పంటకు మించిన మాధుర్య వంట లేదంటే పంటలు పండిస్తున్నారు. ఇంటికి కావాల్సిన పండ్లు కూడా పండిస్తూ ఇంటి పంట రుచులు ఆస్వాదిస్తున్నారు. ఒకప్పుడు గ్రామాల్లో వేసే మిద్దె తోటలు ఇప్పుడు పట్టణాలకు కూడా పాకాయి. ఉన్న కొద్దిపాటి స్థలంలోనే ఆకుకూరలు, పండ్లతోటలు వేస్తూ లాభాలు పొందడమే కాకుండా ఆరోగ్యాన్ని పొందుతున్నారు.

**డాబాలపై సేంద్రియ సాగు**

కూరగాయలు కొనడానికి అయ్యే ఖర్చులు తగ్గించుకోవడం, మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పెరటి తోటల పెంపకమే మార్గం. పట్టణ ప్రాంతాలలో పోషక పదార్థాల నిచ్చే కూరగాయలను పెంచి అందరికి ఆదర్శం అవుతున్నారు. పెరుగుతున్న జనాభాను, పోషకాహార లోపాన్ని, కూరగాయల ధరలను దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన తాజా కూరగాయల్ని, ఆకుకూరల్ని, పండ్లను అందుబాటులోకి తెచ్చేందుకు ఇంటి దివ్యవరం. పెరటి తోటల పెంపకం%ౌా% డాబా పైన సేంద్రీయ పద్ధతిలో కూరగాయలను పండించుకొని తాజా ఆహారాన్ని కొంతవరకు పొందవచ్చు.

గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లోని డాబాలపై సేంద్రియ సాగు



ద్వారా టి అవసరాలకు సరిపడే కూరగాయలు పండించుకోవచ్చు. అంతే కాదు ఖాళీ స్థలం ఎక్కువగా ఉంటే లక్షల్లో ఆర్జించవచ్చు. టెర్రస్ గార్డెన్ గురించి చాలా మందికి తెలుసు. కానీ భవనాలపై చిన్న చిన్నగా ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఇంటిల్లిపాదికీ కావాల్సిన కూరగాయలు పండ్లు పండించుకోవచ్చు. ఎలాంటి పురుగు మందులు, రసాయనాలతో పనిలేకుండా సేంద్రియ పద్దతిలో ఆరోగ్యకరమైన ఉత్పత్తులను తీయవచ్చు. కేవలం వ్యవసాయ పొలాల్లోనే కాదు, ఖాళీ జాగాలో, ఇంటి పైకప్పు పైన కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు సాగు ద్వారా ధరలను కూడా నియంత్రించవచ్చని వ్యవసాయ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఇంటి పైకప్పుపై కనీసం వంద చదరపు అడుగుల స్థలంలో కూడా ఏటా 300 కిలోల కూరగాయల దిగుబడి తీయవచ్చని పరిశోధనల ద్వారా తేలింది.

**వ్యవసాయ భూములపై ఒత్తిడి తగ్గించాలి**

పెరుగుతున్న జనాభా ఆహార అవసరాలను తీర్చేందుకు సాగు భూములపై ఒత్తిడి పెంచుతున్నారు. దీంతో భూములు సారాన్ని కోల్పోతున్నాయి. మరోవైపు పట్టణాలు వేగంగా విస్తరించడంతో సాగు భూమి తగ్గిపోతుంది. వీటికి తోడు ఎల్ నినో, లానినో ప్రభావంతో వరదలు, కరువు పరిస్థితులు వెంటాడుతున్నాయి. వీటిని అధిగమించి ఆహార అవసరాలు తీర్చుకోవాలంటే పెరటి సేద్యం, మిద్దె సేద్యం తప్పనిసరి, పట్టణాల్లో, గ్రామాల్లో ఏ కొద్ది ఖాళీ స్థలం ఉన్న అందులో సేంద్రియ పద్ధతిలో కూరగాయలు సాగు చేసుకోవాలి.

ఖాళీ స్థలాలు అందుబాటులో లేకుంటే ఇంటి పై కప్పులపై కూరగాయల సాగు చేపట్టవచ్చు. విశ్రాంత ఉద్యోగులు, గృహిణులే కాదు, వారాంతంలో ఉద్వయోగులు గార్డెన్ లో పని చేయడం ద్వారా ఆరోగ్యంతోపాటు, ఇంటికి కావాల్సిన కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు పండించుకోవచ్చు. ఎక్కువ ఖాళీ స్థలం, ఇంటి పై కప్పు అందుబాటులో ఉంటే నెలకు కనీసం రూ.10 వేల నుంచి లక్షల్లో ఆర్జించవచ్చు.

**పెరటి తోటల పెంపకానికి ఉద్యానశాఖ సన్నాహాలు**

పట్టణాల్లో నివసించే వారికి గ్రామాల్లో లాగా అంతగా ఖాళీ స్థలం ఉండదు. అయితే ఉన్న స్థలంలోనే పెరటి తోటల పెంపకాన్ని చేపట్టవచ్చు. దీనివల్ల ఆహ్లాదకరమైన వాతావరణం తో పాటు, రసాయనాల ప్రభావం లేని కూరగాయలను పొందవచ్చు. పరిసరాల ప్రాంతాల్లో ఉన్నటువంటి ఖాళీ స్థలాల్లో పెరటి తోటల పెంపకానికి ఉద్యానశాఖ సన్నాహాలు చేస్తున్నారు. కూరగాయల పెంపకం పై బడి పిల్లలకు అవగాహన కల్పించడంతో పాటు పిల్లలు మధ్యాహ్న భోజనానికి అవసరమయ్యే కూరగాయలను పండించవచ్చు.

**ఏడాది పొడవునా కల్తీ లేని కూరగాయలను తినవచ్చు.**

రోజురోజుకు కూరగాయల రేట్లు పెరుగుతున్న నేపథ్యంలో పెరటి తోట సాగు విధానం అందరికీ అనుకూలంగా ఉంటుంది.. పెరటి తోటల పెంపకంలో ఎట్టి పరిస్థితిలోనూ విషపూరితమైన రసాయన మందులు వాడరాదు. పెంపకంలో చిన్న చిన్న పద్ధతులు పాటించడం ద్వారా మంచి దిగుబడి తో పాటు నాణ్యమైన కూరగాయలను పొందవచ్చు.పెరటి తోటల పెంపకం వలన ప్రయోజనాలు చాలా ఉన్నాయి. ఏడాది పొడవునా కూరగాయలు పొందవచ్చు.కల్తీ లేని కూరగాయలను ఇంట్లోనే తక్కువ ఖర్చుతో పొందవచ్చు. అధిక పోషక విలువలు కలిగిన తాజా కూరగాయలు లభిస్తాయి..కుటుంబ సభ్యులకు, చిన్న పిల్లలకు మొక్కల పై ఆరోగ్యం పైన పోషక విలువలు కలిగిన ఆహార నియమాలపై అవగాహన పెంచవచ్చు. పెరటి మొక్కల పెంపకం వలన మానసిక ఉల్లాసమే కాక, శారీరక వ్యాయామానికి కూడా ఉపయోగపడుతుంది.

**అసలు ఏం చేయాలి**

సాగుచేసే పెరటి తోటల విషయంలో చాలా శ్రద్ధ తీసుకోవాలి. ముందుగా పశువుల ఎరువు వేసి నేలను చదును చేయాలి. తర్వాత పాదులు తీసుకుని విత్తనాలను సరైన దూరంలో విత్తుకోవాలి. విత్తిన వెంటనే తేలికపాటి నీటి తడులు ఇవ్వాలి. ఐదారు రోజులకు ఒకసారి నీటి తడులు ఇవ్వాలి. వేడి వాతావరణం లేకుండా చూసుకోవాలి. ఎప్పటి కప్పుడు కలుపు సమస్య లేకుండా ఎండ, సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి. తోటలకు నీటి వసతి దగ్గర ఉండే విధంగా చూసుకోవాలి. విత్తనాలు విత్తేటప్పుడు సరైన దూరం పాటించాలి.టమాటా మొక్కలు నాటిన వెంటనే కర్రలతో లేదా స్టేకింగ్‌తో ఊతం ఏర్పాటు చేయాలి. జాతి కూరగాయలైన కాకర, బీర, సొర వంటి వాటికి పందిర్లు పాకించాలి. ఇంటి పైకప్పుపై నేరుగా మట్టి పోసి సాగు చేయడం సాధ్యం కాదు. అందుకే కుండీలు ఏర్పాటు చేసుకోవాలి. లేదా పాలిథిన్ షీట్ కవర్ వేసుకుని చిన్ని చిన్న గదులు తయారు చేసుకోవాలి. వర్షపు నీరు, మొక్కలకు పోసిన నీడి తడి ఇంటి పైకప్పుకు చేరకుండా జాగ్రత్తలు పాటించాలి. ఇంకా కొంచెం పెట్టుబడి పెట్టగలిగితే షేడ్ నెట్, పాలీహౌస్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఇలాంటి ఏర్పాట్లు చేసుకుంటే ఏడాదంతా కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు దిగుబడి తీయవచ్చు. మీ ఇంటి అవసరాలకే కాదు. మీ కాలనీ లోని అందరి అవసరాలు తీర్చవచ్చు. డబ్బు కూడా సంపాదించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. తెలంగాణలో టెర్రస్ గార్డెన్ చేసే వారికి రాయితీపై పరికరాలు కూడా అందజేస్తున్నారు.

## ఉగాది కవితలు



శ్రీకర శుభకరమై వర సిరులు తేవె శ్రీ శోభకృత్ ఉగాదివై వెలుగు లీవె శిశిరం రాల్చిన కొమ్మల చివురులిచ్చి చితికిన గత బతుకుల చిగురులిచ్చి మనుషులందరికీ మంచి మనసునిచ్చి చైత్రమాసపు అందచందాలు ధాత్రికిచ్చి
సీ!!సుమ మంజరుల్ ఘన శోభాకృతంబున
విశ్వంభరంబున విందు గూర్చ
కింకిరంబుల కంఠ కీర్తనా కౌశలం
శ్రవణ సౌభాగ్యమై శ్రాంతి గొలుప
మోదాఖ్యతతు లతి మోదంబునన్ దూగి
అతులిత హరితంబు నందు కొనగ
ఘర్మదీధితి కడు ఘర్మంబు ఘట్టనన్
ఆర్ద్రగాత్రంబున నతివలు జన
తే!!వచ్చె శోభకృత్వత్సరం పరుగు లిడుచు
పంచె పారిభద్ర పటీర పరిమళమ్ము
తెచ్చె దీవనల్ దైవసదేశ మలరి
త్రుంచె దివ్యాస్త్రమున లోక దుష్ట గుణము

### శోభకృతు సుస్వాగతం

శోణరత్నజిగియు శుకకేకికికినెంచి
భద్రాసనమలరి భవితనుడువ
కృకవాకమేల్కొల్పు గృహమెక్కినినదింప
తుహినజల్లులసోలి తులసిమెరయ
ఉర్విపైకదలాడు సర్వజీవులమది
గారవిల్లబడుతు గంతులిడగ
దివిజగణంబును భువినిజేరగవచ్చి
కిమ్మీరసంతతిన్ దుమ్ముదులుప
సుస్వరాలపికము శోభితజగతికిన్
స్వాదురసమొసంగి సౌఖ్యమరయ
గతమువెతలమరచి కలికాలవర్తనల్
తంత్రమెఱిగిధరను తనియబడియె.

### సాదృశం

అరుణ గిరిని కుంచెగ మలచి
మురిపాల పాలకడలిని తలచి వలచి
అందాల అపరంజి ప్రకృతి కన్య
ఉషోదయ వేళలో సోయగాల ఆరబోత
తొలకరి చినుకుల వానపాటలో
తడిసిన తనువును తన్మయత్వంతో
చూపు తిప్పని తీక్షణ నేత్రాలు
ఆకాశంలో ఆలపించిన అలల గీతాలు
పైరగాలి సంగీతానికి సెలయేటి గానంలో
జలపాతాల జోరులో నదులు నాట్యమాడగ
ఒంపుసొంపులు నింపుకున్న కొండకోనల
పచ్చదనపు పరవళ్లతో పుడమి పులకరించె
సాయంసంధ్యా సమయంలో
నచ్చిన నెచ్చెలి వెచ్చని తోడులో
తళుకులీనే తారాజువ్వలు
గోముగా కైపెక్కించే చెక్కిలి సొబగులు
ఋతువు ఋతువుకు
ఋతురాగాలు పలకరించగ
శిశిరం నింపిన చైతన్యంతో
వాసంత వైభవం 'శోభకృత'మవగా
ఊయలలూగే ప్రకృతి పరిణయం
ఉత్తేజపరిచే ఊహల సౌరభం
ప్రకృతి ప్రదీప్త రమణీయతకు
ఆబాల గోపాలం పునఃరంకితమవగా
అబ్బురపరిచే అపురూప చిత్రరాజమై
సాక్షాత్కరించిన హరిత సాదృశం
విరుల హరివిల్లు ఆవిష్కృతం!

### ఓ శోభకృత్!

కొత్తగా పేరు మార్చుకుని వస్తున్నావే కానీ!
కొత్తదనం ఏం తెస్తున్నావని ప్రతి ఏడాది



మనసులోని మాటను
అడగాలనుకుంటా..
ఎందుకోగానీ నీవొస్తే
నాక్కూడా చెప్పకుండానే
ఆకలిదప్పులు నన్నొదిలి
పారిపోతాయ్
ఇక అడగాలన్న
ధ్యాసెక్కడుంటుంది
చెప్పు?
నీ రాకనంత వెన్నెల
చేసుకుని మురిపిస్తావు
వసంతమై
పరవశిస్తావు, కోకిలవై
పలకరిస్తావు
పల్లెతనాన్నంత మోసుకొస్తావు, మోహిస్తావు.
ఊర చెలిమెలో కొత్త నీరు ఉబికివచ్చినట్టు
ఎండిన మాను చిగురేసి మామిడి పిందెలిచ్చినట్టు
కండ్లనిండా కాంతులు నింపి కవ్విస్తావు.
చేదు వేప తేనెలూరే తీపిని పంచినట్టు
కొత్త చింతకాయ వలపు పులుపు తెచ్చినట్టు
మనసు నిండా మధురాలను నింపేస్తావు.
చెరుకు ముక్కలు తీపి అమృతాన్నిచ్చినట్టు
కరుగుతున్న కాలానికి పువ్వై విరబూసినట్టు
పొడుస్తున్న పొద్దోలే ఉగాదివై ఉదయిస్తావు.
నీవు పంచే పంచామృతం లాంటి జ్ఞాపకాలు
మరిచిపోని, మరువలేని ఆనంద క్షణాలు
అందుకే! నిన్ను అడగాలనుకున్నదేదీ అడగలేక
అడిగి నీవు పంచే తీపిని వదలుకోలేక
ప్రతిసారి నాకు నేనే ప్రశ్నగా మిగులుతున్నా..

# ఏభై ఏళ్ళనాటి సీరపాణి 'జీవన వసంతం'

**చైత్ర, వైశాఖ మాసాలు వసంత ఋతువు. ఏడాదిలో వచ్చే ఆరు ఋతువుల్లోనూ మొదటిది. 'ఋతువుల రాణి వసంత ఋతువు' అని అన్నారు మన కవులు. వసంతాన్నే 'ఋతురాజు' అని కూడా కొనియాడారు కొందరు కవులు. నూతన సంవత్సర ఆహ్వానాన్ని మానవాళి చేత అందుకునే సౌభాగ్యశాలిని. ఏది ఏమైనా కొత్త సంవత్సరానికి స్వాగత ద్వారం వసంతం. ప్రముఖ అభ్యుదయ కవి 'సీరపాణి' జీవన వసంతం అనే కవిత ద్వారా మానవ జీవితంలోకి వసంతాన్ని ఇలా ఆహ్వానిస్తున్నారు.**



'శిశిర హిమ యవనికలు శీర్ణమై, జీర్ణమై
నవ మధూదయ స్వర్ణరాగ సంకీర్ణమై
గలిత పాదప శుష్క పత్ర సంరంభమై
లలిత నవ వల్లికా పల్లవారంభమై
అంతరించెను గతము ప్రళయ సంకేతమై
అవతరించెను నవత ప్రణవ సంగీతమై' అనే చరణాల్లో కవి 'నవత' ఎలా ఆవిర్భవించిందో చెబుతున్నారు. శిశిర ఋతువులోని మంచు తెరలు శిథిలమై, కనుమరుగై మధూదయాన్ని సూచించే స్వర్ణకాంతులు దట్టంగా వ్యాపించాయి. పండుటాకులను గలగలా రాల్చివేసి, చెట్లు, లతలు కొంగొత్త చిగురుటాకులతో శోభిల్లుతున్నాయి. ప్రళయ సంకేతంగా గతం అంతరించిపోయి, నిత్య నూతనమైన సృష్టిగా నవత అవతరిస్తోందట.
ఈ సందర్భంగా కవి కాలం యొక్క స్వరూప స్వభావాలను దిఙ్మాత్రంగా సూచిస్తున్నారు.
'కాలమొక నిత్య నూతన ఇంద్రజాలం
సుఖ దుఃఖ సంకలిత మణి ప్రవాళం
కాలమొక గంభీర జలధి, నిర్వేలం
రాత్రిందివాల రంగుల ప్రకృతి చేలం'
కళ్ళముందు కదలాడుతున్నా 'కాలం' నిత్య నూతన ఇంద్రజాలం వంటిదనీ, సుఖదుఃఖాలనే మణులు, పగడాలు కలగలిపి కూర్చిన హారం వంటిదని వర్ణిస్తారు. కాలమనేది లోతు తెలియని, గట్టు లేని సముద్రం వంటిది. రాత్రింబవళ్ళనే వెలుగునీడల రంగుల వస్త్రం ఆచ్ఛాదనగా కలిగినదనీ, దాని బాహిర రూపాన్ని స్ఫురింపజేస్తున్నారు. ఊహకందని కాలం గురించి ఇలా నిర్వచించగలగడం సామాన్యమైన విషయమేమీ కాదు. ఇది కవి రచనా చమత్కృతికి నిదర్శనం.
'కాలమొక సింధువు, బ్రతుకొక్క బిందువు
కాలమొక మేరువు, జీవితము రేణువు
ఈ ఇరుకు బ్రతుకులో ఇంత క్రౌర్యమ్మా
మానవత్వం మాపునంత ధైర్యమ్మా' అని మానవ జీవితం ఎంత సూక్ష్మాతి సూక్ష్మమైనదో కవి తెలియజేస్తున్నారు. అత్యంత అల్పకాలికమైన బతుకులో ఇంత క్రూరత్వమా! మానవత్వాన్నే మంటగలిపేటంతటి సాహసమా! అని మనిషిలోని అమానుషత్వాన్ని తీవ్రంగా గర్హిస్తున్నారు కవి.
'మనుషులను ప్రేమించు వాడెపో నరుడు
అది ఎరుంగనివాడు అవని యమకింకరుడు' ఇలా సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని చాటి చెప్తున్నాడు ఈ కవన ప్రేమికుడు. ఇంకా ఇలా అంటున్నాడు ..:
'ఒక హిమాలయ భూధరోత్తుంగ శృంగమై
ఒక క్షీర సాగరోచ్ఛరదురు తరంగమై
సౌజన్య సౌహార్ధముల నాట్య రంగమై
ప్రతి మనిషి జీవితం పరిఢవిల్లాలి' ఇలా చైతన్యంగా ఉండాలని అంటూ ప్రతి మనిషి జీవితం ఒక హిమాలయ పర్వత శిఖరంలా ఉన్నతంగా ఎదగాలి. ఒక పాలసముద్రం నుండి ఎగసిపడే కెరటంలా సౌజన్యము, సౌహార్ధము అనే సుగుణాలు నటించే నాట్య రంగంలా పరిఢవిల్లాలని ఆకాంక్షిస్తున్నారు.
'యుగయుగమ్ముల ధ్వాంత పటలి నశియింపగా
జడ జగతిలో నూత్న తేజమ్ము నింపగా
నైరాశ్యమును కూల్చి, దారిద్ర్యమును దుల్చి
బ్రతుకులో చైతన్య మురళి రవళింపగా' అనే చరణాల్లో తరతరాలుగా మానవజాతిని కమ్ముకొని వస్తున్న అజ్ఞానము, అసమానత్వము అనే దట్టమైన చీకట్లు చెల్లాచెదురు కాగా, స్తబ్దమైన ప్రపంచ గమనంలో కొత్త కాంతులు నింపుతూ, నిరాశను మరియు పేదరికంను పటాపంచలు చేసి, జీవితాల్లో చైతన్య మురళీ రవాలు నినదించేటట్లుగా నవవసంతం జగతికి రాబోతోందని కవి ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.
'అరుణ కిసలయ వసన మల్లికా దరహసన
పిక రసన నవవసంతం జగతి కరుదించె
జీవన రసాల శాఖాభ్యంతరము నుండి
అభ్యుదయ పుంస్కోకిలోద్గీతి నినదించె'
ఆగామి వసంతం అరుణారుణ పల్లవాలతోను, మల్లికల దరహాసంతోను వస్తోందట. ఆ శుభా గమనాన్ని కవి ఇంకా ఇలా వర్ణిస్తున్నారు. జీవితమనే మామిడి చెట్టు కొమ్మలమాటున దాగి అభ్యుదయం అనే పుంస్కోకిల గీతాలాపన ద్వారా ఎలుగెత్తి చాటుతోందట.
వసంతాగమనాన్ని ఆసరా చేసుకుని కవి ఈ గేయంలో దగ్గోచరం కాని కాలం యొక్క స్వరూప స్వభావాలను ఒడిసి పట్టి మనకు చూపిస్తారు. సుదీర్ఘమైన కాలగమనంలో మానవ జీవితం ఎంత స్వల్పమైనదో నిర్వచిస్తారు కూడా. ఇంకా మనిషి స్థానాన్ని ఎరుకు పరుస్తారు. ఈ విషయాన్ని గుర్తించి మనిషి దానవత్వాన్ని విడిచి పెట్టాలంటారు. ఇంకా మనిషి ఎంత ఉదాత్తంగా తన జీవితాన్ని ఉన్నత ఆశయాల వైపు పయనింపజేయాలో కూడా సూచిస్తున్నారు. ఈ గేయం ఆసాంతం పరిస్తే, నిండుగాను గంభీరంగాను ఉంటుంది. అయితే ఈ కవిత సామాన్య పాఠకులకు అర్థం చేసుకోవడం కొంత కష్టం కావచ్చు. ఈ విషయం సీరపాణి గారి వద్ద ప్రస్తావిస్తే, ఆయన సమాధానం ఇలా ఉంది.
'మన కావ్యాల్లోనూ, ప్రబంధాల్లోనూ ఉన్న భాషా ప్రౌఢిమ, భావగాంభీర్యమూ గేయ కవిత్వంలో కూడా చూపించవచ్చును అనేందుకు నిదర్శనంగా నా గేయ రచన ప్రారంభ దశలో ఈ గేయాన్ని ఈ శైలిలో రాశాను'. ఈ గేయం సీరపాణి గారి 'డమరుధ్వని' అనే కవితా సంపుటి లోనిది. దీన్ని 1972 ఫిబ్రవరిలో రచించారు. ఈ గేయానికి 50 వసంతాలు పూర్తయ్యాయి.
హైదరాబాద్ వంశీ ఆర్ట్స్ వారు 1975లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవిత్వపు పోటీలో ప్రథమ బహుమతి గెలుపొందింది ఈ కవిత. ఈ పోటీకి డాక్టర్ సి.నారాయణరెడ్డి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈ కవిత రాసే కాలానికి సీరపాణి వయస్సు సుమారు 22 సంవత్సరాలు. నవ యౌవనంలో నవనవోన్మేషంగా అందించిన నవ్య కవితగా ఈ గేయకైతను అభివర్ణించవచ్చు. ఇలాంటి అద్భుత గేయాలను పాఠ్యాంశాలుగా చేర్చాల్సిన అవసరముంది.

# భాషే మన ఐడి కార్డు కానీ, అందులో ఏం నేర్పుతున్నాం ?

ప్రాణి మనుగడకు ముఖ్యంగా కావల్సింది గాలి, నీరు, ఆహారం. గాలి ఉంటేనే ప్రాణి బతుకుతుంది. దానికి నీరు, ఆహారం అవసరమౌతాయి. సాహిత్యానికి కూడా అలాంటివే మూడు కావాలి. భాష, రూపం, వస్తువు. భాష ఉంటే నే సాహిత్యానికి బొమ్మ ఒక రూపం ఏర్పడుతుంది. రూపం పాఠకుడి మనసులో కదితేనే వస్తువు ప్రకటింపబడుతుంది. దీన్ని బట్టి వస్తువు కన్నా, రూపానికన్నా భాష ఎంత ముఖ్యమో అర్థం చేసుకోవచ్చు. భాషే మన ఐడి కార్డు. భాషను మించిన ఐడెంటిటీ కార్డు మనకు ఇంకొకటి లేదు. సూది వెంట దారంలా భాష వెంట సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం వగైరా అన్న వాటంతట అవే సాహిత్యంలో వచ్చి చేరతాయి. అయితే ఇప్పుడు వాటిని కొంచెం ఎడిట్ చేసుకోవాల్సిన తరుణం వచ్చింది.

సాహిత్యంలో భాషను, యాసను నిలుపుకోవడమంటే మన తల్లి పాల తీయదనాన్ని మనం గుర్తు చేసుకున్నట్టు.. మన మట్టి వాసనను మనం ఎలుగెత్తి చాటుకున్నట్టు. రెప రెపమనే మన జెండాని మనం ఎగరేసుకున్నట్టు! మన చిరునామా మనం సరిగా చెప్పుకున్నట్టు. భాషే మూలం. యాసే కేంద్రకం. ఫలానా జిల్లా వాణ్ణి అని చెపితే చిరునామా పూర్తిగా చెప్పినట్లు కాదు. ఇంకా లోతుల్లోకి, మూలాల్లోకి వెళ్ళాలి. ఏ మండలమో, ఏ గ్రామమో, ఏ వీధో చెపితే గానీ మన చిరునామా పూర్తి కాదు. చిరునామాని విశ్లేషించి చూస్తే అది మన వర్గాన్ని, మన ఆర్థిక స్థోమతని కూడా తెలియజేస్తుంది. ఒక ప్రాంతం నుంచి వెలువడ్డ మంచి రచన మనకు అనేక విషయాలు తెలియజేస్తుంది, పువ్వు వెంట వచ్చే తావి లాగా. ఇక సాహిత్యం జీవిత దర్శనం అయినప్పుడు, జీవితానికి సంబంధించిన అన్ని అంశాలు, అన్ని పార్శ్వాలు అందులో చోటు చేసుకుంటాయి. ప్రధానంగా భాష! అసలు భాషే మూల వాహిక కనుక, భాష ఎంత స్పష్టంగా ఎంత సరళంగా వాడితే, ఆ రచన అంత స్పష్టంగా అంత సరళంగా అంత బలంగా తయారవుతుంది.

సాహిత్య పరిణామ క్రమంలో ఒకప్పుడు పండితులు మాత్రమే రచనలు చేసేవారు. రచనలు గ్రాంధికంలో వచ్చేవి. భూస్వామ్య వ్యవస్థ పోయి ప్రజాస్వామ్య వ్యవస్థ వచ్చినట్లుగా సాహిత్యం గ్రాంధికంలోంచి వ్యావహారికంలోకి మారింది. వ్యావహారిక భాషను పత్రికా భాష, ఉమ్మడి భాష అని ఏ పేరుతో నైనా పిలుచుకోవచ్చు. కానీ, ప్రామాణిక భాష ఏదీ అంటే, ఏ ప్రాంతానికి ఆ ప్రాంత భాషే ప్రామాణికం. సజనాత్మక రచనలు ఆయా ప్రాంతీయ భాషల్లో వచ్చినపుడే బలంగా ఉంటున్నాయన్న విషయం నిర్వివాదాంశం.

పరిపాలనా వ్యవస్థకు, శాస్త్ర సాంకేతిక విషయ వివరణకు ఉమ్మడి భాషను ఉపయోగించుకోవచ్చు . ఎందుకంటే ఆ భాష, అందులోని విషయం అన్ని ప్రాంతాల వారికి అందాల్సి ఉంది గనుక. సజనాత్మక రచనలు కూడా ఉమ్మడి భాషలో చేపట్టొచ్చు. విషయాన్ని ప్రతిభావంతంగా దర్శింపజేయొచ్చు. కవిగాని, రచయిత గాని తీసుకునే ఇతివత్తాన్ని బట్టి. రచన ఏ భాషలో ఉండాలనేది, నిజానికి ఆ రచనే నిర్దేశించుకుంటుంది. ఒక ప్రాంతానికి చెందిన భాషను, యాసను ఉపయోగించి రచన వెలువడితే అది ఇతర ప్రాంతాల వారికి అర్థం కాదు అనేది తప్పు. కొన్ని సాహిత్య విలువలతో దానిలోని స్ఫూర్తి, ఆర్తి నేరుగా అన్ని ప్రాంతాల పాఠకులకు అందుతుంది. స్వానుభవంతో చెప్పేదేమంటే తెలంగాణ ప్రజల భాషలో నేను తొలుత రాసిన కవితలు, కథలూ తెలుగు రాష్ట్రాల్లోనూ, వాటి బయటా అన్ని ప్రాంతాల వారికి అర్థమయ్యాయి. పైగా అవి ప్రజల భాషలో రాసినందుకే శక్తిమంతమయ్యాయని అందరూ ఒప్పుకున్నారు. అర్థం కాలేదని ఎవరూ అనలేదు. ప్రత్యేకంగా ప్రజల భాషలో రచనలు రావడానికి చాలా సంవత్సరాలకు ముందే ఆ భాషా పదాలు సాహిత్యంలో జొరబడ్డాయి. మన ప్రాచీన సాహిత్య ప్రక్రియలైన పద కవిత, తత్వ కవిత, మార్గ కవిత, శతకం, ద్విపద లాంటి వాటిలో ప్రజల భాషలోని పదాలు చాలా కనబడతాయి. రచనలు ప్రజలకు అర్థం కావాలి. అందుబాటులోకి రావాలి అనే భావనలోంచే కవులు తమ రచనలో ప్రజా భాషా భాషాపదాల్ని ఎక్కువగా వాడి ఉంటారు. ఒకరకంగా చెప్పాలంటే ప్రాచీన కాలం నుండి నేటి అత్యాధునిక యుగం వరకు ఉన్న కవులు, రచయితలలో కొంతమంది తమ రచనలు జానపద సాహిత్యానికి దగ్గరగా లేదా సమాంతరంగా ఉండాలనుకోవడం వల్ల ప్రజల భాషలోని పదాలు లిఖిత సాహిత్యంలో అంతర్భాగమయ్యాయి. అవుతున్నాయి. ఇక ముందు కూడా అవుతాయి.

ఉమ్మడి భాషలో ప్రాంతీయ పదాలు జొప్పించి ఒకరకమైన స్వతంత్ర ప్రత్యేక ప్రాంతీయ భాషకు రూపకల్పన జరుగుతూ ఉంది. ఉదాహరణకు "బతుకులోని తండ్లాటను తెలుసుకో" అనే వాక్యంలో "తండ్లాట" అనేది తెలంగాణ పల్లెల్లో విరివిగా వినిపించే మాట! మిగతా పదాలు అన్ని తెలుగు ప్రాంతాల్లో వినిపించే మాటలు. నేత పనివారి జీవితాల గూర్చి వచ్చే రచనల్లో – వారి వత్తికి సంబంధించిన పదాలు చేరతాయి. బొగ్గు గనుల్లో పనిచేసే వారి జీవితాల గూర్చి వచ్చే రచనల్లో వారికి పరిమితమైన సాంకేతిక పదజాలం సాహిత్యంలో చేరుతుంది. గొండు జీవితాల గూర్చి వచ్చిన సాహిత్యంలో గోండు భాషాపదాలు చేరుతున్నాయి. ఉదాహరణకు "పేన్కు అన్నాడు కుర్సింగ రాం". ఇందులో పేన్కు అంటే దేవుడు. పేన్కు దయి' అంటే దేవుని దయ అని



అర్థం.
అలాగే కుర్సింగ్ రాం గోండు జాతి వారు పెట్టుకునే పేరు.

'ఆయినా ఉత్రాయించు సార్! గాలి గుసాయించి సతాయిస్తోంది" అని ఒక కథలో ఒక పాత్ర అంటుంది. తెలుగైపోయిన ఉరుదూ పదాలతో ఒక రకమైన భాష హైదరాబాదు పాత బస్తీలో వినిపిస్తుంది. "అద్దం వేసేయండి. గాలి జొరబడి బాధిస్తోంది " అని ఆ మాటకు అర్థం. ఈ విధంగా తెలంగాణ ప్రజల భాష ఉరుదూ, ఫారసీ, అరబ్బీ, సంస్కతం, కన్నడం, మరాఠీ లాంటి అనేక భాషల పదాలతో తయారయ్యింది. ఆధునిక కాలంలో విద్యావంతుల సంఖ్య పెరుగుతున్న కొద్ది ఇంగ్లీషు పదాలు ఎక్కువగా చేరుతున్నాయి. ఫలితంగా ఉమ్మడి భాష పెరుగుతూ ఉండడంతో పాటే ప్రాంతీయ భాష కూడా పెరుగుతూ ఉంది. గమనించ వల్సిన విషయమేమంటే, ఒక ప్రాంతీయ భాషలోనే అనేకనేక భాషా భేదాలున్నాయి. ఉంటాయి. ఎక్కడికక్కడ అవి ఉమ్మడి భాషలో కలిసి పోతుంటాయి. సమకాలీన సాహిత్య రంగంలో ఎంతోమంది ప్రతిభామూర్తులు నిజాయితీగా తమ తమ మూలాల్ని వెతికి చూపుతున్నారు. వారంతా తమ గళంలో ఒరిగిన భాషను యాసను తమ కాలంలో జొప్పించి గర్వించదగ్గ సాహిత్యాన్ని సష్టిస్తున్నారు. వారందరినీ మనస్ఫూర్తిగా అభినందించవల్సిందే !

సాహిత్యం స్పష్టంగా ఉండాలి. నిజాయితీలోంచి రావాలి. చిత్తశుద్ధిలోంచి రావాలి. నిజాల్ని వెల్లడించాలి. మరి ఇవన్నీ ఉండాలన్నప్పుడు సమాజంలోని మనుషుల్లాగానే ఆయా ప్రాంతపు సాహిత్య పాత్రలు కూడా ఆయా సమాజాల్లోంచే రావాలి. అలాంటప్పుడు పలుకుబళ్ళు, జాతీయాలు, నుడికారాలు తప్పనిసరి. అవన్నీ ఉన్నాప్పుడే సాహిత్యం సమాజపు ఆత్మలో అంతర్భామైపోతుంది. పచ్చి నిజాలు ఉన్నవి ఉన్నట్లు రాస్తే అది సాహిత్యం కాదు. వాస్తవాల మీద కాల్పనికా సజనాత్మకత ఒక సన్నని పొరలా కప్పి ఉండాలి. అప్పుడే ఆ నిజాలు సాహిత విలువలుగా మారిపోతాయి. సరే, ఈ విషయాలు ఇట్లా ఉండనిద్దాం.. భాషాసాహిత్యాల గురించి మనం ఎన్ని విషయాలైనా మాట్లాడుకోవచ్చు. భాషోద్యమాల గురించి ఎంతైనా చర్చించుకోవచ్చు. ప్రతి ఒక్కరు తల్లి పాలు తాగి పెరిగితేనే ఆరోగ్యంగా ఉంటారు. అలాగే మాతభాషలోనే విషయాలు సుళువుగా నేర్చుకోగలుగుతారు. ప్రపంచ దేశాలెన్ని తిరిగినా, ఎంతో మందిని కలిసినా, తల్లి స్థానం తల్లికే ఉంటుంది. తల్లి లాంటి పుట్టి పెరిగిన ఊరి స్థానం ఆ ఊరికే ఉంటుంది. కానీ ఇప్పుడు కొంచెం వైజ్ఞానికంగా ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ యుగస్పహను జీవితానికి అన్వయించుకోవాలి. మనం పిల్లలకు ఏం నేర్పుతున్నాకున్నది కూడా ఇప్పుడు చాలా ముఖ్యం! పసిపిల్లలు నిలకడగా కూర్చుంటున్న దశలాగే మనవాళ్ళు 'జేజకు దండం పెట్టూ' అని చెపుతుంటారు. ఇంకొంచెం పెరగగానే 'జాబిల్లి రావే' అని పాడి వినిపిస్తుంటారు. మాటలు వస్తున్న దశలోనే 'చేత వెన్న ముద్ద చెంగల్వ పూదండ' అని దేవుడి వర్ణనలతో పాఠాలు ప్రారంభమవుతాయి. వాస్తవం ఏమంటే వేల యేళ్లు గడిచినా చందమామ దిగి రాలేదు. మనిషే చంద్రుడి పైకి వెళ్ళి రావాల్సి వచ్చింది. ఊహల్లోంచి, భ్రమల్లోంచి వచ్చేది సాహిత్యమైతే, వాస్తవంలోంచి నిజంలోంచి వచ్చేది సైన్సు. 'పద పద పోదాం .. చంద్రుడి పైకి' అని పాడాల్సిన సమయం వచ్చింది కదా? దేవుడు, దయ్యం, భూతాలు, మహిమలు, మాయల కథలు మానేసి మానవుడి శౌర్య గాథలు చెప్పాల్సిన సమయం ఇది. "జానీ జానీ– యస్ పాప్పా", ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్" లాంటి ఇంగ్లీష్ రైమ్స్ పర్యావరణం గూర్చి, సామాజిక జీవనం గూర్చి, వ్యక్తిత్వవికాసం గూర్చి ఉన్నాయి. దేవుడి గూర్చి, భక్తి గూర్చి, మతం గూర్చి లేవు. ఏ దేశంలో ఏ భాషలో ఎలాంటి అబద్ధపు పాటలు ఉన్నా అని పిల్లలకు నేర్పడం మానెయ్యాలి. వారికి వాస్తవాలు చెప్పడం అవసరం.
సంస్కతి, సంప్రదాయం పేరుతో గతంలోని చెత్తనంతా వచ్చే తరాల మీద రుద్దకూడదు. వారి రెక్కల మీద మోయలేని భారం వేసి, సంశయంలో పడదోసి వారి జీవితాలు దుర్భరం చేయకూడదు.
చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూడనివ్వాలి. మానవీయ విటవల్ని దర్శింపనీయాలి. భాష మన ఐడి కార్డు నిజమే! బాల్యంలో బోధన మాత భాషలోనే జరగాలి. నిజమే! అదే న్యాయం. అయితే అది వాస్తవ దక్కోణంలోంచి వైజ్ఞానికంగా జరగాల్సి ఉంది.

# అపజయమెరుగని అవిశ్రాంత గీతం

కవిత్వ వస్తువుకు కాలం చెల్లనంతవరకు కవి హృదయాలు ప్రజ్వరిల్లుతూనే ఉంటాయి. కలం ఎప్పుడూ తనను తాను పదును పెట్టుకుంటూనే ఉంటుంది. సాహిత్యంలో మానవతావాదం అనేది ఉన్నప్పుడు 'స్త్రీవాదం' అనేది ఎందుకు ప్రత్యేకంగా వచ్చిందో తరచి చూడాలి! తన ఉనికి ఒక ప్రశ్నార్థకమయ్యే స్థితిని నిలదీయాల్సి వచ్చిన వర్గం ఏదైనా ఉన్నదా అంటే అదీ ఒక్క స్త్రీ జాతి మాత్రమే. అలా చెప్పాల్సిన పరిస్థితులు వచ్చినప్పుడు వాదాలు వినిపించక ఏం చేస్తారు? అందుకే స్త్రీ వాదం దశాబ్దాలుగా పిడికిళ్ళెత్తుతూనే ఉన్నది.

ఇందుకు ఓ పెద్ద ఉదాహరణ ఈ 'అపరాజిత'. ఎట్లా పరాజితులు? ఎందుకు పరాజితులయ్యారు? ఎవరు పరాజితులను చేస్తున్నారు? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానంగా ముప్పై ఏండ్ల కవిత్వంగా మనముందుకు వచ్చిందీ 'అపరాజిత'! ఇందులో 93 మంది కవయిత్రులు కవితలై వైవిధ్యమైనరీతిలో చిత్రిక పట్టారు.

'ఇల్లు చూచి ఇల్లాలిని చూడమన్నచోట విల్లంబులైన తనువులు
%అందరి ఔదార్యాలకు సంకేతాలయిన చోట
%నిశ్శబ్ద యుగాలుగా పారి%ొా% సొంత ఉనికి కోసం వెదుకులాట

అంటూ 'బ్లో-అవుట్' అవుతుంది ఓ కవయిత్రి. ఈ సామెత గౌరవ సూచకమైందా? అగౌరవ సూచకమైందా? ఇల్లూ- ఇల్లాలు కావాల్సింది ఎవరికి? ఈ ఆలోచన ఉంటే చాలు 'అతడు' 'ఆమె' ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకోగలుగుతాడు.

'మాతృత్వమనే మాట
నన్నెందుకో భయపెడుతుంది
మాతృమూర్తివనే కావ్యగానం
నన్నెంతో భ్రమ పెడుతుంది'

ఎంత గొప్ప ఎక్స్‌ప్రెషన్! తల్లి కావడమనేది తనెంతో పవిత్రంగా, ప్రేమగా, ఇష్టంగా అనుకునేమాట ఆడవాళ్లను ఇప్పుడెందుకు కలవర పెడ్తున్నది? పిల్లలు పుట్టకున్నా స్త్రీలనే చేతగానివారిగా చూస్తారు. అమ్మాయిలు పుట్టినా స్త్రీలనే దోషులుగా చిత్రీకరిస్తారు. పిల్లల పెంపకం గురించి స్త్రీలనే నిందిస్తారు. ఇదంతా ఎందుకు? ఈ అన్నిటికీ కారణం కేవలం తల్లి ఒక్కతేనా? ఆడవాళ్ల జీవితాలతో ఆడుకుంటున్నారని ఇన్ని ఆలోచనలను ఈ కవయిత్రి రేకెత్తిస్తుంది.

'దేవకన్య' అనే కవితలో పెళ్లయిన కొత్తలో మాట్లాడే మాటలకూ, రోజులు గడుస్తుంటే వచ్చే మాటలకూ మధ్య తేడాను, 'ఎంత సున్నితత్త్వం నీలో పూవు అందంగా సిగ్గుపడింది!'

ఇలా మొదలైన కవితతో ఏమా అందాలు చూద్దామా అని తర్వాతి పాదాలను చదవడానికి ఉద్యుక్తులమవుతాం. కవయిత్రి ఏమంటుందో చూడండి.

క్రమంగా భర్త ఎలా చూస్తాడు, ఏం చూస్తాడు, ఎలా పిలుస్తాడనేది చెప్తూ 'నీ ముఖం నాకు చూపించకు కంపరం' అనీ అనగలుగుతాడు. 'ఏయ్ ఒకసారి ఇటు నా దగ్గరికి రా' అనే చూపులనూ, మాటలనూ శూలాలను చేస్తాడు.

ఇలా సాగిన ఈ కవిత ముగింపు చదివితే తప్పకుండా కళ్లు చెమరుస్తాయి.

'గుండె పగిలి
ముక్కలైంది
శాపమోక్షమైన దేవకన్య
నవ్వింది
శపించకుండానే
వెళ్లిపోయింది'

ఇదీ కవిత్వం! చలించలేదూ హృదయం ! ఎన్ని వేలకొలది ముక్కలయ్యే గుండెల్ని చూస్తున్నాం!



తెల్లవారుజామున్నే నిద్రలేచి ఇంటి పనంతా చేసి, ఆఫీసుకు వెళ్లే ఆడవాళ్ల జీవితాన్ని అక్షరబద్ధం చేస్తూ వచ్చిన కవిత 'ఉద్యోగిని ఉత్తరం', కన్న తండ్రి ప్రశ్నకు బదులుగా..

'కుళాయిల్లో సన్నగా మొదలైన నీటిధార
ఆఫీసులో
నా డెస్క్ మీద ఫైళ్ల భారాన్ని జ్ఞప్తికి
తెచ్చింది'

అంటూ నడుస్తున్న ఈ కవిత రోజువారీ పనులతో సతమతమయ్యే ఆమెతో పాటు 'ఏంటెనా' తెచ్చే కాలుష్యాన్నీ చెప్తుందీ. 'పరుగెత్తే కాలం వెనుకపడిలేస్తూ ఈ ప్రయాణం' అంటూ 'ఏం రాయమంటావు నాన్నా నా కుశలం'? అన్న ప్రశ్నను సంధిస్తుంది. 168 కవితల్లో ఏవో కొన్ని పంక్తులు అపరాజిత అద్భుతత్వాన్ని ఏం చూపిస్తాయి? ఇందులోని అన్ని కవితలూ ఉదహరించదగినవే ! 'తడిసి మోపెడైన కథ', 'నాన్నల్ని కొనాలి కిలో ఎంత?' అని గుట్టులను విప్పి చెప్పాల్సింది చెప్పి 'మొగుడు సీసాతో ఉండగా నేను చాలా రిస్క్ తీసుకుంటాను' అనేంతగా రాసిన కవిత్వమూ ఉంది! సంకుచితత్వాన్ని, కుసంస్కారాన్ని నిలదీసిన కవిత్వమూ ఉంది.

'క్షతగాత్రులైన స్త్రీల శతకోటి చెరలకు
ఇక చరమగీతం పాడాలంటూ/
ఆర్తనాదాలు విముక్తి
నినాదాలుగా
పరిణమించాయి'

అంటూ 'విచ్చుకున్న నేత్రాలు' కవిత చెప్తుందో సందేశం! అనాదిగా ఆడవాళ్లను అణిచివేస్తున్నా పట్టించుకోక నడుస్తూనే ఉన్నారు. 'చీకట్లోంచి వెలుతురులోకి' అనే కవిత చూస్తే,

'మనుగడ కోసం పోరాటం/ డార్విన్ పదేపదే గుర్తొస్తున్నాడ'ని మొదలై 'లోపల ఒక ఆలోచన/ అగ్ని పర్వతాన్ని రగిల్చింది/ తెలవారితేగానీ తెలియలేదు/ లావాగా ప్రవహించినచోటల్లా/ పచ్చని జీవితం పర్చుకుంది' అంటూ తన సహనంతో తన తెలివితో తనదైన శ్రమతత్వపు మనస్తత్వంతో ఆడవాళ్లు ఎంత ఉన్నతంగా ఉంటారో చెప్తుందీ కవయిత్రి.

'పొద్దున్నే లేవగానే/ పొగలు కక్కే కాఫీ తాగుతూ/పేపరు చదవాలని నా చిరకాల వాంఛ./ రుచి లేని పచనంతో తన జీవితం వ్యర్థమైందని/శ్రీవారు గాయపరిచినపుడు నా మన సు.. అంటూ 'వంటింటి సూర్యోదయాలు' కవిత కవిత్వమంతా అందరి ఇండ్లల్లో నిత్యం జరిగే తంతు.

'కండ్లు మూసినా తెరిచినా/ రెప్పకూ, రెటీనాకు మధ్య/ ఆడబతుకు వెలుగునీడల చారిత్రక ప్రవాహాలు ఎన్ని ప్రశ్నలు ఎన్ని సంక్షుభిత విషయాలు హృదయాలు ద్రవింపజేసే 'మానవి' కవిత గుండెల్లో ప్రకంపనలు పుట్టిస్తుంది.

'కండలుంటేనే గొప్పా?' కవిత చూడండి.'వాళ్లు సాహస వనితలు/ భయాన్ని కొమ్మలు కొమ్మలుగా నరికి/ మోపు కట్టి మోస్తూ/ చరిత్రకు భవిష్యత్తుకు మధ్య/ కొత్త వంతెన వేయగల సమర్థులని కొత్త ఒరవడినిచ్చే కవిత్వం చదువాలంటే చదువు రావాలిగా! ఇవన్నింటికీ ఈ అపరాజిత ఓ ప్రేరణ! 'నిన్నటిదాకా/ పాదాలకు వెదురు బద్దలు కడితే.' అని మొదలైన నెలపొడుపు కవితలో పంక్తులు చురకత్తులే!' అవయవ మార్కెట్లకు/ నెత్తుటి రాతలకు/ ఆమే అక్రమ రవాణా.. కెమెరా శత్రువు/ కన్ను మనదే/ వేలు మనదే/ ఆమెకు గాయం పాతదే / కత్తులే కొత్త వి' అని కొత్త ఉదయాన్ని కాంక్షిస్తుందీ కవయిత్రి.

'స్త్రీత్వపు కొలమానంగానే మిగలనింక/ నేను అపరాజితను/కనిపించని సంకెళ్లను ఛేదించే కాళిని/ సస్యక్షేత్రాన్ని కాదు / యుద్ధ క్షేత్రాన్ని' అంటూ గళమెత్తిన కవిత్వమున్నదీ 'అపరాజిత'లో!

పోయెటిక్ విజన్‌తోనే కాదు ఒక ప్రత్యేకమైన లైఫ్ విజన్‌తో చదువాల్సిన కవిత్వం ఇదంతా! ఈ 'అపరాజిత' సంకలనానికి ముందుమాటగా 'మౌనాన్ని బద్దలుకొట్టే అపరాజిత' అంటూ ఈ సంకలన సంపాదకురాలు డాక్టర్ కే గీత అన్నట్టు స్త్రీవాదమెక్కడున్నది అనే మాటలకు దీటుగా నిలిచింది.'అపజయమెరుగని అవిశ్రాంత గీతం' అని శిలాలోలిత పీఠిక రాస్తే 'స్త్రీవాద కవిత్వ అడుగు జాడలు' అంటూ చివరలో అభిప్రాయ వీచిక కాత్యాయనీ విద్మహే రాశారు.

ఈ సంకలనంలో లబ్ధప్రతిష్ఠులైన కవయిత్రు లున్నారు, వర్ధమాన కవయిత్రులున్నారు. ఒక్కో కవయిత్రి ఒక్కో ఉద్యమరూపంగా, విప్లవ గీతంలా కనిపిస్తున్న ఈ 'అపరాజిత' సాహిత్యం లో స్త్రీవాద అస్తిత్వ కేతనాన్ని ఎగురవేసింది. 'కంప్యూటర్ కాపురం' అని ఒక కవయిత్రి రాస్తే, 'యస్ నేను ఆడపిల్లని' ఒకరు, 'పులిని నమ్మగరాదు' అని ఒకరు, 'నాకు కొన్ని మగపదాలు కావాలి' అని ఒక కవయిత్రి, 'ఆ నేను ఈ నేను' అని ఒకరు రాశారు. 'కుమ్మరి పురుగు' అని, 'రన్నింగ్ కామెంట్రీ' అనీ 'నేను నేను కాను' అనీ, 'ఆమె నొసటన ఉదయాలు' అనీ, 'వెయ్యిన్నొక్కరాత్రి' అనీ, 'దగ్ధగీతం' అనీ ఇలాంటి శీర్షికలతో కవిత్వం అలరించడం కాదు ఆలోచనల్లో పడేస్తుంది. 'నల్ల పౌర్ణిమ', 'అగ్ర మందారాలు', 'త్రీనాట్స్', 'లోతైన గాయాలు', 'ఆమె నిషేధ స్థలాలు' ఇలా కవితలన్నీ స్త్రీల మనోభావాలను అక్షరీకరించాయి.

# అభివ్యక్తి కవితాంతరంగ శక్తి



మనసులోని భావాలకు రెక్కలు తొడిగితే కవితావిహంగమౌతుంది. అందంగా, బహు చందంగా ఆ రెక్కలు తొడగడమే అభివ్యక్తీకరణ. భావాలను తావిని రువ్వే పువ్వులుగా వికసింపజేస్తే కవితోద్యానమవుతుంది. వాసంత సుమధుర దరహాసంలా ఆ పువ్వులను పూయించడమే అభివ్యక్తీకరణ. కవితావస్తువు సామాన్యమైనదైనా అభివ్యక్తీకరణ తెస్తుంది దానికి నిండుదనం, హుందాతనం. అప్పుడు అవుతుందది అసామాన్యం. అది అక్షరాలను చెక్కి శిల్పసౌందర్యాన్ని పోతపోసి హృదయనేత్రాలను అబ్బురపరుస్తుంది. భావం మేఘమైతే తొలకరి అభివ్యక్తి. అప్పుడే వర్షధారలు సమృద్ధిగా కురిసి కవిత్వపు భూమి సస్యశ్యామలమవుతుంది.

హృదయోద్యానాల నిండా పచ్చని అనుభూతులు పరచుకుంటాయి. కవిత్వపు రాత్రిని అభివ్యక్తి వెన్నెల వెలుగులతో నింపుతుంది. అభివ్యక్తి కవిత్వపు అంతరంగాన్ని అనంతంగా చాటిచెప్పే బృహత్ శక్తి. కవిత్వపు దీపాన్ని వెలుగుతో నింపే చమురు అభివ్యక్తి. అలలు తోడ్కెతే సముద్రం హొయలు బోయినట్టు అభివ్యక్తి తోడ్కెతే కవిత్వమూ హొయలుబోతుంది. అభివ్యక్తీకరణకు మెరుగులు దిద్దాలంటే కావాలి కవి హృదయానికి సాధన, శోధన, జీవితం పట్ల ఆరాధన. కవితాతత్వానికి నిండుదనాన్ని తొడిగి కవిత్వం పట్ల మనిషి మమకారాన్ని పెంచుతుంది. కవిత్వసారాన్నిపంచుతుంది. అందుకే కవిత్వానికి అభివ్యక్తి అంటే ఎంతో మమకారం.

'చంద్రుడు ఇరుసుగా జీవితం తిరుగుతున్నప్పుడు
పూలు చర్చించుకునేవి
ఈ వసంతం ఎప్పుడు వచ్చిందని
అశ్రువు ఇరుసుగా జీవితం తిరుగుతున్నప్పుడు
శిశువులు చర్చించుకుంటున్నారు
ఈ జన్మ ఎందుకు వచ్చింది'
('శేషేంద్ర చమత్కారికలు' నుంచి)

అంటాడు గుంటూరు శేషేంద్రశర్మ. ఎంత అందమైన, అద్భుతమైన అభివ్యక్తీకరణ ఇది!? వైరుధ్యం కనిపించే రెండు వేరువేరు దృశ్యాలను కవిత్వంగా అభివ్యక్తీకరిస్తున్నాడు కవి ఇక్కడ. అందులో ఒక దృశ్యం ఆనందానికి సంకేతమైతే మరో దృశ్యం విషాదానికి సంకేతం. ఇరుసు లేకపోతే చక్రం తిరగదు. చక్రానికి కేంద్రబిందువు ఇరుసు. పూల ఆనందమయ జీవితాలకు ఆనందానికి ప్రతీక అయిన చంద్రుడు కేంద్రబిందు వయ్యాడు. చంద్రోదయవేళ వసంతమాసంలో పూలు ఉబ్బితబ్బిబ్బవుతూ ఆనందమయ జీవితాన్ని గడపడం ఒక దృశ్యంలో కనిపిస్తే కన్నీటి బిందువే పసిపిల్లల జీవితాలకు కేంద్రబిందువైనప్పుడు ఆ దుర్భర జీవితాన్ని తలచుకొని వారు కుమిలిపోవడం మరో దృశ్యంలో కనిపిస్తుంది. సుఖదుఃఖాలు ఇరుసులుగా జీవితచక్రం తిరగడం అందమైన అభివ్యక్తీకరణ. ఇక్కడ రెండు వేరువేరు సందర్భాలలో ఆ సందర్భాలకు తగినట్టుగా ఆలోచనలు మారిపోయాయి. వాతావరణాలు మారిపోయాయి. అమితమైన దుఃఖాన్ని ప్రకటించేందుకు అశ్రువు ఇరుసుగా మారిపోయిందనడం శక్తిమంతమైన అభివ్యక్తీకరణ.

'తాను దెబ్బైవసంతాల
వయసు మీదేసుకున్న జీవనది
కాలం చేసిన గాయంతో/తనిప్పుడు ఒంటరిపాయలా
మా వీధిలోని/ఇంటినుంచి ఇంటికి ప్రవహిస్తుంటుంది
అనుభవాన్నంతా
భుజానికెత్తుకున్నటు వంగిన నడుము
ఎండిన డొక్కలతో
పూటపూటకు ఆకలిగండం గట్టెక్కడానికి
ప్రతి ఇంట్లో/ కంచాల గిన్నెల్లో తాను మెరుపై మెరుస్తుంటుంది
బండలపై మకిలీనే కాదు
బండబారిన మనసుల్ని తుడిచేస్తుంటుంది
ఒక ఉత్తరమై
గుండె తలుపుల్ని తడుతుంది'
('జీవనదిలా' ఖండిక నుంచి)

నిత్యజీవితంలో ఎంతోమంది బ్రతుకులతో మమేకమైపోయే ఒక వృద్ధురాల్కెన పనిమనిషి జీవనచిత్రాన్ని ఆమె పనితనపు కార్యదీక్షకు గౌరవం కల్పించేదిశగా హృదయంగమైన అబివ్యక్తీకరణతో ఆవిష్కరిస్తాడు ఈ. రాఘవేంద్ర. ఇక్కడ అభివ్యక్తీకరణ వృద్ధమహిళ జీవన పార్శ్వాల లోతుల్ని మనముందు నిలిపింది. ఆ పార్శ్వాలలో నిత్యచైతన్యశీలి అయిన జీవనది కనిపిస్తుంది. అందుకే ఎప్పుడూ శ్రమనెరుగక ఆమె ఇంటింటికీ ప్రవహించే పాయ అయి పోతుంటుంది. ఆమె నడుమును వంచేసిన అనుభవమూ కనిపిస్తుంది. ఆకలివేసినప్పుడల్లా ఆమె కంచాల గిన్నెల్లో ఆకలిని తీర్చే ఆనందం వంటి మెరుపైపోతుంటుంది. మురికి పేరుకుపోయిన బండల్ని శుభ్రం చేయడమే కాదు కరడుగట్టిన మనసుల్నీ తుడిచేసేంత మహత్యం కలది ఆమె జీవనశ్కెలి.

ఇంకా ఆమె హృదయంగమైన అక్షరాల్ని తొడుక్కొని గుండె గుండెను తాకే ఉత్తరమూ అయిపోయి తలుపులు తడుతుంది. అందుకే అమె కవిత్వమై పోయింది. ఆ కవిత్వానికి అభివ్యక్తీకరణ తోడ్కెతే అది అనుభూతుల, ఉద్వేగాల ప్రవాహమై కదులుతుంటుంది. అది హృదయతంత్రులపై ఎన్నెన్నో జీవనరాగాలను పలికిస్తూవుంటుంది.

# మనిషి మానసిక పరివర్తనకు పెద్దపీటేసిన నవల

సాహిత్యప్రక్రియల్లో నవల విస్తృతమైన కాన్వాస్ కలిగి ఉంటుంది. సామాజిక రుగ్మతలను విపులంగా లోతుగా చర్చించడానికి అవకాశం కలిగి ఉంటుంది. సమాజం మోస్తున్న ఆర్థిక, సామాజిక, రాజకీయ సమస్యలను ఎదుర్కొని పరిష్కారం వైపునకు ఏ విధంగా అడుగులేయాలో, ఎక్కడనుంచి ఈ చైతన్యం పురుడు పోసుకోవాలో సమగ్రంగా అవగాహన కల్పించేందుకు నవలా సాహిత్యానికి మించిన మరో ప్రక్రియ లేదంటే అతిశయోక్తికాదు.

వంకిరెడ్డి రెడ్డెప్పరెడ్డి 'చెరువు గండి'శీర్షికతో దళిత మహిళ, పెత్తందారీతనం, ఆధిపత్యవాదం, దోపిడీతత్వం, ముప్పేట పెరిగిన భూస్వాముల దుర్మార్గాలను ఎదిరించి, చివరకు వారిలో కనువిప్పు కలిగించే విజయాన్ని ఏ విధంగా సాధించిందో అద్భుతంగా ఆవిష్కరించారు ఈ నవలలో. ఈ నవల 1947 ఆగష్టు 14న మొదలౌతుంది. నేటికీ 75 సంవత్సరాల చరిత్రను ప్రతిబింబిస్తూ మూడుతరాల జీవితాల్ని కళ్ళకు కట్టిస్తూ, సామాజిక పరిణామక్రమాన్ని చర్చిస్తుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, కుల మత వివక్షలు అంతరించి పోకుండా మారాకు తొడుగుతున్న వైనాన్ని, ఆర్థిక దోపిడీకి,శ్రమ దోపిడీకి అలవాటు పడ్డ పెత్తందార్లు చేసే ఆగడాలు, అమానుష చర్యలు, సరికొత్త రూపుదాలుస్తూ పేదలరక్తాన్ని పిండేతీరును ఈ నవలలో రచయిత ఎత్తిచూపారు. 'చెరువు గండి' నవల ఒక ఊరి కథలాగా రాసినా, సమాచారం మాత్రం దేశ కాలమాన పరిస్థితులకు ప్రాతినిధ్యం వహించే విధంగా ఉంటుంది. ఈ నవలలో ప్రధాన కథాంశం రాయలసీమలోని దుర్గం దగ్గరలో 'చెరువు గండి' అనే గ్రామంలో ఒక భూస్వామ్య కుటుంబానికి, ఒక శ్రామికవర్గ దళిత కుటుంబానికి మధ్య జరిగిన ఘర్షణ, సుదీర్ఘపోరాటమై శ్రామికవర్గం విజయాన్ని సాధించిన అంశాన్ని ఆసక్తికరంగా చిత్రించడం జరిగింది. ఆధిపత్యవాదుల ఆగడాలకు కళ్ళెంవేసే యత్నంలో శ్రమించిన ఓ మహిళ కథగా దీన్ని అభివర్ణించవచ్చు.

ఈ నవలలో కథానాయిక ఎర్రమ్మ. ఈమె ఒక దళిత మహిళ. ఈమె తండ్రి ఇరగన్న. ప్రక్కనే ఉన్న ఉరగుండ్లోల్లపల్లి వాసి శామ్యూల్ అనే ఆయన ఎర్రమ్మకు అక్షరజ్ఞానం అందించిన గురువు. అంతేకాదు ఎర్రమ్మ అక్షరజ్ఞానంతో అన్యాయాలను ఎదిరించి ప్రశ్నించడం నేర్చుకుంది. ఎర్రమ్మ, దాశయ్యలకు ఇద్దరి కొడుకులు, వారిని చదివించారు.ఆ వూళ్ళో దేవస్రష్ట, ఆయన కుమారుడు అగ్నిస్రష్ట, ఆయన కుమారుడు 'రత్నసభారాధ్య'వంశపారంపర్య హక్కుతో పెత్తందారీ వెలగబెడుతూ దోపిడీతనానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారి ఊరిని వేధిస్తుంటారు. పేద దళితులకు చిన్నచిన్న అప్పులు యిచ్చి ఆస్తులు లాగేసుకుంటూ అక్రమ సంపాదనకు అలవాట్కెపోయారు.దేవస్రష్ట గుండెపోటుతో మరణించాక అగ్నిస్రష్ట ఆగడాలకు హద్దులేకుండా పోయింది. కరణాన్ని అన్యాయంగా చంపిస్తాడు. ఎర్రమ్మ భర్త దాశయ్యను కొట్టించి అవిటివాణ్ణి చేయిస్తాడు. తరువాత ఆ బాధలతోనే దాశయ్య మరణిస్తాడు. అట్లే అగ్నిస్రష్ట రాజకీయ ప్రత్యర్థి చెంగల్రాయుడిని ఖూనీ చేయిస్తాడు. చివరకు తన భార్య అనసూయను బావిలోకి నెట్టి చంపేస్తాడు. ఇట్లా ఊర్లో చాలామంది మహిళలు అగ్నిస్రష్ట బాధితులే. ఊళ్ళో జరుగుతున్న అన్యాయాలు అక్రమాలు చూస్తూ, వాటిని నిలువరించే శక్తిలేక ఎర్రమ్మ పెద్ద కుమారుడు 'బార్గవ' నక్సల్కెట్లలో కలుస్తాడు. బార్ఘవ అగ్నిస్రష్టను చంపేందుకు ప్లాన్ చేస్తాడు కానీ తృటిలో అగ్నిస్రష్ట తప్పించుకుంటాడు. ఎర్రమ్మ 'వాణ్ని నేను చంపుతాను, వాణ్ని నాకు వదిలేయ'మంటుంది. చివరకు పీడితమహిళల సహకారంతో ఎర్రమ్మఅగ్నిస్రష్టను చంపింది.

అగ్నిస్రష్ట కుమారుడు రత్నసభారాధ్య ఎన్నికల్లో గెలిచి హోంమంత్రి అవుతాడు. ఎట్టకేలకు బార్గవను చంపిస్తాడు. ఆ తరువాత వచ్చిన ఎన్నికల్లో రత్నసభా రాధ్య ఓడిపోతాడు. తరువాత నక్సల్కెట్లు మిలిటరీ దుస్తుల్లో వచ్చి రత్నసభారాధ్యను బంధించి యింటినుండి ఎత్తుకుపోతారు. ప్రజాకోర్టు నిర్వహిస్తారు. ప్రజలు హాజరై అతన్ని చంపమంటారు. కానీ ఎర్రమ్మ అతడిని నలగకుమ్ముతుంది, చంపటానికి ఆమె ఒప్పుకోదు. పార్టీ నాయకులు కూడా ఎర్రమ్మ మాటను అంగీకరించి అతన్ని ప్రాణాలతో వదిలేస్తారు.


తరువాత రత్నసభారాధ్య పునరాలోచనలో పడతాడు. తన నీచ జీవితాన్ని గురించి అసహ్యంగా భావిస్తాడు. ఎర్రమ్మ యింటికిపోయి ఆమె పాదాల మీదపడి తన తప్పులు ఒప్పుకొని తాను మారిపోయిన విషయం చెప్తాడు. తన ఆస్తి మొత్తం 'చెరువు గండి' గ్రామానికి ఖర్చు చేయడానికి నిశ్చయించుకుంటాడు. ఒక పేదింటి అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు. ఎర్రమ్మ, రత్నసభారాధ్యలో మానసిక పరివర్తన తేగలిగింది. తరువాత ఎర్రమ్మ ప్రశాంతంగా మరణిస్తుంది.

ఈ నవల విప్లవ భావాలను రాజేసింది కానీ, దళిత వర్గాల్లో ప్రజాస్వామ్య భావాలతో 'మనిషిని చంపడం కాదు ముఖ్యం వారిలో మానసిక పరివర్తన తేవాలనేది ముఖ్యం' అనే సందేశాన్ని చివరకు అందిస్తుంది. ఎర్రమ్మ ఒక సందర్భంలో బలాత్కారానికి గురవుతుంది. కానీ స్త్రీ ఒంటరిగా ఉన్నపుడు పశు బలంతో సెక్స్ పరంగా అనుభవించినంత మాత్రాన శీలం పోయినట్లు కాదనే సందేశాన్ని ఈ నవల అందిస్తుంది. పగ, ప్రతీకారం తీర్చుకోవడం కాదు ముఖ్యం. తప్పు చేసేవాణ్ణి మార్చడం, వాడి మానసిక పరివర్తనలో మార్పు తేవడం ముఖ్యం అనే సందేశాన్ని యిస్తుంది ఈ నవల.

ఈ నవలలో అగ్నిస్రష్ట భార్య అనసూయ కూడా పెద్ద మనసుతో ఆలోచించి ఎర్రమ్మ భర్త దాశయ్య రాసి యిచ్చిన బాండ్లను చాటుగా వారికే యిచ్చేస్తుంది. దానికి కారణం అగ్నిస్రష్ట ఎర్రమ్మను బలాత్కారంతో లొంగదీసుకున్న విషయం తెలిసి తప్పుడు సంబంధం కొనసాగకూడదనే భావనతో ఎర్రమ్మ కుటుంబాన్ని అప్పులనుండి విముక్తి చేస్తుంది.

ఈ నవల ప్రభుత్వంవారు బ్యాంకుల ద్వారా రైతుకూలీలకు అప్పులు ఇప్పించి, ఆడవాళ్ళ అదనపు ఆదాయాన్ని సంపాదించే ఎసలుబాటుతనాన్ని కల్పించడం కూడా ఒక మోసమేననే విషయాన్ని బట్టబయలు చేస్తుంది. బ్యాంకు అప్పుకు వడ్డీ కట్టలేక, ఖర్చులు పెట్టుకొని కలలు కల్లలుగా మిగిలిపోతున్న విషయాన్ని నవలాకారుడు బాగా తెలియజెప్పాడు.

ఎర్రమ్మ నేటి ఓట్ల రాజకీయం రంగుల్ని బయటపెట్టింది. రాజకీయాల్లో పాలకపక్షం, ప్రతిపక్షం తరుపున పోటీ చేసే వాళ్ళిద్దరూ డబ్బున్నవాళ్లే. ప్రజాస్వామ్యాన్ని అస్తవ్యస్తం చేస్తూ ఓట్లను కోట్లతో కొని గెలవాలనుకునేవారే. అంటే ప్రజాస్వామ్యం అసల్కెన విలువల మీద నమ్మకం లేనివాళ్లు, అడ్డదారిలో అందలం ఎక్కాలనుకునేవారు. అది ఒక విధంగా అరిష్టం. ఇది ప్రజల దౌర్భాగ్యం. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఆడే ఆట అందరికీ తెలియ చెప్పడానికి ఊతమిచ్చింది ఈ నవల. ఎర్రమ్మ చిట్టచివరకు ఒక పరిపక్వమైన మానసికస్థితి గల శాంతమూర్తిగా మారిపోతుంది. చచ్చిన కొడుకును రత్నసభారాధ్యలో చూచుకుంటున్నాననే స్థితికి చేరుతుంది. "రత్నసభారాధ్య! నీవు నా కొడుకుతో సమానం, నా చనిపోయిన కొడుకుకోసం బతికిన కొడుకును చంపను" అంటూ భూదేవంత ఓర్పు క్షమాగుణం కనబరుస్తుంది ఎర్రమ్మ.



క్షుద్ర రాజకీయాల గుట్టు విప్పడమే కాకుండా, స్వచ్ఛమైన మార్పు మనుజుల్లో రావాలని కోరుకున్న వీరవనిత ఎర్రమ్మ. సమాజంలో దోపిడీ ఆగాలి. కూడు గుడ్డ ఇల్లు విద్య వైద్యం అందరికీ అందుబాటులోకి రావాలనే దేశ సౌభాగ్యాన్ని కాంక్షించిన వనిత ఎర్రమ్మ.

వంకిరెడ్డి రెడ్డెప్పరెడ్డి 'చెరువు గండి' నవలను చైతన్యవంతమైన పోరాటస్ఫూర్తితో, విప్లవ భావాలతో, ప్రజాస్వామ్య విలువలతో, మనిషి మార్పుకు దోహదం చేసే విధంగా తీర్చిదిద్దారు. నేటికాలం ఆర్థిక ప్రలోభాలతో, అన్కెతిక విలువలతో, స్వార్థం పెట్రేగిపోతున్న అప్రజాస్వామ్యంలో కాగిపోతుంది. దీన్ని మార్చడానికి ఎంత్కెనా దోహదపడే విధంగా రచయిత నవల రాశారు. నవల రచనాశ్కెలి పాఠకుణ్ణి వెంటాడే విధంగా ఉన్నది. అందరూ చదవదగినదిగా 'చెరువు గండి' నవలను భావిస్తాను.

# విశుద్ధ భక్తులుగా మార్చే భక్తిమంత్రం దామోదర దివ్య లీల!





పరమ పవిత్రమైన కార్తీకమాసానికే 'దామోదర మాసమని' కూడా పేరు. వైష్ణవ సంప్రదాయాన్ని పాటించేవారిలో కొందరు ఈ ప్రత్యేక మాసాన్ని పౌర్ణమినుండి పౌర్ణమివరకు, మరికొందరు అమావాస్యనుండి అమావాస్య వరకు జరుపుకుంటారు. ఈ మాసం పొడుగునా భక్తులు శ్రీకృష్ణుడిని దామోదరుడిగా కొలవడం విశేషం. తల్లి యశోద చేతిలో బద్ధుడై తాడుతో రోకలికి కట్టేయించుకున్న చిన్ని కృష్ణుని లీలనే 'దామోదర లీల'గా ప్రసిద్ధి చెందింది. ఆ విశేషాలే ఈవారం ఇక్కడ.

**గోష్టే దామోదర ఇతి గోపీభిః పరిగీయత....**

శ్రీకృష్ణునికిగల ఈ దామోదర నామం గొప్పతనాన్ని ఈ శ్లోకం చక్కగా వివరించింది. శ్రీకృష్ణుడు ఏ విధంగా భక్త పరాధీనుడో 'దామోదర లీల' చాటుతుంది. శ్రీకృష్ణుడు దేవాదిదేవుడైనా, దేవతామూర్తులు అందరూ వారి ఆధీనంలోనే వున్నా తన విశుద్ధభక్తురాలైన యశోదమ్మకు మాత్రం తానే బద్ధుడయ్యాడు. అదెలా అన్నదే ఇక్కడ అత్యంత ఆసక్తికరం. యశోదా కృష్ణుల మధ్యగల ఈ వాత్సల్యరసాన్ని శ్రీల ప్రభుపాదులవారు గొప్పగా వ్యాఖ్యానించారు. 'దేవదేవుడైన శ్రీకృష్ణుని లీలలతో కలిగే సంభ్రమాశ్చర్యాలకు ఇదొక ఉదాహరణ. సకల సర్వావస్థలలోనూ భగవంతుడు భగవంతుడే. తాను దేవాదిదేవుడైనా సరే, తన శుద్ధభక్తుని ముందు మాత్రం ఒక ఆటవస్తువుగా మారతాడు. విశుద్ధభక్తులైనవారు కేవలం అంతటి నిర్మలమైన ప్రేమభావనతోనే శ్రీకృష్ణునికి భక్తిపూర్వక సేవలు చేస్తారు. ఆ సమయంలో ఆ శుద్ధభక్తులు ఒక్కోసారి భగవంతుని నిజస్థితినీ మరచిపోతుంటారు. సహజ అనురాగంతో, అప్రయత్న పూర్వకంగా, ఐశ్వర్యభావ రహితంగా వారు చేసే ఆరాధనలను భగవంతుడు మరింత ప్రియంగా స్వీకరిస్తాడు.

**భగవంతుడు ఎప్పుడు అతిప్రసన్నుడవుతాడు?**

సాధారణంగా, ఎక్కువ మంది భక్తులు భగవంతుణ్ణి ఐశ్వర్యభావంతోనే సేవిస్తుంటారు. కానీ, భక్తుడు తన విశుద్ధమైన ప్రేమానురాగాల కారణంతో 'భగవంతుడు తనకన్నా అంత ముఖ్యుడు కాదని' తలుస్తుంటాడు. అప్పుడే ఆ దేవదేవుడు అతిప్రసన్నుడవుతుంటాడు. ఆదిధామమైన గోలోక బృందావనంలో ఇలాంటి భావనలోనే దామోదర లీలలు సాగాయి. కృష్ణుని స్నేహితులు అతనిని తమలో ఒకనిగానే భావించారు. మర్యాదపూర్వకమైన ప్రత్యేకతలు చూపాలని అనుకోలేదు. అదే విధంగా, విశుద్ధభక్తులైన శ్రీకృష్ణుని తల్లిదండ్రులుకూడా అతనిని తమ పిల్లాడిలానే భావించారు. తల్లిదండ్రుల చివాట్లనూ 'వేదమంత్రాల ప్రార్థనలకన్నా ప్రియంగా' విన్నాడు. జనసామాన్యాన్ని ఆకర్షించే నిమిత్తం దివ్యధామమైన గోలోక బృందావనంలోని తన నిత్యలీలలను ప్రదర్శించేందుకు ఆ దేవదేవుడైన శ్రీకృష్ణుడు ఈ భౌతిక జగత్తులో అవతరించినపుడు తన తల్లి యశోదకు సంపూర్ణ ఆధీనతనే ప్రదర్శించాడు. వెన్నకుండలను పగులగొట్టి అందులోని వెన్నను మిత్రులకు, తోటి ఆటగాళ్లకు, బృందావనంలోని భాగ్యవంతమైన కోతులకు పంచి పెట్టి, యశోదమ్మ కూడబెట్టిన వెన్నను పాడు చేసేవాడు.

**కన్నీటి పర్యంతమైన కృష్ణుడు....**

యశోదమ్మ అది చూసి, ప్రేమతో తన పుత్రునిపట్ల ఒక బూటకపు శిక్షను ప్రదర్శించాలని అనుకుంది. సాధారణంగా, ఇండ్లలో జరిగే విధంగా 'ఒక తాడు తెచ్చి బంధిస్తున్నానని' కృష్ణుడిని భయపెట్టింది. యశోదమ్మ చేతిలోని తాడును చూసి భగవంతుడు భయంతో తల దించుకొని, సామాన్య బాలుని వలె ఏడవటం ప్రారంభించాడు. ఆ కన్నీటితో కంటి కాటుక చెదరిపోయింది. కన్నీరు చిన్నిబుగ్గలపై ఏకధాటిగా కారసాగింది. శ్రీకృష్ణుని దివ్యస్థితిని గురించి తెలిసిన కుంతీదేవికి ఈ సన్నివేశం అత్యంత ప్రియంగా తోచింది. వాస్తవానికి, శ్రీకృష్ణుడు భయానికే భయం కలిగించేవాడైనా తనను శిక్షించాలనుకున్న తల్లిని చూసి భయపడ్డాడు.

కుంతీదేవికి ఆ దేవదేవుని దివ్యత్వం తెలుసు. యశోదమ్మ ఇవేవీ పట్టించుకోలేదు. ఆమె స్థితి కుంతీదేవికన్నా ఉన్నతమైంది. యశోదమ్మ భగవంతుడినే తన పుత్రునిగా పొంద గలిగింది. అయితే, తన పుత్రుడు భగవంతుడనే విషయాన్ని యశోదమ్మ మరచిపోయేలా చేసింది ఆ దేవదేవుడే. ఒకవేళ ఆమెకు శ్రీకృష్ణుని దివ్యత్వమే తెలిసి వుంటే అతనిని శిక్షించడానికి సంకోచించేది. కానీ, తాను తన ప్రియమైన తల్లిముందు బాల్యచేష్టలను ప్రదర్శించాలని శ్రీకృష్ణుడు తలచడం వల్ల ఆ విషయాన్ని యశోదమ్మ మరచిపోయేలా చేశాడు.

**ఎంతటి అదృష్టవంతురాలో....**

ఆ తల్లి తనయుల నడుమ వాత్సల్య భావన అక్షరాలకు అందనిది. అత్యంత సహజాతి సహజంగా అది వెల్లడైంది. ఈ సంఘటనను తలచుకున్న కుంతీదేవి మోహపరవశురాలైంది. ఆ తల్లీ తనయుల ప్రేమను కీర్తించడం కన్నా మరొకటి చేయలేకపోయింది.


సర్వశక్తి సంపన్నుడైన శ్రీకృష్ణుడినే ప్రియపుత్రునిగా అదుపులో వుంచగలిగిన యశోదమ్మ ప్రేమస్థితి అద్వితీయం, అనిర్వచనీయం. చరాచర జగత్తులోని సమస్త ప్రాణులకూ ముక్తిని ప్రసాదించేవాడైన ఆ దేవదేవునితో బ్రహ్మదేవుడు గాని, పరమశివుడు గాని, చివరకు అర్థాంగి సాక్షాత్తు లక్ష్మీదేవి గాని పొందని దుర్లభమైన కృప తల్లి యశోద పొందింది (శ్రీమద్భాగవతం: 10.9.20). శ్రీల ప్రభుపాదవంటి గొప్ప విశుద్ధభక్తుని మార్గనిర్దేశకత్వంలో 'మనమూ శ్రీకృష్ణునిపై అంతటి గొప్పభక్తిని కలిగివుందాం'. అంతటి నిర్మల భక్తుడు మాత్రమే కృష్ణభక్తిని జాతి, కుల, మత బేధాలకు అతీతంగా సమస్త మానవాళికీ ప్రసాదించగలడు.

**భగవంతుడు ఒక్కడే....!**

ఎంతోమంది తాము భగవంతుడవ్వాలనే కోరికతో ఆధ్యాత్మికంగా అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. అలాంటి వారికి చివరకు మిగిలేది వట్టి ప్రయాస మాత్రమే. ఎందుకంటే, జీవాత్మ ఎన్నటికీ భగవంతుడు కాలేడు గనుక. భగవంతుడనేవాడు ఎన్నటికీ ఒక్కడే. జీవాత్మలమైన మనమంతా భగవంతుని అంశా స్వరూపులం. పరమాత్మ ముందు జీవాత్మ అత్యంత అల్పం. కేవలం మనలోని అహంకారమే మనం పరమాత్మతో సమానమనే భావనను కలిగిస్తుంటుంది. ఇది మానవుని అతిపెద్ద భ్రమ. కానీ, భక్తులు మాత్రం తమకుగల విశుద్ధమైన ప్రేమతో యశోదమ్మలా భగవంతుణ్ణే జయిస్తుంటారు. ఇది శ్రీకృష్ణుడు తన భక్తులపై చూపే కారుణ్యవర్షం. యశోదమ్మ పొందిన ఈ మహద్భాగ్యాన్ని శుకముని కొనియాడిన తీరు అపురూపం.

# అభ్యాస నిష్ఠతోనే ఆధ్యాత్మిక పరిమళం!

అభ్యాసమంటే ఉద్దేశపూర్వకంగా, నియమబద్ధంగా పదేపదే చేసే ప్రయత్నం. మనిషి జీవితం సంస్కృతి, నాగరికతలతో నిర్మితమయ్యేది కాబట్టి, మారే వ్యావహారిక విలువలను, సాంకేతిక నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అలవరచుకొని సమర్థ జీవనం గడపవలసి ఉంటుంది. కాలం గడిచేకొద్దీ ఈ మార్పుల వేగం పెరుగుతుండటం వల్ల వాటికి అనుగుణంగా మనిషి తన అభ్యాస నేర్పునూ పెంచుకోవలసి వుంటుంది. ప్రాతఃకాలంలో చేసే అభ్యాసం అనతికాలంలో సత్ఫలితాన్నిస్తుందన్నది అనుభవజ్ఞుల మాట. ఇతర జీవులలో సహజాతాల పాత్ర ఎక్కువకానీ, మనిషి జీవనంలో అభ్యాసానిదే ప్రధానపాత్ర. అది ఐహిక విషయమైనా, ఆముష్మిక విషయమైనా. సాధారణంగా ఐహిక విషయాలలో ఒకటి నేర్చుకొనడానికి చేసే చక్రీయకృషిని 'అభ్యాసం' అంటాం. ఆముష్మికాంశాలలో ఒక దిశలో స్వభావగతంగా ఎదగడానికి చక్రీయంగాగానీ, నిరంతరంగాగానీ చేసే కృషిని 'సాధన' అంటాం. ఏదేని విషయాన్ని నేర్చుకొనడంలో, నేర్చుకొన్నది దోషాలు తొలగి బలపడటంలో, బలపడింది అవగాహనలో వికసించడంలో, అట్లా వికసించింది మన స్వభావంగా మారడంలో 'అభ్యాసమే' కీలక ఊతమై నిలుస్తుంది. అప్పుడు మనం నేర్చుకొన్నది సందర్భోచితంగా, సహజంగా, సమర్థంగా, అప్రయత్న ప్రవర్తనగా ప్రకటితమవుతుంది. 'అభ్యాసం కూసు విద్య' అన్న నానుడికి అసలు అర్థం ఇదే. ఇంగ్లిషులో దీన్నే 'సెకండ నేచర్' అంటారు. అభ్యాసానికి ముందు నిర్ధారిత విషయ పరిజ్ఞానం, ప్రయోగ మార్గదర్శనం అనుభవజ్ఞులైన గురువుల నుండి తప్పనిసరిగా పొందవలసిందే. లేకుంటే కృషి సరైన దిశలో సాగక సత్ఫలితాలకు బదులు దుష్ఫలితాలు వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే అంటారు మనవాళ్ళు, 'గురువు లేని విద్య గుడ్డివిద్య' అని. సాధారణంగా అభ్యాస స్థాయి వ్యక్తి వయసు, మానసిక పరిణతి, పట్టుదలపైన ఆధారపడి ఉంటుంది. మనకు అందే, మనం పొందే ప్రేరణాబలం వాటి



పరిమితులను కొంతవరకు చెరుపగలుగుతుంది. అభ్యాసం కుంటుబడకుండా సవ్యంగా, సబలంగా సాగడానికి తదనుకూలమైన ఆహార అలవాట్లు, పరిసరాలు, సాంగత్యం వంటివీ అత్యవసరం. ఈ విషయంలో జాగ్రత్తపడకుంటే తగు స్థాయి ఫలితాలు సంప్రాప్తించకపోగా, వైఫల్యమూ ఎదురవవచ్చు. అభ్యాస నాణ్యతను, ఉన్నతిని నిర్ణయించే ఇంకొక అతి ముఖ్యమైన విషయం 'అభ్యాసకుడి వైఖరి' (ఆటిట్యూడ్). ఇది స్వార్థపూరితమైతే అభ్యాసం తీవ్ర ఏకాగ్రతతో సాగినా, ఆశించిన ఫలం సంపూర్ణంగా లభించినా, ఆ ఫల వినియోగం పరహితాన్ని మరచి అహంకారంతో, అత్యాశతో, భయక్రోధాదులతో సాగి పాపాన్ని మూటకడుతుంది. పర్యవసానంగా అది సాధకుని వినాశనానికే దారితీస్తుంది. ఒకవేళ ఈ వైఖరి పరహితార్థమైందైతే ఆ ఫల వినియోగం సకల సజ్జన సుఖాపేక్షతో, ప్రేమ, సంతోషం, తృప్తి వంటివాటితో సాగి పుణ్యాన్ని మోసుకొస్తుంది. ఈ నిస్వార్థ వైఖరే నిరంతరం అంతఃప్రేరణగా ప్రజ్వలిస్తూ అభ్యాసాన్ని పవిత్రనిష్ఠగా, నిరవధికంగా కొనసాగింపజేస్తుంది. అలాంటి అభ్యాసమే జీవన కౌశలాలను పదునుపరచి, మూల్యాలను మెరుగుపరచి, సమర్థతతో సమాజంలో ఆదర్శప్రాయునిగా నిలిపి, అనుభూతిలో సంతృప్తిని నింపి, సంస్కారాలకు పుణ్యబలాన్నిచ్చి జన్మను సార్థకం చేస్తుంది. మన జీవన విధానంలోకానీ, పలు రకాల అభ్యాసాలలోకానీ ఆధ్యాత్మిక ప్రభను అంటే ప్రకృతిపట్ల, సమాజం పట్ల, వాటి శాసనసూత్రమైన ఈశ్వర శక్తిపట్ల ఆర్ద్ర, అభేద, ఆత్మీయ, అనన్య భావనను ప్రతిష్ఠింపజేయాలి. దీంతో దక్కే ఏ ఫలాన్నైనా 'ఈశ్వర ప్రసాదం'గా స్వీకరించినప్పుడు జీవితమే కర్మయోగమవుతుంది. ఏ కర్మాసక్తులూ కట్లు బిగించవు. అప్పుడు జీవితం 'మోక్ష పథగామి'గానూ సాగుతుంది. అభ్యాస జీవనాన్ని ఇలా ఆధ్యాత్మిక పరిమళంతో నింపుకోవడం ద్వారా భౌతిక జీవనాన్ని ధర్మబద్ధంగా సంపన్నమయం చేసుకోగలం. ఫలితంగా పుణ్యగంధాల ఆత్మానందంతో మానవజన్మ ధన్యమవుతుంది.



# సకల ఐశ్వర్య ప్రదాయకం ఓం శ్రీం శ్రియై నమః

సువర్ణవృద్ధిం కురు మే గృహే శ్రీః
సుధాన్యవృద్ధిం కురు మే గృహే శ్రీః
కళ్యాణవృద్ధిం కురు మే గృహే శ్రీః
విభూతి వృద్ధిం కురు మే గృహే శ్రీః

ధనం, ధాన్యం, పుత్రులు, మిత్రులు, బంధువులు, వాహనాలు, భృత్యులు, దాసీజనం మొదలైన వానిని 'అష్ట ఐశ్వర్యాలు' అని పూర్వకాలంలో అనేవారు. ప్రస్తుత కాలంలో ఆరోగ్యం, సంతోషం, సంతృప్తి, ప్రశాంతత, ధైర్యం, జ్ఞానం, విద్య, శక్తి మొదలైన వానిని 'అష్ట ఐశ్వర్యాలు'గా గుర్తించాల్సి ఉంది. మొదటివి కనిపించే ఐశ్వర్యాలు కాగా, తర్వాతివి కనిపించకుండా మనలోనే ఉండి మనలను ప్రేరేపించి, మన స్థాయిని పెంచే ఐశ్వర్యాలు. ఇవన్నీ మనలో, మనతోనే ఉండాలంటే మనం వాటికి మూలమైన పాంచభౌతిక శక్తితో కలిసి ఉండాలి. కనిపించే సంపదలన్నీ అనుభవిస్తుంటే అయిపోతుంటాయి. కనిపించని సంపదలు ఎంత అనుభవించినా తరగకుండా ఉంటాయి. సంతోషం, ధైర్యం, ఆరోగ్యం, జ్ఞానం మొదలైన వాటన్నిటికీ లెక్కలు కట్టడం అసాధ్యం. ఇవి తరగని సంపదలు. ఇంకా పెరుగుతూనే ఉంటాయి. వాటిని ఇంకా పెంచుకుంటూ పోవాలి. అవి పెరుగుతుంటేవ్యక్తిలో శక్తి పెరిగి, నందాత్ముడవుతుంటాడు. మనలోని, మన చుట్టూ వున్న పాంచభౌతిక శక్తికే 'శ్రీం' అని పేరు. ఆ శక్తితో మనం ఎంత ఎక్కువసేపు గడిపితే అంతగా మనలోకి ప్రసరించి, మన మానసిక, భౌతిక శరీరాలను సమన్వయం చేస్తుంది. ఈ లోకంలో మనం శక్తివంతులం అనిపించుకోవాలంటే శరీరానికి, మనసుకు రెండిటికీ శక్తి ఉండాల్సిందే. పార్వతిగా, లక్ష్మిగా, సరస్వతిగా భావించే మూలరూపమైన ఆ 'శ్రీమాత'ను నిరంతరం ఉపాసిస్తే ఈ కనిపించే, కనిపించని సంపదలు, ఐశ్వర్యాలన్నీ మనతోనే ఉంటాయి. పాంచభౌతిక శక్తిలోనే సంపదలన్నీ ఇమిడి ఉంటాయి. అందుకే ఆ శక్తి స్వరూపిణి అయిన శ్రీమాతను 'ఓం శ్రీం శ్రియై నమః' అనే మంత్రంతో ఆరాధిద్దాం. ధన కనక వస్తు వాహన పుత్ర పౌత్రాది దృశ్య సంపదలు అపరిమితంగా మనతో చేరడానికి శక్తి, జ్ఞానం, ధైర్యం, సంతృప్తి మొదలైన అదృశ్య సంపదలు మనతోపాటే ఉండటానికి కనీసం ఒక గంట ఈ జపం చేద్దాం. అవసరాన్నిబట్టి దీక్షతో లక్షల సంఖ్యలో జపిస్తే సర్వ దారిద్ర్యాలు దూరమవుతాయి.

# రాశిఫలాలు



**మేషం :** ఇతరులతో గౌరవించబడే ప్రయత్నంలో సఫలమవుతారు. కుటుంబపరిస్థితులు సంతృప్తికరంగా లేకపోవడంతో మానసిక ఆందోళన చెందుతారు. ప్రతిపని ఆలస్యంగా పూర్తిచేస్తారు. వృత్తిరీత్యా జాగ్రత్తగా ఉండటం మంచిది. విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

**వృషభం :** విందులు, వినోదాలకు దూరంగా ఉండట మంచిది. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశం ఉంది. మానసిక ఆందోళనతో ఉంటారు. కుటుంబంలో మార్పును కోరుకుంటారు. ప్రతి చిన్న విషయంలో ఆటంకాలు ఎదురవుతాయి. ఆరోగ్యం గురించి ప్రత్యేక శ్రద్ధ అవసరం.

**మిథునం :** తోటివారితో విరోధం ఏర్పడకుండా జాగ్రత్త వహించడం మంచిది. వ్యాపార మూలకంగా ధననష్టం కలిగే అవకాశాలు ఉన్నాయి. వృధా ప్రయాణాలు ఎక్కువ చేస్తారు. కుటుంబ విషయాల్లో అనాసక్తితో ఉంటారు. స్త్రీలు విశ్రాంతి తీసుకోవడం అవసరం.

**కర్కాటకం :** ప్రయాణాలు ఎక్కువగా చేయాల్సి వస్తుంది. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. అనవసరంగా డబ్బు ఖర్చవడంతో ఆందోళన చెందుతారు. విదేశయాన ప్రయత్నాలకు మార్గం సుగమమవుతుంది. ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించక తప్పదు.

**సింహం :** నూతన గృహకార్యాలపై శ్రద్ధవహిస్తారు. ఆకస్మిక ధనలాభంతో ఆనందిస్తారు. బంధు, మిత్రులతో కలిసి విందు, వినోదాల్లో పాల్గొంటారు. దైవదర్శనం చేసుకుంటారు. భక్తిశ్రద్ధలు అధికమవుతాయి. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరింపబడతాయి.

**కన్య :** ఆకస్మిక ధనలాభంతో రుణబాధలు తొలగిపోతాయి. సమాజంలో మంచిపేరు సంపాదిస్తారు. ఇతరులు మిమ్మల్ని ఆదర్శంగా తీసుకోవడానికి కృషిచేస్తారు. స్త్రీలు, బంధు, మిత్రులను కలుస్తారు. కుటుంబపరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి.

**తుల :** ఆకస్మిక ధనలాభం ఉంటుంది. కుటుంబం అంతా సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ప్రయత్నకార్యాల్లో దిగ్విజయాన్ని పొందుతారు. ఒక ముఖ్యమైన పని పూర్తికావడంతో మిక్కిలి ఆనందిస్తారు. కీర్తి, ప్రతిష్ఠలు పొందుతారు. శాశ్వత పనులకు శ్రీకారం చుడతారు.

**వృశ్చికం :** మీ పరాక్రమాన్ని ఇతరులు గుర్తిస్తారు. శత్రుబాధలు తొలగిపోతాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. మిక్కిలి ధైర్య, సాహసాలు కలిగి ఉంటారు. సూక్ష్మబుద్ధితో విజయాన్ని సాధిస్తారు. ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. ఆకస్మిక లాభాలు ఉంటాయి.

**ధనుస్సు :** ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. పోట్లాటలకు దూరంగా ఉండటం మంచిది. అనారోగ్య బాధలను అధిగమించడానికి ఔషధసేవ తప్పదు. స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో తొందరపాటు పనికిరాదు. రుణప్రయత్నాలు ఆలస్యంగా ఫలిస్తాయి. సోదర వైరం కలిగే అవకాశం ఉంటుంది.

**మకరం :** కుటుంబ కలహాలు దూరమవుతాయి. ప్రయత్నకార్యాలకు ఆటంకాలు ఎదురవుతాయి. వృథా ప్రయాణాల వల్ల అలసట చెందుతారు. చెడు పనులకు దూరంగా ఉండటం మంచిది. అందరితో స్నేహంగా ఉండటానికి ప్రయత్నించాలి. ఆర్థిక ఇబ్బందులు స్వల్పంగా ఉంటాయి.

**కుంభం :** కోరుకునేది ఒకటైతే జరిగేది మరొకటవుతుంది. అనారోగ్య బాధలు స్వల్పంగా ఉన్నాయి. వేళప్రకారం భుజించడానికి ప్రాధాన్యమిస్తారు. చంచలం వల్ల కొన్ని ఇబ్బందులెదురవుతాయి. మనోనిగ్రహానికి ప్రయత్నించాలి. పిల్లలపట్ల ఏమాత్రం అశ్రద్ధ పనికిరాదు.

**మీనం :** కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. సహనంవహించడం అన్నివిధాలా మేలు. పరిస్థితిని మీ అదుపులో ఉంచుకోండి. బంధు, మిత్రులతో విరోధం ఏర్పడకుండా జాగ్రత్తపడటం మంచిది. అనవసర ధనవ్యయంతో రుణప్రయత్నాలు చేయాల్సి వస్తుంది.

## సమస్యా నీదే.. పరిష్కారమూ నీదే!

- గీతా వాక్యం - న కాంక్షే విజయం కృష్ణ! న చ రాజ్యం సుఖానిచ!
- కింనో రాజ్యేన గోవింద! కిం భోగైర్జీవితేన వా? (భగవద్గీత - 1- 32)

'కృష్ణా! నాకు విజయంపై కోరికలేదు. ఓ! గోవిందా.. నాకు ఈ రాజ్యంతో గానీ, భోగాలతో గానీ, జీవితంతో గానీ ఏ విధమైన ప్రయోజనం లేదు!' అంటూ కురుక్షేత్రంలో అర్జునుడు అస్త్రసన్యాసం చేశాడు. అది కురుక్షేత్రం. అంటేనే కార్యక్షేత్రం. అక్కడ కర్తవ్యాన్ని నిర్వహించాలే కానీ, సొంత భావనలకు అవకాశం ఉండదు. క్షత్రియుడిగా అర్జునుడి కర్తవ్యం ధర్మహాని జరుగుతున్న సమయంలో, అధర్మాన్ని నిగ్రహించి ధర్మాన్ని సంస్థాపించడం. నిర్దేశిత ధర్మాచరణకు సిద్ధమై కురుక్షేత్రానికి వచ్చిన అర్జునుడు.. ఇరుసైన్యాలలో తనవారిని చూసి, విమోహియై అస్త్రసన్యాసం చేస్తున్నాడు. కార్యాచరణవేళ సమర్థుడైన వ్యక్తి అస్త్రసన్యాసం చేయడం అవాంఛనీయం. లక్ష్యం నిర్దేశితమైంది. వనరులు సమకూర్చుకున్నారు. యోజనా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఎవరి బాధ్యతలు వారికి అప్పగించడం జరిగింది. అర్జునుడి కార్య నిర్వహణా దక్షత, ధైర్య సాహసాలు, ప్రజ్ఞాపాటవాలు, గతంలో తాను సాధించిన విజయాలు ప్రాతిపదికగా.. అతణ్ని పూర్తిగా నమ్మి ఏడు అక్షౌహిణులతో పదకొండు అక్షౌహిణుల సైన్యాన్ని ఎదిరించడానికి రంగం సిద్ధమైంది. ఆ సమయంలో అర్జునుడు అస్త్రసన్యాసం చేశాడు. ఇక్కడ కృష్ణా, గోవిందా అనే రెండు సంబోధనలు ముఖ్యమైనవి. 'కృష్..' అనేది భూవాచకం. భూమి ఫలితాన్నిస్తుంది. భూమి కృషికి, కర్తవ్యపాలనకు సంకేతం. 'ణ' కారం నివృత్తి మార్గం. ఫలితాపేక్షతో చేసే కృషి వల్ల మోక్షం రాదు. ఫలితాపేక్షలేకుండా ఎవరైతే కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వహిస్తారో వారికి మోక్షం వస్తుంది. 'నేను చంపుతున్నాను' అనే కర్తృత్వ భావన అర్జునుడిలో ఉంది. గోవిందా అనడంలో 'గో' శబ్దం ఇంద్రియాలకు ప్రతీక. ఇంద్రియాలను జయించిన వారికి శాశ్వతమైన ఆనందాన్ని ఇచ్చేవాడు గోవిందుడు. ఇంద్రియాలను జయించడం అంటే ఇంద్రియాల పని విధానాన్ని అవగాహన చేసుకొని, వాటిని ప్రభావవంతంగా ఉపయోగించుకోవడం మాత్రమే. జీవితమనే మరొక పదం ఉన్నది ఇందులో. బతకడం వేరు, జీవించడం వేరు. జీవించడంలో ప్రయోజనం ఉంది. అర్థవంతమైన, ప్రయోజనకరమైన, ఆనందకరమైన, అభ్యుదయకారకమైనది జీవితం. సుఖభోగాలు రెండూ భౌతిక జీవితానికి సంబంధించినవే. ప్రలోభానికి గురిచేసేవే. రాజ్యమూ శాశ్వతం కాదు. 'అశాశ్వత రాజ్యభోగాల కోసం, అయినవారిని అంతమొందించడం యుక్తమా?' అని సంశయిస్తున్నాడు అర్జునుడు. అర్జునుడు ఇప్పుడు తన సమర్థత కన్నా తక్కువ స్థాయి భావాలని ప్రదర్శించి అవే ఉదాత్తమైనవిగా భ్రమపడుతున్నాడు. తనకు యుద్ధాలు కొత్తనా? ఎన్నో యుద్ధాలలో పాల్గొని జైత్రయాత్రలు చేశాడు. ఆ యుద్ధాలలో ఎందరు చనిపోలేదు? పిరికివాడా.. అంటే కాలకేయ నివాత కవచాది రాక్షసులను నిగ్రహించాడు. ఇంద్రుని అర్ధ సింహాసనాన్ని అధిష్ఠించాడు.